PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 108 | విజయవాడ, బుధవారం 20 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 20 November 2024 | Rs

సిటీ◆

అంగన్‌వాడీలపై మరో భారం

- కేంద్రాల వద్ద పోషక వనాల ఏర్పాటు
- పర్యవేక్షణ బాధ్యత సిబ్బందిపైనే
- ఇబ్బందులు తప్పవంటున్న వర్కర్లు

3

ఫైనల్‌కు భారత్

మహిళల ఆసియాకప్ హాకీ టోర్నీ

8

జిల్లా రోడ్లపైనా టోల్

- వ్యతిరేకిస్తే గుంతలే గతి
- శాసనసభలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలోని అన్ని ప్రధాన రోడ్లపై టోల్‌గేట్లు ఏర్పాటుచేయాలని ఆలోచిస్తున్నాం. రోడ్ల నిర్వహణను అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగిస్తాం. వారు టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. దీనికి ప్రజలను ఒప్పించాల్సిన బాధ్యత ఎంఎల్‌ఏలదే. ఎక్కడైనా వ్యతిరేకిస్తే అక్కడ గుంతల రోడ్లతోనే ఉండాలి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం శాసనసభలో రహదారుల అంశంపై మాట్లాడుతూ ఆయన ఈ విషయం ప్రస్తావించారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రోడ్లపైన పైలట్ ప్రాజెక్టుగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. 'ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. కానీ, ఆలోచనలు ఉన్నాయి' అని అన్నారు. ' జనవరిలో పండగ సందర్భంగా ఎవరైనా రాష్ట్రానికి వస్తే మెరుగైన రోడ్లు కనిపించాలన్న ఆలోచనతో ఈ విధంగా చేస్తున్నాం.' అని ఆయన అన్నారు. ఈమేరకు మీలో ఆసక్తి ఉన్న వారు చేతులు ఎత్తాలని చంద్రబాబు కోరగా పలువురు ఎంఎల్‌ఏలు చేతు లెత్తారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర,జాతీయ రహదారులకు వెళ్లే మార్గాల్లో టోల్‌గేట్లు ఏర్పాట్లు

చేయాలని భావిస్తున్నట్లు సిఎం తెలిపారు. గత ప్రభుత్వం అన్ని రహదారులను విచ్ఛిన్నం చేసిందని, పెద్ద ఎత్తున గుంతలు పడినా పట్టించుకోలేదన్నారు. నిధుల కొరత కారణంగా గ్రామీణ రహదారులు కాకుండా పట్టణాల నుంచి జిల్లా కేంద్రాలకు వెళ్లి ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు టోల్ గేట్లు పెట్టాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఆటోలు,ద్విచక్ర వాహనాలకు మినహాయింపు ఇస్తూ మిగతా నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనదారుల వద్ద టోల్ ఫీజు వసూలు చేయాలని ఆలోచిస్తున్నామని వివరించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తానే పిపిపి పద్ధతిలో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదన చేశానని అప్పట్లో తనను అందరూ వ్యతిరేకించారని, కానీఇప్పుడు దేశ వ్యాప్తంగా నాలుగు, ఆరు, ఎనిమిది, 14 లైన్ల జాతీయ రహదారులు కూడా వచ్చాయని, అన్నింటికి టోల్‌గేట్లు వచ్చాయన్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి అభివృద్ధి చెందిన తరువాత తక్కువ సమయంలోనే ఎక్కువ దూరం వెళ్తున్నారని తెలిపారు. 'ఒక ఆలోచన దేశాన్ని, ప్రపంచాన్ని మారుస్తుంది.' అని బాబు అన్నారు.

విశాఖలో ఘోరం

వీడియో చిత్రీకరణ.. బెదిరింపులు

బాధితురాలి ఆత్మహత్యాయత్నం

నిందితుల్లో ముగ్గురు న్యాయ విద్యార్థులు

పెళ్లి పేరుతో నయవంచన • స్నేహితులతో కలిసి పలుమార్లు అత్యాచారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలో మహిళలపై అకృత్యాల పర్వానికి అంతులేకుండా పోతోంది. తాజాగా ఆర్థిక రాజధాని విశాఖలో మరో ఘోరం చోటుచేసుకుంది. ప్రేమ, పెళ్లి పేరుతో ఒక యువతిని మోసం చేయడంతో పాటు, తన స్నేహితులను కూడా ఆమెపై పలు మార్లు అత్యాచారానికి ఉసిగొల్పిన ఒక కామాంధుని ఉదంతం వెలుగులోకి వచ్చింది. వీరి బారినుండి బయటపడే మార్గం తోచక ఆ బాధిత యువతి ఆత్మహత్యాయత్నం చేయడంతో ఈ దారుణం బట్టబయలైంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనలో బాధిత యువతితో పాటు, నిందితుల్లో ముగ్గురు న్యాయవిద్యార్థులు కావడం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. బాధితురాలి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం... గాజువాక ప్రాంతంలోని పెదగంట్యాడకు చెందిన ఒక విద్యార్థిని విశాఖ నగర పరిధి పోతినమల్లయ్యపాలెంలోగల న్యాయ విద్యా పరిషత్ కళాశాలలో న్యాయ విద్య అభ్యసిస్తోంది. అదే కళాశాలకు చెందిన వంశీ అనే విద్యార్థి ఆమెకు ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి విశాఖ నగరంలోని డాబాగార్డెన్స్‌లోగల తన స్నేహితుని గదికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన అదే కళాశాల విద్యార్థి వంశీ స్నేహితుడు బొడ్డు జగదీష్ (27) దీన్ని రహస్యంగా వీడియో తీశాడు. ఆ వీడియోను చూపి బెదిరిస్తూ వంశీ, జగదీష్‌లతో పాటు మరో ఇద్దరు కలిసి ఆ విద్యార్థినిపై అదే రూమ్‌లో మరోమారు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటన ఆగస్టులో జరగగా ఆ తరువాత కూడా ఈ అమానుష కాండ కొనసాగింది. బాధిత యువతి ఎన్నిసార్లు బతిమలాడినా, కన్నీళ్లు పెట్టుకున్నా ఫలితం కనిపించకపోగా నిందితులు మరింతగా బరితెగించారు. దీంతో ఏం చేయాలో అర్థం కాని ఆ విద్యార్థిని పెదగంట్యాడలోని తన నివాసంలో సోమవారం (ఈ నెల 18వ తేది) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తండ్రి ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. జరిగిన ఘోరం తెలియడంతో వెంటనే కుటుంబ సభ్యులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి నిందితులను నలుగురినీ అదుపులోకి తీసుకున్నారు. వారిలో వంశీ, ఆనంద్, జగదీష్ లా స్టూడెంట్స్ కాగా, మరో నిందితుడు రాజేష్ వరుణ్ మోటర్స్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అత్యాచార ఘటనపై సోమవారం సాయంత్రం తమకు ఫిర్యాదు అందిందని, సంఘటన తీవ్రత దృష్ట్యా నగర పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందించామని టూటౌన్ పోలీసులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధిత యువతి నుంచి స్టేట్‌మెంట్ తీసుకొని ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

విద్యార్థినికి న్యాయం చెయ్యాలి : ఎస్‌ఎఫ్‌ఐ

నిందితులను కఠినంగా శిక్షించాలని, లా విద్యార్థినికి న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాము, ఎల్‌జె నాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రశాంతమైన విశాఖ నగరంలో అనేక అత్యాచార ఘటనలు చోటుచేసుకుంటున్నా అడ్డుకట్ట వేయడంలో పోలీసులు విఫలమవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత స్పందించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కఠినంగా శిక్షిస్తాం : హోం మంత్రి

ఈ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యాచారానికి పాల్పడిన యువకులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం ఉండగా ఉంటుందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రూ అప్ ఉపసంహరించకపోతే

రాష్ట్రవ్యాప్త ఆందోళన

- విద్యుత్ భారాలపై ధర్నాలో వామపక్ష నాయకుల హెచ్చరిక

విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసనలో పాల్గొన్న వామపక్షాల నాయకులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలపై మోపిన విద్యుత్ ట్రూఅప్ భారాలను ఉపసంహరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని వామపక్ష నాయకులు హెచ్చరించారు. విద్యుత్ భారాలు తగ్గించాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యాన మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారాలను తగ్గిస్తూ అసెంబ్లీ ముగిసేలోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ మీటర్లు ఎవరు అడిగారని పెడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రాన్ని కట్టబెట్టడం కోసం చేస్తున్న ఈ ప్రయత్నాల వల్ల ప్రజలపై పెనుభారాలు పడి, కుటుంబాలన్నీ అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు కట్టలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇంకా భారాలు వేయడం ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంత పెద్దఎత్తున భారాలు మోపిన దాఖలా లేదని అన్నారు. ట్రూఅప్ ఛార్జీలు గత ప్రభుత్వ విధానాల వల్ల వచ్చిందని, దాన్ని కొనసాగిస్తున్నామని చెబుతున్నారని, అటువంటప్పుడు గత ప్రభుత్వం స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఒప్పందాలు చేసుకుందని, వాటిని కూడా అమలు చేయాలని డిమాండు చేశారు. వేతనాలు పెంచుతామని గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం వేతనాలు పెంచుతారా లేదా చెప్పాలని నిలదీశారు. సర్వేరాళ్లు, పాసుపుస్తకాలు ఎత్తేశారని, అటువంటప్పుడు విద్యుత్ భారాలను ఎందుకు ఎత్తేయడం లేదని ప్రశ్నించారు. మోడీని నమ్మిన వారు ఎవ్వరు బాగుపడలేదని, రాష్ట్రంలో వైసిపి అధ్యక్షుడు జగన్‌తోపాటు మిగతా 7లో

పూలింగ్‌తో పరిశ్రమలకు భూములు

- ఎస్‌ఐపిబి సమావేశంలో చంద్రబాబు ఆదేశం

2

2027కు పోలవరం పూర్తి

- శాసనసభలో ముఖ్యమంత్రి ప్రకటన

2

ఆరోగ్యమిత్రలకు హెచ్‌ఆర్ పాలసీ అమల్జేయాలి

- మండలి 'ప్రస్తావన'ల్లో కె.ఎస్ లక్ష్మణరావు

2

పోలింగ్ ముందు డబ్బుల ఎర

అడ్డంగా దొరికిన బిజెపి జాతీయ ప్రధానకార్యదర్శి వినోద్ తావ్డే

ముంబయి : మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు ముందు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఓటర్లకు డబ్బు పంచుతూ అడ్డంగా దొరికిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అయ్యింది. తక్షణమే నిందితులను అరెస్టు చేయాలని, ఇసి తన పని చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తాయిలాలు పంచుతున్న తావ్డేను బహుజన్ వికాస్ అఘాడీ (బివిఎ) కార్యకర్తలు మంగళవారం అడ్డుకొని ఘెరావ్ చేశారు. తావ్డేకు చెందిన హోటల్ గదిలో రూ.9.93 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎన్నికల కమిషన్ అధికారి ఒకరు తెలిపారు. మూడు గంటల గందరగోళం తర్వాత హోటల్‌లో పత్రికా సమా వేశాన్ని నిర్వహించాలని తావ్డే తదితర బిజెపి నేతలు నిర్ణయించారు. దీనిని ఎన్నికల కమిషన్ అధికారులు అడ్డుకొన్నారు. పత్రికా సమావేశాన్ని నిర్వ హించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ ఘటనపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

తావ్డేను తక్షణం అరెస్టు చేయాలి : సిపిఎం డిమాండ్

అన్ని పద్ధతులు విఫలమైనప్పుడు ఓట్లను కొనుగోలు చేసే పద్ధతి బిజెపిలో పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకూ పేరుకుపోయిందని సిపిఎం విమర్శించింది. ఇందులో భాగస్వాములైన బిజెపి ప్రధాన కార్యదర్శి వినోద్‌తావ్డే, ఇతరులను అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఎన్నికల కమిషన్ తన పని చేయాలని సూచించింది.

డబ్బులు పంచుతూ పట్టుబడిన వినోద్ తావ్డే

రూ.5 కోట్లతో అడ్డంగా దొరికారు : బివిఎ

తావ్డే నగదు పంచుతూ అడ్డంగా దొరికారని బివిఎ కార్యకర్తలు చెప్పారు. తావ్డే వద్ద ఓ డెయిరీ ఉందని, అందులో రూ.15 కోట్ల పంపిణీకి సంబం ధించిన ప్రస్తావన ఉన్నదని వారు తెలిపారు. తావ్డే ఐదు కోట్ల రూపాయల నగదుతో వచ్చారని బివిఎ ఎమ్మెల్యే హితేంద్ర ఠాకూర్ చెప్పారు. ఆ డెయిరీని హితేంద్ర కుమారుడు క్షితిజ్ ఠాకూర్ చేజిక్కించు కోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎన్నికల ప్రచారం ము గిసినప్పటికీ తావ్డే విరార్‌కు ఎందుకు వచ్చారని క్షితిజ్ ప్రశ్నించారు. హోటల్‌లో సిసి టీవీలను ఆపేసి నగదు పంచారని బివిఎ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు మహారాష్ట్ర, జార్ఖండ్‌లో పోలింగ్

7

వివేకానంద రెడ్డి హత్య కేసులో

కడప ఎంపీ అవినాష్‌కు నోటీసులు

- చైతన్యరెడ్డి, కృష్ణారెడ్డికి కూడా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వైసిపి నేత, కడప ఎంపి అవినాష్ రెడ్డికి, డి.శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డికి, వివేకానందరెడ్డి పిఎ ఎంవి కృష్ణా రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో వీరికి బెయిల్ రద్దు చేయాలని వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను మంగళవారం సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజీవ్ కుమార్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన వ్యక్తిని చైతన్య రెడ్డి జైలుకెళ్లి బెదిరించారని సునీత తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఒక ప్రైవేటు డాక్టర్‌గా ఉన్న వ్యక్తి జైలుకెళ్లి సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సిజెఐ 'డాక్టర్ రెగ్యులర్‌గా వెళ్లే వారా? కాదా?' అని ప్రశ్నించారు. డాక్టర్ చైతన్య జైలు నిబంధనలకు విరుద్ధంగా వెళ్లారని, ఆయన రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు నిర్వహించే డాక్టర్ కాదని లూథ్రా సమాధానం ఇచ్చారు. ఈ కేసులో చైతన్యను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతివాదులుగా చేర్చాలని కోరారు. ఈ కేసులో ఎనిమిదో నిందితుడిగా ఉన్న అవినాష్ రెడ్డి దర్యాప్తులో కీలకమైన వ్యక్తి అని లూథ్రా తెలిపారు. ఇరువురిని ప్రతివాదులుగా చేర్చడానికి అంగీకరించిన ధర్మాసనం వారికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి 3 తర్వాత చేపట్టనున్నట్లు పేర్కొంది.

అమ్మకానికి ప్రభుత్వ బ్యాంక్‌ల వాటాలు

- నాలుగింటిలో విక్రయ యోచన

3

అమాంతం లేచి.. పడిన మార్కెట్లు

- నేడు సెలవు

3

ముంచుకొస్తున్న ముప్పు

- నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు
- 2001 ఎకరాల్లో లే అవుట్‌కు ఎపిఐఐసి దరఖాస్తు
- గత ప్రభుత్వ నిర్ణయం టిడిపి కూటమిలో అమలు
- కాలుష్య భయంతో ప్రజలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ కాలంలో చేసిన నిర్ణయాల అమలుకు టిడిపి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు (బిడిపి) ఏర్పాటు చేయాలని 2023 సెప్టెంబరు 20న అప్పట్లో మంత్రి మండలి ఆమోదించింది. ఆ ప్రభుత్వం ఆమోదించిన బల్క్‌డ్రగ్ పార్కుకు ఈ ప్రభుత్వంలో పనులు ప్రారంభం కానున్నాయి. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి)లో భాగంగా నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్ కోసం 4,500 ఎకరాల భూమి సేకరించింది.

నక్కపల్లి మండలంలోని బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్.పురం, రాజయ్యపేట, వేంపాడులో సుమారు 2001 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్కు లే-అవుట్ అనుమతులకు విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వికెపిసిపిఐఆర్ యుడిఎ)కి లే అవుట్ కోసం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) దరఖాస్తు చేసింది. లే-అవుట్‌కు ఎపిఐఐసి అనుమతులు లభించిన తరువాత బల్క్‌డ్రగ్ పార్కు అవసరాలకు తగినట్లు లే-అవుట్ వేయనుంది. మొదట ఈ బల్క్‌డ్రగ్ పార్కు ప్రస్తుతం కాకినాడ జిల్లా తొండంగి మండలం కెపి.పురం, కోదాడ మధ్య ఏర్పాటు చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖకు 2020 అక్టోబర్ 15న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. రెండు వేల ఎకరాల్లో ఏర్పాటు చేసే బల్క్‌డ్రగ్ పార్కు ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే, దీన్ని ఆ ప్రాంత ప్రజలు, మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకించారు. 2023 జూన్ 6న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మత్స్యకారులు, రైతులు, స్థానిక ప్రజలు బల్క్‌డ్రగ్ పార్కుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి), కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర, రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేశారు.

బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయనున్న ప్రాంతం

ప్రజల నుంచి వ్యతిరేకత పెరగడంతో కాకినాడ ప్రాంతంలో పార్కు ఏర్పాటును వైసిపి ప్రభుత్వం విరమించుకొని అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటుకు నిర్ణయించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. తాజాగా పార్కు ఏర్పాటుకు లే-అవుట్ కోసం ఎపిఐఐసి దరఖాస్తు చేసింది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్పు చేయడానికి చెల్లించాల్సిన పన్ను నుంచి 2018 ఫిబ్రవరి 19న జారీ చేసినమిగతా 7లో

ట్రాన్స్‌ఫార్మర్లకు రాయితీపై పరిశీలన

- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి హామీ

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

వైసిపి పాలనలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు విపరీతంగా పెంచారని, వీటికి రాయితీ ఇచ్చే అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం శాసనసభలో సభ్యులు దాట్ల సుబ్బరాజు అయితాబత్తుల ఆనందరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. తెలంగాణాలో 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ.3,11,491గా ఉందని, రాష్ట్రంలో దాని ధర రూ.5,39, 831గా ఉందని సభ్యులు తెలిపారు. ఇది ఆక్వా రైతులకు భారంగా మారిందన్నారు. దీనిపై మంత్రి సమాధానమిస్తూ ట్రాన్స్‌ఫార్మర్లపైనా, అలాగే జోన్ వెలుపలుండే ఆక్వా సాగు రైతులకు కూడా రాయితీ కల్పించడంపై ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు.

బిల్లులను ప్రవేశపెట్టిన మంత్రులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో మంగళవారం పలువురు మంత్రులు ప్రభుత్వ బిల్లులను ప్రతిపాదించారు. బిల్లులను సభ్యుల ఆమోదంతో బిల్లులు సభ పరిగణలోకి తీసుకున్నట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

సహకారశాఖ చట్ట సవరణ బిల్లును వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కె,అచ్చెన్నాయుడు ప్రతిపాదించారు. రైతు భరోసా కేంద్రాలను సహకార సంఘాలకు అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. తద్వారా డిసిసిబి, డిసిఎంఎస్‌లకు కూడా రైతు సేవలు అనుసంధానం అవుతాయన్నారు. రైతు భరోసాకేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మారుస్తున్నట్టు మంత్రి తెలిపారు. అలాగే ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎక్సైజ్‌శాఖ చట్ట సవరణ బిల్లులను కూడా సభలో ప్రవేశపెట్టారు. స్వదేశంలో తయారైన విదేశీ మద్యం, విదేశీ మద్యంల వ్యాపార క్రమబద్ధీకరణ చట్టం సవరణ, మద్య నిషేధ చట్టం సవరణ బిల్లులను మంత్రి కొల్లు రవీంద్ర ప్రతిపాదించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సునీతారెడ్డి క్వాష్ పిటిషన్‌పై ప్రతివాదులకు నోటీసులు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి, ఆమె భర్త రాజశేఖర రెడ్డి, సిబిఐ అధికారి రాంసింగ్ తనను బెదిరిస్తున్నారంటూ వివేకానంద రెడ్డి పిఎ ఎంవి కృష్ణారెడ్డి పెట్టిన కేసులను క్వాష్ చేయాలని కోరుతూ ఆ ముగ్గురూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు సునీతా, రాజశేఖర్, రాంసింగ్ పిటిషన్లపై మంగళవారం సిజెఐ జస్టిస్ సంజయ్ ఖన్నా, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి ప్రతివాదులైన కృష్ణారెడ్డి తదితరులకు నోటీసులు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా సునీతారెడ్డి సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

ఆమె తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ దర్యాప్తు అధికారిపై ప్రైవేటు కంప్లైంట్ ద్వారా విచారణ పురోగతిని అడ్డుకున్నారని అన్నారు. హత్య కేసును రూపు మాపాలని ప్రయత్నం చేశారని, ఆ తర్వాత రక్తపు వాంతులని ప్రచారం చేశారని తెలిపారు. కోర్టు ఆదేశాలతో కేసు దర్యాప్తు సాగుతోందని, ఆ పరిణామలన్నింటిని దృష్టిలో పెట్టుకుని వాస్తవంకాని ఆరోపణలతో ప్రైవేటు ఫిర్యాదు చేశారని అన్నారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, తదుపరి విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 24కి వాయిదా వేసింది.

కార్మిక సంక్షేమ పథకాలు నిలుపుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2020 నుంచి అనర్హులను నివారించడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్రమబద్దీకరించడానికి ఏపి కార్మిక సంక్షేమ మండలి సంక్షేమ పథకాలను నిలిపివేసినట్లు కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.

శాసన సభలో ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, వెనిగండ్ల రాము అడిగిన ప్రశ్నకు మంత్రి సుభాష్ సమాధానం ఇచ్చారు. 2007 వెల్ఫేర్ బోర్డు క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మోటర్ మెకానిక్ కార్మికులు వెల్ఫేర్ బోర్డులో చేరే అవకాశం ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో రూ. 1000 కోట్ల నిధులు ఉన్నాయని తెలిపారు.

పూలింగ్‌తో పరిశ్రమలకు భూములు

ఎస్ఐపిబి సమావేశంలో చంద్రబాబు ఆదేశం

స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశం లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పరిశ్రమలకు పూలింగ్ (సమీకరణ) పద్ధతిలో భూములు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశం సిఎం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పలు అంశాలను అధికారులు సిఎంకు వివరించారు. గత ప్రభుత్వం పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వలేదని తెలిపారు. గతంలో టిడిపి ప్రభుత్వం రూ.3883 కోట్లు ప్రోత్సాహకాలు చెల్లిస్తే వైసిపి ప్రభుత్వం రూ.1961 కోట్లు మాత్రమే చెల్లించిందని పేర్కొన్నారు. అనంతరం సిఎం చంద్రబాబు మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టేవారికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. అర్సెలార్ మిట్టల్ కంపెనీకి భూములు ఇచ్చే క్రమంలో పూలింగు పద్ధతిని అనుసరించాలని సూచించారు. పెద్దపెద్ద పరిశ్రమలకు భూములు కావాల్సిన చోట్ల పూలింగు పద్ధతి అనుసరించాలని, లేనిపక్షంలో భూములు ఇచ్చిన వారికి వాటిలోనే ఉపాధి కల్పించేలా చూడాలని తెలిపారు. ఈ రెండు సాధ్యం కాకపోతే బెస్ట్ ప్యాకేజీ ఇచ్చి భూములు సేకరించాలని సూచించారు. పెట్టుబడులు ఎంత ముఖ్యమో భూములు కోల్పోయే ప్రజల సంక్షేమం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. భారీ ప్రాజెక్టుల వద్ద హౌసింగ్ కాలనీతోపాటు సోషల్ లైఫ్‌కు అవసరమైన అన్ని సదుపాయాలూ కల్పించాలని సూచించారు. ఆర్సెలర్ మిట్టల్ ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా 61 వేలమందికి, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి వస్తుందని పేర్కొన్నారు. మూలపేట పోర్టు, స్టీలు ప్రాజెక్టు పూర్తయితే ఆ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని తెలిపారు. పెట్టుబడుల విషయంలో కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరిపి అడ్డంకులు తొలగించాలని తెలిపారు. మంత్రులు కూడా కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను ట్రాక్ చేస్తూ ఉండాలని ఆదేశించారు.

పలు కంపెనీలకు ఆమోదం

ఎస్ఐపిబి సమావేశంలో పది ప్రధాన కంపెనీల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వాటిల్లో నక్కపల్లి సమీపంలోని బంగారయ్యపేట వద్ద ఇంటిగ్రేటెడ్ స్టీలు ప్లాంటు(క్యాప్టివ్ పోర్టుతో కలిపి) తొలిదశ నిర్మాణానికి రూ.61,780 కోట్ల పెట్టుబడులకు అనుమతి ఇచ్చారు. అలాగే ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ రూ.5,001 కోట్లు, కళ్యాణీ స్ట్రాటసీజ్ రూ.1,430 కోట్లు, టఫే ప్రైవేటు లిమిటెడ్ రూ.76 కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటితోపాటు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ రూ.3,798 కోట్లు, ఆజాద్ ఇండియా మొబిలిటీ లిమిటెడ్ రూ.1,046 కోట్లు, డల్లాస్ టెక్నాలజీ సెంటర్ ఎల్ఎల్‌పి రూ.50 కోట్లు, ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ రూ.8,240 కోట్లు, గ్రీన్‌కో సోలార్ రూ.2,000 కోట్లు, ఎకోరన్ ఎనర్జీ ఇండియా రూ.1,662 కోట్ల పెట్టుబడులకు ఆమోదం ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాదు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, 20 లక్షల ఉద్యోగాల కల్పన కమిటీ ఛైర్మన్ నారా లోకేష్, మంత్రులు అచ్చెన్నాయుడు, టిజి భరత్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాదు, పయ్యావుల కేశవ్, బిసి జనార్ధన్‌రెడ్డి, పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లోనూ ఎగ్జిబిషన్లు

- చేనేతకు ప్రోత్సాహంపై మంత్రి సవిత

ప్రజాశక్తి- అమరావతిబ్యూరో

చేనేత ప్రోత్సహకానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ చేనేత వస్త్ర విక్రయాలను పెంచేందుకు విదేశాల్లోనూ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తామని చెప్పారు. నూతనంగా రాష్ట్రంలో మూడు ఆప్కో షోరూమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు చేనేత విక్రయాలు ఆప్కో ద్వారా 9.8 శాతం, రేడీమేడ్ వస్త్ర అమ్మకాలు 70 శాతం పెరిగాయని అన్నారు. వస్త్ర నిల్వల విక్రయాలకు వ్యాపారులు, ఉత్పత్తి దారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.. చేనేత వస్త్ర విక్రయాలపై విధిస్తున్న 5 శాతం జిఎస్‌టిని రీయంబర్స్‌మెంట్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేతన్నల సంక్షేమానికి నూతన పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. 50 సంవత్సరాలకే రూ. 4 వేల పింఛను అందిస్తున్నామన్నారు. ఆరోగ్య బీమా, 5 శాతం జిఎస్‌టి రీయంబర్స్‌మెంట్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 యూనిట్లు ఉచితంగా మరమగ్గాలకు ఇవ్వడం జరుగుతోందన్నారు. పవర్‌లూమ్ యూనిట్ ఏర్పాటుకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 10 చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, బిర్లా కంపెనీ ఐదు జిల్లాల్లో క్లస్టర్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతోందన్నారు. ధర్మవరంలో రూ. 30 కోట్లతో కొత్త క్లస్టర్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో రెండు వీవర్ శాలలు ఏర్పాటు చేసి ట్రెండ్‌కు తగిన విధంగా నేతన్నలకు నూతన డిజైన్లపై శిక్షణ ఇస్తామని అన్నారు. మంత్రి లోకేష్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మంగళగిరి లో నేతన్నలకు 365 రోజులు పనికల్పించేలా వీవర్‌శాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డ్వాక్రా బకాయిల చెల్లింపునకు కృషి : మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో : రాష్ట్రంలోని 9 ఐటిడిఎల్లో నైపుణ్య భాగస్వాములుగా ఉన్న డ్వాక్రా గ్రూపులకు రూ.5.70 కోట్లు బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శాసనసభలో ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వాల్మీకి పార్థసారధి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

ఉన్నత విద్యపై పిడిఎఫ్ వాయిదా తీర్మానం

- 104,108 ఉద్యోగుల వేతనాల పెంపుపై వైసిపి
- తిరస్కరించిన ఛైర్మన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యరంగంపై చర్చించాలని శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావుతో పాటు స్వతంత్ర ఎమ్మెల్సీ పి రఘువర్మ శాసన మండలి సమావేశాలు మంగళవారం ప్రారంభంకాగానే ఛైర్మన్ కె మోషేన్‌రాజుకు వాయిదా తీర్మానం అందించారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌ను, యూనివర్సిటీలకు ఉపకులపతులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. దీంతోపాటు 104, 108 ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల జీతాల పెంపుదలపై చర్చించాలని కోరారు. ఈ అంశాలపై చర్చించాలని పిడిఎఫ్, వైసిపి తమ స్థానాల్లో నిల్చొని పట్టుబట్టారు. రెండు వాయిదా తీర్మానాలను ఛైర్మన్ తిరస్కరించారు. 104,108 ఉద్యోగుల సమస్యలపై శాసనసభలో చర్చించామని, మండలిలో కూడా చర్చించేందుకు ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, 104, 108 కార్మికుల జీతాల పెంపుదలపై దీక్షలు చేస్తున్నారని, వీటిని ఉధృతం చేసే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు జీతాలు పెంచాలని గత ప్రభుత్వంలో ధర్నా చేశారని, గత ప్రభుత్వం ఆగస్టు నుంచి పెంచుతామని అంగీకరించిందని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు.

2027కు పోలవరం పూర్తి

- శాసనసభలో సిఎం ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టును 2027 సంవత్సరానికి పూర్తి చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. శాసనసభలో మంగళవారం జరిగిన లఘు చర్చ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. విదేశీ నిపుణులు సూచించిన విధంగా కొత్త డయాఫ్రమ్ వాల్ పనులు జనవరిలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. 2026 మార్చి కల్లా డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు.

పోలవరం ఎత్తు ఖచ్చితంగా 45.72 అడుగులే ఉంటుందని చెప్పారు. 2014-19 మధ్య తమ ప్రభుత్వం పోలవరంపై రూ.16,493 కోట్లు ఖర్చు చేశామని, వైసిపి హయాంలో కేవలం రూ.4,099 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. 2014-19లో పోలవరం 72శాతం పూర్తి చేశామని, 19-24లో తమ ప్రభుత్వమే కొనసాగి ఉంటే ఇప్పటికే పోలవరం పూర్తయ్యేదని చంద్రబాబు పేర్కొన్నారు ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రెండేళ్లలో రూ.12,157 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో తొలివిడతగా రూ.2,385 కోట్లు కేంద్రం నిధులు ఇచ్చిందని తెలిపారు. తనకు అమరావతి , పోలవరం రెండు కళ్లు అని అన్నారు.. పట్టిసీమను ఏడాదిలో పూర్తి చేసి రాయలసీమకు నీళ్లిచ్చామని , ఒకే రోజులో 32వేల క్యూబిక్ మీటర్లకు పైగా కాంక్రీట్ వేసి గిన్నిస్‌బుక్ రికార్డుల్లో స్థానం పొందామన్నారు. తమపై కక్షతో పాటు అవగాహనా రాహిత్యంతో పోలవరం ప్రాజెక్టు పనులు నిలుపుదల చేయడంతో పాటు రివర్స్ టెండరింగ్ పేరుతో వైసిపి ప్రభుత్వం పోలవరం ముందుకు సాగకుండా చేసిందన్నారు. కాంట్రాక్టర్‌ను మార్చే విషయంలో తొందరపడొద్దని కేంద్రం చెప్పినా వినలేదని అన్నారు. నదుల అనుసంధానం చేయాలనేది తన జీవిత ఆశయమన్నారు. గోదావరి నుంచి 4,215 టిఎంసిలు, కృష్ణానది నుంచి 815 టిఎంసిలు సముద్రంలోకి వెళ్తున్నాయని తెలిపారు . రాష్ట్ర వ్యాప్తంగా నదుల అనుసంధానం చేస్తామని రాయలసీమ, ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తామన్నారు. నదుల అనుసంధానం పూర్తి కావాలంటే రూ.70వేల కోట్లు నిధులు అవసరమవుతాయని తెలిపారు.జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జలవనరులే జీవనాధారమని అన్నారు. తమ ప్రభుత్వం ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఇరిగేషన్ రంగం విధ్వంసమైందన్నారు. 17 నెలల పాటు పోలవరంలో పనులు చేయకుండా నిర్లక్ష్యం చేసిన ఫలితమే డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి కారణమైందన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయచంద్రారెడ్డి చర్చను ప్రారంభించారు. పోలవరం ఎంఎల్‌ఏ బాలరాజు మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. భూమా అఖిలప్రియ, బండారు సత్యనారాయణమూర్తి, ఆదినారాయణరెడ్డి, విష్ణుకుమార్‌రాజు, సత్యప్రభ,పత్తిపాటి పుల్లారావు, తంగిరాల సౌమ్య, జివి ఆంజనేయులు, పరిటాల సునీత చర్చలో పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు హెచ్‌ఆర్ పాలసీ అమల్జేయాలి

- మండలి 'ప్రస్తావన'ల్లో కె.ఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్యమిత్రలకు నెలకు రూ.13 వేలు మాత్రమే అందుతున్నాయని పిడిఎఫ్ సభ్యుడు కె.ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ మొత్తాన్ని రూ.28 వేలకు పెంచి, వీరిని కేటగిరి 1లోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. శాసన మండలిలో మంగళవారం 'ప్రత్యేక ప్రస్తావన'లో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఆరోగ్యమిత్రలను కాంట్రాక్టు విధానంలోకి మార్చి హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు.

- ఆర్టీసి రన్నింగ్ సిబ్బందికి అలవెన్స్‌లు చెల్లించడానికి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని మరో పిడిఎఫ్ సభ్యుడు ఐ.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆర్‌టిసిగా ఉన్నప్పుడు రన్నింగ్ సిబ్బంది అయిన డ్రైవర్లు, కండక్టర్లు, అసిస్టెంట్ డిపో క్లర్కులు, టిటిఐ, ఇన్స్‌పెక్టింగ్ స్టాఫ్‌కు డే అవుట్, నైట్ అవుట్ అలవెన్సులు, టిఎ బిల్లులు చెల్లించేవారని తెలిపారు. పిడిటిగా మార్చిన అనంతరం ఈ అలవెన్సులు అన్ని నిలిపివేశారని తెలిపారు.
- ఏపీ మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న ఉద్యోగుల కుటుంబాలకు కూడా కారుణ్య నియామకాలు చేపట్టడం లేదనిరఘువర్మ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ స్కూల్‌లో ట్యూటర్లను నియమించాలని కోరారు. సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాలల్లో సిబ్బందికి 1వ తేదీనే జీతాలు అందజేయాలన్నారు. 8 గంటల పని విధానం, 2వ శనివారం శెలవు ప్రకటించాలని, మెడికల్ రిఎంబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించడం, అన్ని క్యాడర్లకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు.
- పంచాయతీ, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మధ్య పదోన్నతుల విషయంలో 4 దశాబ్దాలుగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎం.వి రామచంద్రరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులు దశాబ్దాల కాలంగా పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
- ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు మరణించినప్పుడు పోలీసులు వైద్యులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారని సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. సుప్రీం కోర్టు సూచనల ప్రకారం ప్రాథమిక విచారణ జరిగిన అంనతరం నేరం రుజువయితేనే వైద్యులను అదపులోకి తీసుకోవాల్సి ఉందని కోరారు.
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయిలు వెంటనే చెల్లించాలని కల్పలత కోరారు. 12వ పిఆర్సి ఆలస్యం అయితే ఐఆర్ ప్రకటించాలన్నారు.
- నర్సాపురంలో పాత ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణాన్ని రూ.3.50 కోట్లతో పనులు గత ప్రభుత్వం ప్రారంభించిందనివంకా రవీంద్ర తెలిపారు. ఈ థియేటర్ పనులు దాదాపు 60 శాతం పూర్తయినందున మిగిలిన పనులు వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పేదలకు ఇంది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.
- హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్మీడియట్ సబ్జెక్టులు బోధించేందుకు పిజిటి హోదా కలిగిన ఫుల్ టైమ్ అధ్యాపకులు అవసరమని, సంబంధిత మేనేజ్‌మెంట్ స్కూల్‌లోని స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించి పిజిటిలను పూర్తి స్థాయిలో నియమించాలని , పభుత్వ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా వెంటనే 23 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని పి.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

భూముల రిజిస్ట్రేషన్ ధరలు సవరించాలి

- తుఫాను షెల్టర్‌లు నిర్మించాలి
- జీరో అవర్లో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ ధరలకన్నా రిజిస్ట్రేషన్ విలువలు విపరీతంగా పెంచడం సమస్యగా మారిందని, సవరించాలని భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. శాసన సభ జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించారు. తీర ప్రాంతంలో 40 ఏళ్లనాడు నిర్మించిన తుఫాను షెల్టర్‌లు శిధిలమయ్యాయని, ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడేందుకు తుఫాను షెల్టర్‌లను నూతనంగా నిర్మించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. వేలేరు మోడరనైజేషన్‌కు నిధులు కేటాయించి టెండరు ప్రక్రియను పూర్తి చేయాలని చినరాజప్ప విజ్ఞప్తి చేశారు. సత్యపాల్ కమిటీ నివేదిక ఆధారంగా వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి అసెంబ్లీ ఆమోదం తెలిపి పార్లమెంట్‌కు పంపాలని, ఒడ్డెర ఓబన్న జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని పల్లె సింధూరరెడ్డి కోరారు. పార్వతీపురం జిల్లాలో పిజి కాలేజీ, బలిజపేటలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. రంపచోడవరం ప్రాంతంలో కిర్రాపు ఆనకట్ట, కన్నేరు వాగు లిఫ్ట్‌ను పూర్తి చేయాలని, ఇరిగేషన్ అధికారుల ఖాళీలను భర్తీ చేయాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కోరారు. విజయనగరం జిల్లాలోని తోటపూడి ప్రాజెక్టుకు స్వాతంత్ర సమరయోధుడు, ప్రజానాయకుడు, ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేసిన గొర్రిపాటి బుచ్చప్పారావు పేరును పెట్టాని ఎమ్మెల్యే లలిత కుమారి అన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో స్మశానవాటికలకు ప్రహరీ గోడల నిర్మాణాన్ని చేపట్టడానికి ప్రభుత్వం అనుమతించాలని అన్నారు. పాలకొండ మున్సిపాల్టీలో డంపింగ్ యార్డు, తాగునీటి సమస్యల పరిష్కరించాలని నిమ్మక జయకృష్ణ అన్నారు. నర్సన్నపేటలో నిలిచిపోయిన 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రమణమూర్తి అన్నారు.

హోంశాఖకు నిధులు పెంచాలి

- బడ్జెట్ పద్దులపై శాసనసభలో చర్చ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ పద్దులపై మంగళవారం చర్చ జరిగింది. వివిధ శాఖల డిమాండ్‌లను మంత్రులను ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. ఈ సందర్భంగా మాట్లాడిన సభ్యులు పలు సూచనలు చేశారు. హోం శాఖకు నిధులు పెంచాల్సిన అవసరం ఉందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కోరారు. బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. కొన్ని కేసుల్లో ఫోరెన్సిక్ నివేదికలు సకాలంలో రాక దర్యాప్తులో జాప్యం జరిగి నిందితులకు శిక్షల్లో జాప్యం జరుగుతుందన్నారు. ఫోరెన్సిక్ కేంద్రాలను పెంచాలన్నారు. పోలీసులకు వాహన సదుపాయం కూడా సరిగాలేదన్నారు. ప్రకృతి వైపరిత్యాలకు నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

గంజాయి వినియోగం పెరిగింది :విజయకుమార్

రాష్ట్రంలో గంజాయి వినియోగం పెరిగిందని యలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. హోంశాఖపై జరిగిన చర్చలో మాట్లాడుతూ గంజాయికి బానిస అయిన వారికి డీ-ఎడిక్షన్ సెంటర్లు పెట్టి మానసిక చికిత్సలు చేయాలన్నారు. గంజాయి నిరోధానికి పోలీసులకు తగిన సిబ్బంది లేరన్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పెంచాలన్నారు.

సైబర్ నేరాలు పెరుగుతున్నాయి: నశీర్ అహ్మద్

రాష్ట్రంలో సైబర్ నేరాలుపెరుగుతున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ తెలిపారు. పోలీసుశాఖ ప్రజలతో మమేకం కావడానికి మెరుగైన వసతులు కల్పించాలన్నారు. కేసుల దర్యాప్తునకు తగిన వసతులు అవసరం అన్నారు.

సహకార బ్యాంకులపై విచారణచేయాలి : యార్లగడ్డ

వ్యవసాయశాఖ నుంచి సహకార శాఖను విభజించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. సహకార సంఘాల్లో అక్రమాలపై విచారణ చేయించాలన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ జరగాలన్నారు. కృష్ణా జిల్లా కో ఆపరేటివ్ బ్యాంకు ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఇందు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. భోగరాజు ప్రారంభించిన ఆంధ్రా బ్యాంకు పేరు మార్చారని, కేవలం కృష్ణా జిల్లా సహకార బ్యాంకు ఒక్కటే మిగిలిందన్నారు.

గుడివాడలో తాగునీటి సమస్య : వెనిగండ్ల రాము

గుడివాడలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మునిసిపల్ పరిపాలనశాఖపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గత 20 ఏళ్లుగా గుడివాడ పట్టణం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా ఫోటోలతో ట్యాంకర్లు తిప్పారని అన్నారు.

పాణ్యంలో అరకొరగా తాగునీరు : గౌరు చరిత

పాణ్యం పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. మూడునాలుగు రోజులకు ఒకసారి నీరు వస్తుందన్నారు. అమృత్ పథకం కింద గతంలో మంజూరు చేసిన పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఓర్వకల్లు జలాశయం నుంచి నీటి సరఫరాకు రిజర్వాయర్ నిర్మాణం చేయాలన్నారు. కొత్తకాలనీలు ఏర్పడుతున్నాయని పట్టణం విస్తరిస్తుందన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి: ఆనందరావు

వైసిపి హయంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు చెప్పారు. దళితులపైనే ఎస్‌సిఎస్‌టి చట్టం ప్రయోగించారని సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విదేశీ విద్యా పథకాన్ని మార్చారని అన్నారు.

పామర్రుకు ముంపు సమస్య :వర్ల కుమార్ రాజా

పామర్రుపట్టణంలో ముంపు సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. ప్రధానంగా ఇటీవల వచ్చిన వరదలకు లంక గ్రామాల్లో మునిగిపోయాయని అన్నారు.ఇందుకు శాశ్వత పరిష్కారం చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు సమస్య తీవ్రంగా ఉందన్నారు. రైతులకు న్యాయంచేయాలన్నారు.

కోటప్పకొండలో రోప్‌వే ఏర్పాటు చేయాలి : చదలవాడ

కోటప్పకొండలో శైవక్షేత్రానికి రోప్ వే ఏర్పాటు చేయాలని ఈమేరకు దేవాదాయశాఖ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు కోరారు. శివరాత్రిని కోటప్పకొండలో రాష్ట్ర పండగా ప్రకటించారన్నారు.. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్ తదితరులు ప్రసంగించారు.

ఉద్యోగుల అంతరాష్ట్ర బదిలీలపై సంప్రదింపులు

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఉద్యోగుల అంతరాష్ట్ర బదిలీలకు సంబంధించి తెలంగాణా రాష్ట్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ ఈ విషయం తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి సిదంగా ఉన్న ఉద్యోగుల నుంచి సుముఖత కోసం రెండు ప్రభుత్వాలు సర్క్యులర్ జారీ చేశాయని చెప్పారు. 1947 మంది ఉద్యోగులు ఆంధ్రా నుంచి తెలంగాణాకు వెళ్లేందుకు, 1447 మంది తెలంగాణా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. తెలంగాణా ఉద్యోగులతో వన్‌టైం చర్యగా అంతర్‌రాష్ట్ర బదిలీకి సమ్మతి కోసం తెలంగాణా ప్రభుత్వాన్ని కోరామన్నారు. దీనిపై తెలంగాణా ప్రభుత్వం నుంచి సమాధానం రావాల్సి ఉందన్నారు. తెలంగాణా ప్రభుత్వం చేసిన అభ్యర్థను పరిశీలించి 122 మంది తెలంగాణా స్థానిక నాన్ గెజిటెడ్ ప్రభుత్వ ఉద్యోగుల రిలీవ్‌కు చేయడానికి ఉత్తర్వులు ఇచ్చామన్నారు. వీరిలో 61 మంది తెలంగాణాలో చేరారని అన్నారు.

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సమస్యలపై చర్చకు కమిటీలు

ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల మధ్య పెండింగ్‌లోని ద్వైపాక్షిక రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సమస్యలపై చర్చకు మంత్రులు, సీనియర్ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. 2024 జులై 6వ తేదీన ఏపీ, తెలంగాణా ముఖ్యమంత్రుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా ఈ రెండు కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని మోడీ ప్రకటించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖపట్నం రానున్న ప్రధాని నరేంద్ర మోడీ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించు కుంటున్నట్లు ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 1378వ రోజుకు చేరాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన ఎఐటియుసి నాయకులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్రయివేటు వ్యక్తులను బలపరిచేందుకు ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు ప్రజలకు ఎలా మేలు చేస్తాయని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి వెంటనే ఆర్థికంగా సహకరించాలని కోరారు. లేకుంటే ఈ ఉద్యమాన్ని భవిష్యత్తులో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పర్యాటక ప్రాంతాల్లో పార్కింగ్ ఫీజు వద్దు

- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూర్యలంక, రామవరం, రుషికొండ, కాకినాడ, మైపాడు తదితర బీచ్‌ల వద్ద పర్యాటకుల వాహనాల నుంచి రుసుం వసూలు చేయొద్దని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పర్యాటక శాఖ ఇన్‌చార్జి ఎండి నారాయణ గుప్తాను ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని స్వాగతించారు. కానీ వినోదం కోసం వచ్చే పర్యాటకుల నుంచి ప్రవేశ రుసుం పేరుతో డబ్బులు వసూలు చేయడం సరైంది కాదని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి, నిర్వహణ పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత తీసుకొని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పార్కింగ్ చార్జీలు, ప్రవేశ రుసుం లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో అనేక చోట్ల పర్యాటకులను ఆకట్టుకునే ప్రాంతాలు ఉన్నా నిర్లక్ష్యానికి గురయ్యాయని, వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. ఎండిని కలిసిన వారిలో సంఘం నాయకులు భార్గవ్, అంబేద్కర్, గణేష్ తదితరులు ఉన్నారు.

ఏడు జిల్లాల్లో 1,81,988 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరుగుతోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 నుంచి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, కోనసీమ, కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లాల్లో 24,051 మందిరైతుల నుంచి మొత్తం 671 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1,81,988 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.418.75 కోట్ల విలువజేసే ధాన్యం కొనుగోలు చేయగా, అందులో రూ.391.50కోట్లు రైతులకు చెల్లించినట్లు వివరించారు.

టిబి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు వాకాటి కరుణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాజంలోని ప్రతి ఒక్కరూ టిబి వ్యాధి నివారణకు కృషి చేయాలని ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు వాకాటి కరుణ కోరారు. రాష్ట్ర టిబి కార్యాలయం, టాటా ఇనిస్టిట్యూషన్ ఆఫ్ సోషల్ సైన్స్ సంయుక్తంగా రాష్ట్రంలోని లెప్రసీ, ఎయిడ్స్, టిబి నివారణ అధికారులకు హాయ్ ల్యాండ్‌లో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రారంభోపన్యాసం చేస్తూ టిడి నివారించగలిగేవ్యాధి అని అన్నారు. ప్రతి ఒక్క అధికారి తమ జిల్లాకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో టిబి వ్యాధి నిర్ధారణకు ముందస్తుగానే ట్రునాట్, సిబినాట్ మెషిన్లను 780 ల్యాబ్‌ల్లో ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ టి రమేష్ మాట్లాడుతూ అన్ని జిల్లాల్లోని టిబి అనుమానితులను గుర్తించి పరీక్షలను జరపడంతో పాటు పూర్తి కాలం మందులు అందించి క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు.

అంగన్‌వాడీలపై మరో భారం

- కేంద్రాల వద్ద పోషక వనాల ఏర్పాటు
- పర్యవేక్షణ బాధ్యత సిబ్బందిపైనే
- ఇబ్బందులు తప్పవంటున్న వర్కర్లు

పిఠాపురంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషక వనాల ఏర్పాటుకు స్థలాన్ని సిద్ధం చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

దేశంలోని బాల బాలికలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల వ్యవస్థను ప్రవేశ పెట్టింది. అంగన్‌వాడీ సిబ్బందికి నిర్దిష్టమైన విధులను కూడా అప్పగించింది. అయితే వారి విధులకు ఆటంకం కలిగిస్తూ ఇతర పనులు అప్పగిస్తూ ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్‌వాడీలపై అదనపు భారాలు మోపుతున్నాయి. తాజాగా వీరిపై మరో అదనపు భారం పడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషక వనాల ఏర్పాటుకు టిడిపి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా మొదటి విడతలో సొంత భవనాలున్న కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు.

కాకినాడ జిల్లా పరిధిలోని 10 ప్రాజెక్టుల్లో 1,986 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 1,643 మంది గర్భిణులు, 11,989 మంది బాలింతలు, 6 నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు 1,06,949 మంది సేవలు పొందుతున్నారు. కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నా చాలామందిలో రక్తహీనత ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, వాటిని అధిగమించే పనిలో భాగంగా టిడిపి కూటమి ప్రభుత్వం కిచెన్ గార్డెన్ల పేరుతో పోషన్ వాటిక కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. తొలి విడతలో జిల్లాలో సొంత భవనాలున్న 488 కేంద్రాల్లో పోషక వనాలు ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టామని అధికారులు చెబుతున్నారు. వీటిలో ఆకుకూరలు, ఇతర మొక్కలు పెంచనున్నారు.

ఎటువంటి రసాయనాలు లేకుండా పండించిన పంటలతో కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు మధ్యాహ్న భోజనం పెట్టేందుకు ఈ వనాలను ఏర్పాటు చేస్తున్నారు. విత్తనాలను ఉద్యాన శాఖ అధికారులు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆకు కూరలతో పాటూ మునగ, కరివేపాకు, మెంతి, పాల, తోటకూరలు, బొప్పాయి పెంచాలని నిర్ణయించారు.

బాధ్యత సిబ్బందిపైనే...

వనాల పర్యవేక్షణ, మొక్కల పెంపకం తదితర బాధ్యతలన్నీ ఆయా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికే అప్పగిస్తామని అధికారులు తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం వండి పెట్టడం, పోషకాహార కిట్లు అందించే బాధ్యతను చూస్తూనే పోషక వనాలను కాపాడే బాధ్యతనూ వీరే చూడాల్సి ఉంది. ఈ అదనపు భారంపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తీవ్ర పని ఒత్తిడితో విధులను నిర్వర్తించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ సర్వేలకు సైతం తమతోనే చేయిస్తున్నారని వారు వాపోతున్నారు. తమకు జాబ్ చార్ట్‌లో ఉన్న విధులను మాత్రమే అప్పగించాలని, అదనపు పనులు అప్పగించడం సరికాదని డిమాండ్ చేస్తున్నారు.

అదనపు పనులతో అనేక ఇబ్బందులు

ఇప్పటికే అదనపు పనులతో సతమతమవుతుండగా టిడిపి కూటమి ప్రభుత్వ మరో అదనపు పని అప్పగించడం సరికాదు. పోషక వనాలను ఏర్పాటు చేస్తుండడం మంచిదే అయినప్పటికీ సిబ్బందికే వీటిని అప్పగించడంతో మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి వనాల పర్యవేక్షణ నుంచి అంగన్‌వాడీ వర్కర్లను తప్పించాలి.

- ఇ.చంద్రావతి, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ఆరుగురి నామినేషన్లు సక్రమమే

- ప్రకటించిన రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి - కాకినాడ

తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో అభ్యర్థుల సమక్షంలో మంగళవారం నామినేషన్ల పరిశీలన చేశారు. నామినేషన్లు అన్నీ సక్రమంగా ఉన్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు బుర్ర గోపిమూర్తి, గంధం నారాయణరావు, నామా వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరావు, పులుగు దీపక్, అహమద్ షేక్ నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఈ నెల 21 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఒ జె వెంకట్రావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

'కీ'లో తప్పులకు ఆధారాలు అందజేయండి

- కానిస్టేబుల్ అభ్యర్థులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

పోలీసు కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించిన నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్ష 'కీ'లో తప్పులు ఉన్నాయనేందుకు ఆధారాలు అందజేయాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశాలను జారీ చేసింది. కీలో తప్పిదాల వల్ల తాము దేహదారుఢ్య పరీక్షకు అనర్హులయ్యామంటూ పలువురు అభ్యర్థుల పిటిషన్లల్లో జోక్యం చేసుకునేందుకు సింగిల్ జడ్జి గతంలో నిరాకరించారు. దీంతో వాళ్లంతా అప్పీల్ దాఖలు చేశారు. తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదా పడింది.

ఎసిబికి చిక్కిన ఉప ఖజానా కార్యాలయం ఎస్‌టిఒ

ప్రజాశక్తి-ఉదయగిరి (నెల్లూరు జిల్లా)

ఎసిబి దాడుల్లో నెల్లూరు జిల్లా ఉదయగిరి ఉప ఖజానా కార్యాలయ ఎస్‌టిఒ పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎసిబి డిఎస్‌పి శిరీష వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. వరికుంటపాడు మండలం, తూర్పుబోయమడగల పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంగయ్యకు సంబంధించిన రూ. 8,96,000 బిల్లులు కోసం ఎస్‌టిఒ మమత వద్దకు వెళ్లారు. ఆమె లంచం డిమాండ్ చేయడంతో ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వెంగయ్య వద్ద నుంచి ఎస్‌టిఒ మమత రూ. 40 వేల నగదు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. కార్యక్రమంలో ఎసిబి సిఐలు ఆంజనేయ రెడ్డి, విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినుల జుత్తు కత్తిరింపు ఘటనపై చర్యలు

- ఇద్దరు సస్పెన్షన్

ప్రజాశక్తి -జి.మాడుగుల (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఈ నెల 15న ప్రేయర్‌కు ఆలస్యంగా వచ్చారని 18 మంది విద్యార్థినులకు జుత్తు కత్తిరించిన ఘటనలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి బ్రాహ్మజీరావు సోమవారం జి.మాడుగుల కెజిబివిలో విచారణ జరిపారు. బాధిత విద్యార్థినులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించారు. దీని ఆధారంగా విద్యార్థినులను కులం పేరుతో దూషించారని కెమిస్ట్రీ అధ్యాపకులు బి వాణిని, జుత్తు కత్తిరించిన ప్రత్యేకాధికారి యు.సాయిప్రసన్నను సస్పెండ్ చేస్తూ మంగళవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నేటి నుంచి సస్పెన్షన్ తొలగించే వరకూ ఈ ఇద్దరూ పాడేరు దాటి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన ఆశా కార్యకర్తలు

వేతనాలు పెంచాలి

- కలెక్టరేట్ వద్ద బైఠాయించిన ఆశా వర్కర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమకు వేతనాలు పెంచాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్లు ఆందోళన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ కలెక్టరేట్ మెయిన్‌గేట్ వద్ద బైఠాయించారు. ఆశ వర్కర్లకు సంబంధంలేని సర్వేలు చెప్పొద్దని, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధారాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్ మాట్లాడుతూ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గత ప్రభుత్వ ఇచ్చిన హామీలను జిఒ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్‌ఒ రాణికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె వెంకటలక్ష్మి, శారదరాణి, రాజేశ్వరి, ఎం గౌరి, ఎస్ పార్వతి, ఎం లక్ష్మి, వి రమణమ్మ, కె గణపతమ్మ, జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో పూలచాదర్ సమర్పిస్తున్న షర్మిల

పెద్ద దర్గాను దర్శించుకున్న పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి - కడప

కడప జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన అమీన్‌పీర్ పెద్ద దర్గాను పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల మంగళవారం దర్శించుకున్నారు. దర్గా సంప్రదాయం ప్రకారం ఆమెకు నిర్వాహకులు స్వాగతం పలికారు. దర్గాలో షర్మిల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శాంతి, సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. దర్గా పవిత్రతను గురించి ఆమె ప్రశంసిస్తూ, ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలు ప్రజల మధ్య సోదరత్వం, సఖ్యతను పెంపొందించడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. అమీన్‌పీర్ దర్గా నిర్వహించే లంగర్ (ఉచిత భోజన వసతి), ఉచిత వైద్య సేవలను ప్రశంసించారు. ప్రతి ఒక్కరి సంక్షేమానికి దర్గా నిర్వాహకులు తీసుకుంటున్న జాగ్రత్తలను హర్షించారు. ఈ సందర్భనలో సూఫీ సంతుల జీవన గాథలను, వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకొని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బండి జకరయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, కమలాపురం, కడప నియోజకవర్గాల సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం ప్రారంభం

- పిల్లల కోలాహలం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

బాలోత్సవం ప్రారంభంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

విశాఖ నగరంలోని సెయింట్ ఆంథోనీ పాఠశాలలో మూడు రోజులపాటు జరిగే విశాఖ బాలోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. వివిధ పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా తరలివచ్చారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ తదితర ప్రముఖులు హాజరయ్యారు. బాలోత్సవంలో అత్యంత ప్రధానమైన కళా, సాంస్కృతిక పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులను అలరించే విధంగా ప్రారంభమయ్యాయి. 16 అకడమిక్ ఈవెంట్‌లలో సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ క్యాటగిరీలుగా విభజించి నిర్వహించారు. వీటిలో సీనియర్, జూనియర్‌లకు చిత్రలేఖనం, స్పాట్ డ్రాయింగ్, కార్టూన్ గీయడం, వ్యాసరచన (ఇంగ్లీషు), (తెలుగు), స్పెల్ బి, సైన్స్ ఎగ్జిబిషన్, మ్యాపింగ్ పోటీలు నిర్వహించారు. సీనియర్‌లకు దినపత్రిక పఠన పోటీలు నిర్వహించగా, సబ్ జూనియర్‌తకు చిత్రలేఖనం (స్పాట్) పోటీలు జరిగాయి. కల్చరల్ ఈవెంట్స్‌లో సీనియర్, జూనియర్‌లకు జానపద గీతాలాపన (సోలో), దేశభక్తి గీతాలాపన (సోలో), దేశభక్తి బృందగానం, లఘు నాటికలు (జూనియర్స్), మిమిక్రీ (సీనియర్స్), జానపద గీతాలు (బృందం-జూనియర్స్), పౌరాణిక పద్యగానం (సీనియర్స్) నిర్వహించారు. సబ్ జూనియర్స్ విభాగంలో రైమ్స్ (తెలుగు, ఇంగ్లీషు) పోటీలను విడిగా జరిగాయి. కల్చరల్ ఈవెంట్స్ కార్యక్రమాల నిర్వహణ కన్వీనర్‌గా ప్రముఖ దర్శకులు దండు నాగేశ్వరరావు వ్యవహరించారు. మొత్తం కార్యక్రమాలను విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, ప్రధాన కార్యదర్శి జి.ఎస్ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.రమాప్రభ, ఆహ్వాన సంఘం సభ్యులు ఎం.ఎల్లాజీ, కె.సంతోష్, సిహెచ్ సత్యనారాయణ, విసిసి కన్వీనర్ కె.సుశీల, వై.మోతాంబికాదేవి, ఎం.గుణశంకర్, పర్యవేక్షించారు. విశాఖ బాలోత్సవం నిర్వహణకు సహకరించిన ఫాథర్ రత్న కుమార్‌కు నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ.. పిల్లల కోసం ఇంత పెద్ద కార్యక్రమం చేయడం, వేలాది మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవటం చాలా మంచి విషయమన్నారు. పిల్లలు ఇటువంటి వేదికలను ఉపయోగించుకోవాలని, అందుకు స్కూల్ యాజమాన్యాలు, తలిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ పిల్లలు దేనినైనా సూక్ష్మంగా గ్రహిస్తారని, ఆటలు, పాటలు, రకరకాల ఆర్ట్ ఫార్మ్ ఇష్టపడతారన్నారు. అటువంటి వాటికి విశాఖ బాలోత్సవం వేదిక అయ్యిందని తెలిపారు.

విచారణకు హాజరుకాని వర్మ

- వారం రోజులు సమయం అడిగిన లాయర్

ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన సోషల్ మీడియా కేసులో ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ మంగళవారం నాడు విచారణకు హాజరు కాలేదు. ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్ ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉండగా వర్మ తరపు లాయర్ మాత్రమే వచ్చారు. వారం రోజులు అనుమతి ఇవ్వాలని సిఐను కోరారు. ఈ సందర్భంగా వర్మ తరపు లాయర్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వ్యూహం సినిమా ప్రమోషన్‌లో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదుతో నమోదైన కేసు విచారణకు హాజరు కావాలని రాంగోపాల్ వర్మకు నోటీసులు ఇచ్చారని, ఆయనకు ఉన్న బిజీ షెడ్యూల్ కారణంగా విచారణకు హాజరు కాలేకపోతున్నాడని తెలిపారు. వారం రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

ముందస్తు బెయిల్ అభ్యర్థించిన రాంగోపాల్‌వర్మ

కాగా ఇదే కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా రాంగోపాల్ వర్మ మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్‌పై హైకోర్టు తుది ఉత్తర్వులు జారీ చేసే వరకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా కోరారు. అరెస్టు చేసి తనపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించే వీలుందని, ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన కోరారు. దీనిపై హైకోర్టు విచారణ చేయనుంది.

కల్కి మందిర్ నిర్మాణంపై నోటీసులు

ప్రజాశక్తి, అమరావతి

తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండలంలో అనుమతులు లేకుండా కల్కి దేవాలయాన్ని నిర్మించారంటూ దాఖలైన పిటిషన్‌ను కూడా హైకోర్టు మంగళవారం విచారించింది. ప్రతివాదులుగా ఉన్న పంచాయతీరాజ్, రెవిన్యూ శాఖల ముఖ్య కార్యదర్శులు, భూ పరిపాలన ప్రధాన మిషనర్, తిరుపతి జిల్లా కలెక్టర్, కల్కి ట్రస్ట్ ఫర్ రూరల్ సర్వీస్ తదితరులకు నోటీసులు ఇచ్చింది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మంగళవారం ఆదేశాలిచ్చారు. చట్ట విరుద్ధంగా నిర్మించిన కల్కి దేవాలయాన్ని మూసివేయాలంటూ ముని చంద్రశేఖర్ సహా ఏడుగురు హైకోర్టును ఆశ్రయించారు.

ఒకే ఘటనపై రెండు కేసులా?

- హైకోర్టులో రిట్ దాఖలు చేసిన నందిగం సురేష్

ప్రజాశక్తి, అమరావతి

ఒకే ఘటనకు సంబంధించి తనపై రెండు కేసులు నమోదు చేశారని, ఒక కేసు విచారణ జరుగుతుండగానే అదే ఘటనకు సంబంధించి మరో కేసు దాఖలు చేశారని, అది చెల్లుబాటు కాదని ఉత్తర్వులు ఇవ్వాల్సిందిగా రాష్ట్ర హైకోర్టులో వైసిపి ఎంపీ నందిగం సురేష్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. బిజెపికి చెందిన రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్‌పై గత ఏడాది మార్చి 31న జరిగిన దాడి కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కూడా సురేష్ హైకోర్టుకు విన్నవించారు. ఇదే తేదీన రాజధాని ప్రాంతంలోని మందడంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని వెళుతున్న బిజెపి నేత సత్య కుమార్ యాదవ్, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి ఇతరులపై దాడి చేశారంటూ నందిగం సురేష్ తదితరులపై బిజెవైఎం నాయకుడు పి.సురేష్ ఫిర్యాదు చేయగా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటనపై ఇదివరకే తనపై కేసు నమోదైందని, మరో కేసు చెల్లదని నందిగం రిట్‌లో పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశాలతోనే కేసు మీద కేసు పెట్టారన్నారు. తాను దర్యాప్తునకు సహకరిస్తానని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారణ చేయనుంది.

కల్వరీ ఫౌండేషన్‌కు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి, అమరావతి

గుంటూరు జిల్లా నంబూరులో అనుమతులు లేకుండా కల్వరీ టెంపుల్ నిర్మాణం జరిగిందనే పిటిషన్‌లో పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కల్వరీ టెంపుల్ ఫౌండేష్ ప్రతినిధులను హైకోర్టు ఆదేశించింది. అనుమతులు లేకుండా కట్టిన కల్వరీ టెంపుల్లో ప్రార్థనలు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని జైభీం భారత్ పార్టీ సమన్వయకర్త పరసా సురేష్ కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ కృష్ణమోహన్ మంగళవారం ఆదేశాలిచ్చారు. ప్రతివాదులైన పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల ముఖ్య కార్యదర్శులు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్, గుంటూరు జిల్లా కలెక్టర్, కల్వరీ టెంపుల్ ఫౌండేషన్ ఛైర్మన్ సతీష్ కుమార్‌కు నోటీసులు ఇచ్చింది.

అమ్మకానికి ప్రభుత్వ బ్యాంక్‌ల వాటాలు

- నాలుగింటిలో విక్రయ యోచన

ముంబయి : ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయానికి మోడీ సర్కార్ మళ్లీ తెరలేపుతోంది. తాజాగా నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో మైనారిటీ వాటాలను ప్రయివేటు శక్తులకు విక్రయించడానికి వీలుగా కేంద్ర ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందిస్తుంది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌ల్లో వాటాలను ఉపసంహరించుకోనుందని రాయిటర్స్ ఓ రిపోర్టులో తెలిపింది. త్వరలో జరుగన్న కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆయా బ్యాంక్‌ల్లో వాటాల విక్రయానికి సంబంధించి ఆమోదం తెలిపే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల పేరుతో వాటాల అమ్మకాన్ని తెరమీదకు తెస్తోంది.

ఈ ఏడాది సెప్టెంబర్ ముగింపు నాటికి సెంట్రల్ బ్యాంక్‌లో కేంద్రానికి 93 శాతం, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో 96.4 శాతం, యుకో బ్యాంకులో 95.4, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో 98.3 శాతం చొప్పున వాటాలున్నాయి. ఓపెన్ మార్కెట్లో ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్‌ఎస్) ద్వారా వాటాల విక్రయం పరిశీలనలో ఉందని అధికార వర్గాల సమాచారం. లిస్టెడ్ కంపెనీల్లో 25 శాతం వాటాలను విక్రయించాలని సెబీ నిబంధనలు చెబుతున్నాయి. అయితే ఈ నిబంధన నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు 2026 ఆగస్ట్ వరకు మినహాయింపు ఉంది. అయినప్పటికీ మోడీ సర్కార్ ఎప్పటిలాగానే ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను విక్రయించడానికి ఆసక్తిగా ఉందని స్పష్టమవుతోంది. వాటాల విక్రయంపై బ్యాంక్ అధికారులు, ఆర్థిక శాఖ వర్గాలు అధికారికంగా స్పందించడానికి నిరాకరించాయి.

ఇఎంఐ పద్ధతిలో బంగారం రుణాల చెల్లింపు..!

న్యూఢిల్లీ : బంగారం తనఖా రుణాల్లో ఇప్పటి వరకు ఇఎంఐ (నెల వారి వాయిదాలు) చెల్లించే పద్ధతి లేక అనేక మంది ఏకకాలంలో అప్పులు చెల్లించలేక ఆ పసిడిని వదిలేసుకుంటున్న ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు ఈ రుణాల జారీలో అనేక లోపాలు ఉన్నాయి. బంగారం విలువ నిర్ధారణలో లోపాలు, వేలంలో పారదర్శకత లేమి వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. కొందరు రుణ గ్రహీతలు వడ్డీ చెల్లించి బంగారం రుణాలను దీర్ఘకాలం కొనసాగిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గుర్తించింది. వీటిని సరిదిద్దాలని ఆర్‌బిఐ ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా బ్యాంక్‌లు కొత్త విధానాన్ని తీసుకురావాలని భావిస్తున్నాయి. రుణం పొందిన వెంటనే సమానమైన నెలవారీ వాయిదాలలో వడ్డీ, అసలు చెల్లించేలా కొత్త విధానాన్ని రూపొందిస్తున్నాయని సమాచారం. రుణదాతలు రుణగ్రహీతల చెల్లింపు సామర్థ్యాన్ని పరిశీలించాలని, కేవలం పూచీకత్తుపై మాత్రమే ఆధారపడకూడదని ఆర్‌బిఐ ఇటీవల ఆదేశాలు జారీ చేసిందని సీనియర్ బ్యాంకింగ్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు బంగారం తాకట్టుపై ఇచ్చే రుణాల చెల్లింపునకు బుల్లెట్ రీపేమెంట్ ఆప్షన్ ఇస్తున్నాయి. రుణ కాలపరిమితి పూర్తయిన తర్వాత రుణ గ్రహీత తాను తీసుకున్న మొత్తం రుణం ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా గడువుకు ముందే అసలూ వడ్డీ చెల్లించి రుణగ్రహీత తాను తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకోవచ్చు. ఆర్‌బిఐ గణంకాల ప్రకారం.. గత సెప్టెంబర్ 20 నాటికి బ్యాంకులన్నీ సుమారు 1.4 లక్షల కోట్ల విలువైన బంగారం తనఖా రుణాలు జారీ చేశాయి. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే తాకట్టు రుణాలు 14.6 శాతం పెరిగాయి. ఈ క్రమంలోనే బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు కూడా నెలవారీ వాయిదాల విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఆర్‌బిఐ ఇటీవల తమ సర్క్యులర్‌లో పేర్కొంది.

ఆర్‌బిఐ గవర్నర్ దాస్ పదవీకాలం మళ్లీ పొడిగింపు..!

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలాన్ని కేంద్రం మరోసారి పొడిగంచే యోచనలో ఉందని సమాచారం. ప్రధాని నరేంద్ర మోడీకి నమ్మిన బంటుగా గుర్తింపు పొందిన దాస్ ప్రస్తుత పదవీకాలం డిసెంబర్ 10తో ముగియనుంది. ఈ స్థానం కోసం ఇతర అభ్యర్థులను ఎవరినీ ఇప్పటి వరకూ ఎంపిక చేయలేదని సమాచారం. దీంతో ఆయన పదవీకాలం రెండోసారి పొడిగించే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. 2018 డిసెంబర్ 12న ఆర్‌బిఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2021 డిసెంబర్ 10కి ఆయన మూడేళ్ల పదవీ కాలం ముగియడంతో మరోసారి పొడిగించింది.

అమాంతం లేచి..పడిన మార్కెట్లు

- నేడు సెలవు



ముంబయి : వరుసగా ఏడు రోజులు భారీ నష్టాలను ఎదుర్కొన్న దలాల్ స్ట్రీట్‌కు ఎట్టకేలకు స్వల్ప ఉపశమనం లభించింది. మంగళవారం సెషన్ ప్రారంభంలో అమాంతం పెరిగిన స్టాక్ మార్కెట్లు.. ఓ దశలో అమ్మకాల ఒత్తిడితో భారీ లాభాలు ఆరంభమైనప్పటికీ.. తుదకు సానుకూలంగానే ముగిశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ ఉదయం 77,548 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఓ దశలో దాదాపు 1100 పాయింట్లకు పైగా పెరిగి 78,451 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరలో అమ్మకాల ఒత్తిడి చోటు చేసుకోవడంతో 239 పాయింట్ల లాభంతో 77,578.38 వద్ద ముగిసింది. నిఫ్టీ 64.70 పాయింట్ల లాభంతో 23,518 వద్ద ముగిసింది. రష్యా, ఉక్రెయిన్ పరిణామాలు మళ్లీ తీవ్రరూపం దాల్చుతున్నాయనే సంకేతాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, సన్‌ఫార్మా, టైటాన్ షేర్లు అధికంగా లాభాపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బిఐ, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ సుజుకీ షేర్లు అధికంగా నష్టపోయాయి. మహారాష్ట్ర ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో బుధవారం మార్కెట్లకు సెలవు ప్రకటించారు. తిరిగి గురువారం తెరుచుకోనున్నాయి.

సంపాదకీయం

జేజేలు!

శ్రమ జీవుల హక్కుల కోసం, సమసమాజం కోసం ఉద్యమించే వామపక్ష శక్తుల విజయంతోనే తమ జీవితాలు బాగుపడతాయని నమ్మిన శ్రీలంక ప్రజానీకం చారిత్రాత్మక తీర్పునిచ్చారు. జనతా విముక్తి పెరమున (జెవిపి) నేతృత్వంలో మరో 27 వామపక్ష పార్టీలు, పౌర సంస్థలు, ప్రజాసంఘాలు కలిసిన నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) కూటమికి మూడింట రెండొంతుల మెజారిటీతో అఖండ విజయాన్నందించారు. ఆర్థిక సంక్షోభంతో కుప్పకూలిన దేశాన్ని, రోడ్డునపడ్డ తమ జీవితాలను బాగుచేయడం... అవినీతి, బంధుప్రీతి, కార్పొరేట్ శక్తుల గుప్పిట్లోని పార్టీల వల్ల సాధ్యం కాదని భావించడం వల్లే అరుణపతాకాన్ని సమున్నతంగా ఎగురవేశారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏడు దశాబ్దాలుగా దేశాన్ని ఏలుతున్న ప్రధాన సాంప్రదాయక పార్టీలు ప్రజల ఆకాంక్షలను వమ్ముచేశాయి. 2022లో శ్రీలంకను కుదిపేసిన మహా ఆర్థిక సంక్షోభానికి ఆ పార్టీలు అనుసరించిన నయా ఉదారవాద విధానాలే ప్రధాన కారణం. ప్రజా తిరుగుబాటుతో అధ్యక్ష భవనం వీడి గొటబయ రాజపక్సే మిలటరీ రక్షణతో దేశం విడిచిపారిపోయారు. ఆ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎన్‌పిపి కూటమి అభ్యర్థిగా ముందుకొచ్చిన జెవిపి నేత అనుర కుమార దిసనాయకె శ్రీలంక తొలి వామపక్ష అధ్యక్షుడిగా సెప్టెంబర్‌లో ఎన్నికయ్యారు. ఆరువారాల అనంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 225 స్థానాలకుగాను 159 స్థానాలతో ఎన్‌పిపి విజయ దుందుభి మోగించింది. ఈ ఎన్నికల్లో సాజిత్ ప్రేమదాస, రణిల్ విక్రమసింఘే తమ విభేదాలను పక్కనపెట్టి ఒకే అభ్యర్థిని నిలబెట్టినా... మొత్తం 22 జిల్లాలకు గానూ 21 జిల్లాల్లో ఎన్‌పిపి విజయాన్ని అడ్డుకోలేకపోయారు. గత ఎన్నికల్లో 59 శాతం ఓట్లు, 145 సీట్లు తెచ్చుకున్న రాజపక్సే నేతృత్వంలోని శ్రీలంక పొడుజన పెరుమన (ఎస్‌ఎల్‌పిపి) మూడు స్థానాలకే పరిమితమైంది. హేమాహేమీలంతా మట్టికరిచారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, అవినీతి, అంతర్యుద్ధం కారణంగా ధ్వంసమైన శ్రీలంక పునర్నిర్మాణానికి సింహళ, తమిళ, ముస్లిములన్న విభజన లేకుండా ప్రజలంతా ఐక్యంగా అందించిన చారిత్రాత్మక విజయమిది.

ఫైడల్ కాస్ట్రో, చేగువేరా స్ఫూర్తితో రెండు సార్లు సాయుధ పోరాటం చేసిన చరిత్ర కలిగిన జెవిపి ముందు అనేక సవాళ్లు పొంచివున్నాయి. వాగ్దానాల అమలు కత్తి మీద సామే! లాటిన్ అమెరికా దేశాల్లో అధ్యక్షుడిగా, ప్రధానిగా ఎన్నికైనా పార్లమెంట్‌లో సంపూర్ణ మెజారిటీ సాధించలేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. లాటిన్ అమెరికా మాదిరిగానే జెవిపి ఉన్న వ్యవస్థ పునాదుల మీదనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందా? వ్యవస్థను సమూలంగా మార్చేందుకు ప్రయత్నిస్తుందా? అన్నది చూడాలి. 2022లో అధికారంలోకి వచ్చిన రణిల్ విక్రమ్ సింఘే ప్రభుత్వం ఐఎంఎఫ్, ఇతర అంతర్జాతీయ సంస్థల విషమ షరతులన్నింటికీ తలూపింది. విద్యుత్ సబ్సిడీని రద్దు చేసింది. ఆ షరతులను కొనసాగిస్తే... 400 ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ లేదా పునర్వ్యవస్థీకరణ చేసి, లక్షల మందిని రోడ్డున పడేయాల్సి ఉంటుంది. ఉచిత విద్య, వైద్యం వంటి సేవల నుంచి వైదొలగడంతోపాటు పన్నుల భారం మోపాలి. ఈ 290 కోట్ల డాలర్ల ఐఎంఎఫ్ బెయిలవుట్ ప్రణాళికను తిరగదోడడం దిసనాయకె ముందున్న ప్రధాన సవాలు. భారత్, చైనాలతో సంబంధాల్లో సమతూకం పాటించడం విదేశాంగ విధానాల్లో మరో ముఖ్య అంశం. ఆర్థిక విధానాల్లో సమూల మార్పులు, పేదరిక నిర్మూలన కార్యక్రమాలపై కేంద్రీకరణ, ప్రభుత్వ వృథా వ్యయాన్ని అరికట్టి అవినీతిపై ఉక్కుపాదం మోపడం, నూతన రాజ్యాంగాన్ని తీసుకొచ్చి అధ్యక్షుడికి వున్న అపరిమిత అధికారాలను తొలగించడం తదితర హామీలను నిలబెట్టుకోవడంపైనే ఎన్‌పిపి భవిష్యత్తు ఆధారపడి ఉంది. వామపక్షాలకు, ఉద్యమాలకు కాలం చెల్లిందంటూ తప్పుడు కథనాలు వండి వార్చే కార్పొరేట్ మీడియాకు, క్రోనీ కేపిటలిస్టులకు శ్రీలంకలో లెఫ్ట్ విజయం ఒక చెంపపెట్టు లాంటిది. మతాల పేరుతో, జాతుల పేరుతో కార్పొరేట్లకు ఊడిగం చేసే పాలకులకు ప్రజాశక్తి చరమగీతం పాడుతుందనే సందేశం. భారతదేశంతోసహా పలు దేశాల శ్రమజీవులకు ఉత్తేజాన్నిచ్చే జనం తీర్పు.

మహనీయుల మాట



నిజం చెప్పడానికి
ఎంతో ధైర్యం ఉండాలి.
అలాగే నిజాన్ని
ఒప్పుకోవడానికి కూడా
అంతకు మించిన ధైర్యం ఉండాలి.

- ఆర్.కె. నారాయణ్,
ప్రముఖ రచయిత.

R K Narayan

విశ్లేషణ

మతం పేరుతో మానవత్వాన్ని మంట కలపొద్దు

వి. శ్రీనివాసరావు

జనసేన నేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ సనాతన ధర్మం జోలికొస్తే ఊరుకోబోనంటూ హెచ్చరికలు జారీ చేశారు. అన్ని మతాలను సమానంగా చూసేదే సనాతన ధర్మం అంటూ ఒకవైపు చెబుతూనే మరోవైపు చర్చి, మసీదులపై విషం కక్కారు. గత కొంతకాలంగా పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం పేరుతో చాలా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇతర మతాల పట్ల అసహనమే సనాతన ధర్మం అయితే అది రాజ్యాంగ విరుద్ధం. లౌకికతత్వాన్ని పరిరక్షిస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆ రాజ్యాంగాన్నే సవాలు చేస్తున్నారు. ఇంత వరకు ఆయన నిర్దిష్టంగా సనాతన ధర్మం అంటే ఇదీ అని చెప్పలేదు. పైగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం జనసేన తరపున 'నరసింహ వారాహి దళా'న్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ దళాలు ఏం చేస్తాయో కూడా స్పష్టం చేయలేదు. సనాతన ధర్మం అంటే పరమత సహనమా? పరమత ద్వేషమా? సహనమే ఆయన భావం అయితే అంతగా అసహనం వ్యక్తం చేయాల్సిన అవసరం లేదు. భారతదేశ చరిత్రలో పరమత సహనం, అసహనం రెండూ ఘర్షణ పడుతూనే వస్తున్నాయి. కమ్యూనిస్టులు మొదటిదానికి వారసులైతే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు రెండోదానికి ప్రతినిధులు. బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటంలో మత సామరస్యం రూపు దిద్దుకుంది. 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో హిందువులు, ముస్లింలు, సిక్కులు కలిసి బ్రిటిష్ పాలకులను ఎదుర్కొని ప్రాణాలర్పించారు. ఝాన్సీ లక్ష్మీబాయి, తాంతియా తోపే, బహదూర్ షా, మంగళ్ పాండే, బేగం హజరత్ మహల్, కున్వర్‌సింగ్ లాంటి అనేకమంది ఈ పోరాటంలో అసువులు బాసినవారే. నాడు బ్రిటిష్ తొత్తులుగా మారి ఝాన్సీ లక్ష్మీబాయికి వెన్నుపోటు పొడిచిన సింధియాలు నేడు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలలో ప్రముఖులు. 1905 బెంగాల్ విభజన సమయంలో హిందూ ముస్లింలు ఐక్యమై బ్రిటిష్ కుట్రలను ఓడించి ఐక్య బెంగాల్‌ను కాపాడుకున్నారు. బ్రిటిష్ పాలకులు మత ఘర్షణలు పెట్టి స్వాతంత్ర్యోద్యమాన్ని దెబ్బతీయాలని చూశారు. నాడు ఆర్‌ఎస్‌ఎస్ బ్రిటిష్ వారికి తోడ్పడింది. అలాంటి ఆర్‌ఎస్‌ఎస్‌కు పవన్ కళ్యాణ్ కితాబునిస్తున్నారు.

వీర తెలంగాణ పోరాట వారసులు కమ్యూనిస్టులే

ఒకవైపు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజా గాయకులు సృష్టించిన "బండెనక బండి కట్టి ఏ బండ్లో పోతావ్ కొడుకో నైజాము సర్కరోడా" అంటూ పాట ఎత్తుకొని అదే సభలో అదే నోటితో ఆ పోరాటానికి ద్రోహం చేసిన ఆర్‌ఎస్‌ఎస్‌ను పొగడడం పవన్ కళ్యాణ్‌కే చెల్లింది. నిజాం

గత కొంత కాలంగా పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం పేరుతో చాలా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇతర మతాల పట్ల అసహనమే సనాతన ధర్మం అయితే అది రాజ్యాంగ విరుద్ధం. లౌకికతత్వాన్ని పరిరక్షిస్తానని రాజ్యాంగంమీద ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆ రాజ్యాంగాన్నే సవాలు చేస్తున్నారు. ఇంత వరకు ఆయన నిర్దిష్టంగా సనాతన ధర్మం అంటే ఇదీ అని చెప్పలేదు. పైగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం జనసేన తరపున 'నరసింహ వారాహి దళా'న్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ దళాలు ఏం చేస్తాయో కూడా స్పష్టం చేయలేదు. సనాతన ధర్మం అంటే పరమత సహనమా? పరమత ద్వేషమా? సహనమే ఆయన భావం అయితే అంతగా అసహనం వ్యక్తం చేయాల్సిన అవసరం లేదు.

ముస్లిం అయితే అదే నిజాం కొమ్ముకాసి జనాన్ని అణగదొక్కిన జాగీర్దార్లు హిందువులు. తద్విరుద్ధంగా నాటి కాశ్మీరీ పాలకులు హిందువు అయితే మెజారిటీ ప్రజలు ముస్లింలు. అక్కడ రాజు బ్రిటీషు వాళ్ళ కొమ్ము కాస్తే ఆర్‌ఎస్‌ఎస్ బలపర్చింది ప్రజలు బ్రిటీషు పాలనపై పోరాడారు. మొన్నటి దాకా చేగువేరా బొమ్మ పెట్టుకొని యువతను ఆకర్షించి ఇప్పుడు ఆ చేగువేరా బొమ్మను పక్కన పడేసి మోడీ బొమ్మ తగిలించుకొని హఠాత్తుగా అవతారం మార్చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు చేయలేని పనిని రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ ద్వారా మోడీ, అమిత్‌షాలు చేయిస్తున్నారు. ఎన్డీయే కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నది. తెలుగుదేశం పార్టీకి చెక్ పెట్టి తమ ఆధిపత్యాన్ని సాధించడానికి బిజెపి పవన్ కళ్యాణ్‌ను ముందు పెట్టి బీ టీమ్‌గా మార్చుకుంటున్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగటాన్ని ఖండిస్తూ మహారాష్ట్ర ఎన్నికల సభలో గళమెత్తారు. కానీ మణిపూర్ మండిపోతున్న విషయాన్ని మాత్రం విస్మరించారు.

మతోన్మాదం ఏ పేరుతో ఉన్నా ప్రమాదమే

బంగ్లాదేశ్‌లో గత 20 సంవత్సరాలుగా హసీనా పాలనలో లౌకికవాదమే నడిచింది. ఇప్పుడు జమాతే ఇస్లామి తదితర మతోన్మాద శక్తులు పేట్రేగిపోతున్నాయి. బంగ్లాదేశ్ కమ్యూనిస్టు పార్టీ సహా లౌకిక శక్తులు బంగ్లాదేశ్ మైనారిటీలపై సాగుతున్న దాడులను తీవ్రంగా ఖండించాయి. అయితే బంగ్లాదేశ్ నుంచి ఇండియాకు వలస వస్తున్న వారిలో హిందువులే కాదు, ముస్లింలు కూడా ఉన్నారు. అలా మన దేశానికి వలసొచ్చి స్థిరపడిన హిందువులకు మాత్రమే భారత పౌరసత్వం ఇస్తామని ముస్లింలు పరాయి దేశస్తులని మోడీ ప్రభుత్వం వివక్ష పాటిస్తున్నది. సిఎఎ చట్ట సవరణ దీనికోసమే చేసింది. కరోనాకు ముందు దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా పెద్ద ఎత్తున ఉద్యమం నడిచింది. బంగ్లాదేశ్‌లో మతోన్మాదానికి హిందువులే కాదు ముస్లింలు కూడా బలవుతున్నారు. మత వివక్ష పాటించకుండా అన్ని మతాల వారికి పౌరసత్వం ఇవ్వడం న్యాయ సమ్మతం, సమాన ధర్మం అవుతుంది. ఈ సమతా ధర్మాన్ని ఉల్లంఘించింది బిజెపి. ఆ బిజెపిని వెనకేసుకొస్తున్నారు పవన్ కళ్యాణ్. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను వెనకేసుకొస్తూ అన్ని మతాలను ఆయన ఎలా సమానంగా గౌరవించగలరు?

గత కొద్దిరోజులుగా మణిపూర్ తిరిగి భగ్గుమంటున్నది. రెండు ఆదివాసీ తెగల మధ్య మతం పేరుతో కుంపటి రాజేసింది బిజెపి. అది ఇప్పుడు పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు అనే తేడా లేకుండా మనుషులందరినీ బలిగొంటున్నది. సంవత్సరన్నరగా మణిపూర్‌లో మానవత్వం మంట గలుస్తున్నా మోడీ నోరు మెదపడం లేదు. కనీసం ఆ రాష్ట్ర ప్రజలను ఓదార్చడానికి సందర్శించనూ లేదు. ఇదేనా పవన్ కళ్యాణ్ దృష్టిలో మానవత్వమంటే? మణిపూర్ కోసం మోడీని నిలదీయగలరా? సనాతన ధర్మం పేరుతో ఇలాంటి మారణకాండను, అకృత్యాలను పవన్ కళ్యాణ్ ఎలా సమర్థించగలరు?

టిటిడిలో మతం పేరుతో ఉద్యోగుల తొలగింపా?

మూడోసారి బిజెపి కేంద్రంలో అధికారంలోకి రావడమేగాకుండా ఆంధ్రప్రదేశ్‌ను హస్తగతం చేసుకోవాలని నానారకాల వ్యూహాలు పన్నుతున్నది. అందులో పవన్ కళ్యాణ్ ఒక పావు మాత్రమే. మరోవైపు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని తమ గుప్పెట్లోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నది. ఇప్పటికే వక్ఫ్ చట్టానికి సవరణ చేసి భూముల్ని స్వాధీనం చేసుకోవాలని బిజెపి కుట్ర చేసింది. వక్ఫ్ బోర్డులో ముస్లింలు కానివారిని చేరుస్తానంటోంది. అదే బిజెపి హిందూ దేవాలయాల్లో ప్రభుత్వ పాత్ర ఉండకూడదని ఇతర మతస్తులు పని చేయకూడదని వాదిస్తున్నది. టిటిడి లడ్డు వివాదం సందర్భంలో సంబంధం లేకపోయినా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు నేరుగా రిపోర్టులు తెప్పించుకోవడం ఈ కుట్రలో భాగమే. వారిని సంతృప్తిపర్చాలనో లేక భయపడో టిటిడి కొత్త వివాదానికి తెరలేపింది. టిటిడిలో పనిచేస్తున్న కొంత మంది ఇతర మతాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులను ట్రాన్స్‌ఫర్ పేరుతో తొలగించడానికి బోర్డు నిర్ణయించినట్లు చైర్మన్ ప్రకటించారు. వలంటరీ రిటైర్మెంట్ ఇవ్వాలని పొట్ట కూటి కోసం ఉద్యోగాలు చేసుకుంటున్నవారిని మతం పేరుతో తొలగించడం అమానవీయమే కాదు రాజ్యాంగ విరుద్ధం కూడా. మతం పేరుతో ఉద్యోగుల్ని తొలగించాల్సి వస్తే వెంకటేశ్వరస్వామి పక్కనే ఉండే బీబీ నాంచారిని ఏంచేస్తారో టిటిడి బోర్డు చెప్పాలి. ఎన్నో సంవత్సరాలుగా టిటిడికి చెందిన వివిధ విద్యాసంస్థలు, ఆసుపత్రులు, సత్రాలు, గార్డెనింగు, ఫారెస్ట్రీ తదితర రంగాల్లో అనేక మంది పనిచేస్తున్నారు. ఇవన్నీ సెక్యులర్ సంస్థలే. గుడిలోగానీ, గుడి చుట్టూ ఉన్న వృత్తాల్లోగానీ ఇతర మతస్తులెవరూ లేరు. వారి పేరునుబట్టో విశ్వాసాన్ని బట్టో ఉద్యోగాల నుండి టిటిడి ఎలా తొలగిస్తుంది? ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే అది రాజ్యాంగ విరుద్ధమవుతుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని టిటిడి బోర్డు నిర్ణయాన్ని ఉపసంహరింపజేయాల్సిన బాధ్యత ఉంది. ఇందుకోసం అవసరమైతే టిటిడి నిబంధనలను సవరించాలి. వివిధ సంస్థలకు యాజమాన్యంగా ఉన్న టిటిడి బోర్డు చట్ట ప్రకారం అన్ని యాజమాన్యాల్లాంటిదే. లేబర్ చట్టాలతో సహా అన్ని చట్టాలు దానికీ వర్తిస్తాయి. టిటిడి నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎవరిపైనైనా చర్య తీసుకోవచ్చు. టిటిడిలో పెచ్చరిల్లుతున్న అవినీతిని అరికట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై కేంద్రీకరించాల్సిన టిటిడి చిరుద్యోగులపై దాడికి పూనుకోవడం క్షంతవ్యం కాదు. అనేక రకాల అనైతిక కార్యకలాపాలు తిరుమలలోనూ, దేవస్థానంలోనూ జరగడం బహిరంగ రహస్యమే. అలాంటి వాటిని అరికట్టి తిరుమల ప్రత్యేకతను కాపాడడం టిటిడి విధి. ఈ వివాదం మతోన్మాదం విస్తరించడానికి మత విద్వేషాలు పెరగడానికి దారితీస్తుంది. టిటిడి సంస్థల్లో హిందువులు మాత్రమే పని చేయాలనేదే బోర్డు నిర్ణయం అయితే హిందువుల్లో ఏ కులస్తులకు ఎంత గౌరవం ఉందో కూడా వారు సమాధానం చెప్పాలి. హిందూమతం ఒక ఏకశిలాసదృశ్య మతం కాదు. వివిధ కులాల సముదాయం. ఇప్పటికీ దళితుల పట్ల వివక్షత, అంటరానితనం కొనసాగుతున్నది. మతం పేరుతో మహిళల పట్ల "అంటు" విశ్వాసం కొనసాగుతున్నది. స్వతంత్ర భారత చరిత్రలో ఇప్పటి వరకు ఒక్క దళితుడినైనా టిటిడిలో పురోహితునిగా నియమించారా? మహిళలకు గర్భగుడిలో ప్రవేశం ఉందా? అక్కడ వృత్తిదారులుగా పనిచేస్తున్న బిసిల స్థానం ఏమిటి? దేవుడు వీరిని అసమానంగా పుట్టించాడా? లేదా దేవస్థానం అసమానత్వాన్ని పాటిస్తున్నదా? ఈ అసమానత్వాన్ని నిర్మూలించకుండా ఆర్‌ఎస్‌ఎస్ ఒత్తిడికి లోబడి మతం పేరుతో రాజకీయాలు చేయడం తగదు. తిరుమలపై రాజకీయ ప్రకటనలు అనుమతించబోమని చెప్పిన బోర్డు అదే రాజకీయ నాయకుల చేతిలో కీలుబొమ్మ కాకూడదు. అయోధ్యలో అడ్రస్ లేకుండా పోయిన బిజెపి టిటిడిని ఎలాగైనా తన కబంధ హస్తాల్లో బంధించాలని రంగంలోకి దిగింది. వారి చేతిలో టిటిడి బోర్డు తురుపు ముక్క కాకూడదు.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శి /

ఇప్పటికీ దళితుల పట్ల వివక్షత, అంటరానితనం కొనసాగుతున్నది. మతం పేరుతో మహిళల పట్ల 'అంటు' విశ్వాసం కొనసాగుతున్నది. స్వతంత్ర భారత చరిత్రలో ఇప్పటి వరకు ఒక్క దళితుడినైనా టిటిడిలో పురోహితునిగా నియమించారా? మహిళలకు గర్భగుడిలో ప్రవేశం ఉందా? అక్కడ వృత్తిదారులుగా పని చేస్తున్న బి.సి ల స్థానం ఏమిటి? దేవుడు వీరిని అసమానంగా పుట్టించాడా? లేదా దేవస్థానం అసమానత్వాన్ని పాటిస్తున్నదా? ఈ అసమానత్వాన్ని నిర్మూలించకుండా ఆర్‌ఎస్‌ఎస్ ఒత్తిడికి లోబడి మతం పేరుతో రాజకీయాలు చేయడం తగదు.

సందర్భం

బాలల హక్కులు-ప్రభుత్వాల బాధ్యత

షేక్ కరిముల్లా

నవంబర్ 14 బాలల దినోత్సవం ప్రతి యేటా మొక్కుబడిగానే జరుపుకుంటున్నాం. ఇరవయ్యవ తేదీన ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినం ఒకటి ఉందన్న స్పృహ కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో లేదు. వారి హక్కులు, వారి చదువు, వారి భవిష్యత్తు పట్ల తల్లిదండ్రులతో పాటు సమాజానికి ఒక మంచి ప్రేరణనివ్వాల్సిన దినోత్సవాన్ని గుర్తించడంలోనే మన పాలకులు విఫలమయ్యారు. ఇది నిజంగా చిన్నారుల భవిష్యత్తు పట్ల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నది. ఎందుకంటే పిల్లలు పుష్పాల్లా వికసించాలే గాని వారిని మొగ్గలోనే చిదిమేస్తే ఈ దేశ భవిష్యత్తు ఏం కావాలి? ఇప్పటికే చాలా నష్టం జరిగింది, జరిగిపోతూ వుంది. స్వాతంత్ర్యం వచ్చాక పదేళ్ల లోనే సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని నిర్దేశించుకున్నాం. దశాబ్దాలు దాటిపోతున్నా లక్ష్య సాధనకు దూరంగానే ఉన్నాం. ఇప్పటికీ సుమారు ఎనిమిది కోట్ల మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారంటే మనమెక్కడున్నాం అనేది విశ్లేషించుకోవాలి? కానీ, అది జరుగుతున్నదా?

ఆధునిక ప్రజాస్వామిక పరమైన రక్షణలు కల్పించాయి. వ్యక్తి పరిపూర్ణ అభివృద్ధికి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు ప్రాథమిక హక్కులు పెట్టని కోట. భారత ప్రజాస్వామ్యానికి ఇవి పునాది రాళ్లు. జీవి పుట్టుకతో వచ్చిన హక్కులు అత్యంత సహజ సిద్ధమైనవి. స్పృహ పెరుగుతూ వచ్చిన క్రమంలో 1959లో ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ప్రకటన చేసింది. ఈ ప్రకటన బాలల హక్కులకు 'మాగ్నా కార్టా'గా చెప్పవచ్చు. దీని సారాంశం-బాలలు జాతి, లింగ, రంగు, భాష, మతం, జాతి తేడా లేకుండా అన్ని హక్కులకు అర్హులు. స్వేచ్ఛగా, గౌరవంగా, ఆరోగ్యంగా, శారీరకంగా, మానసికంగా, నైతికంగా ఎదగాలి. అందుకు సంపూర్ణ అవకాశాలు కల్పించబడాలి. సరైన పోషక ఆహారం, గృహ వసతి, వైద్య సేవలు పొందే హక్కు వుంది. పిన్న వయస్సులో ఎంతో అవసరమైతే తప్ప తల్లి నుండి వేరు చేయరాదు. పేద పిల్లలకు ప్రభుత్వం చేయూతనివ్వాలి. వారు ఉచిత, నిర్బంధ, విద్య పొందటానికి అర్హులు. సమాజానికి ఉపయోగపడే పౌరులు అవటానికి ఆస్కారమిచ్చే విద్యను, జ్ఞానాన్ని ప్రభుత్వమందించాలి. ఆటలు, వినోదం పొందటానికి పూర్తి అవకాశాలు పిల్లలు పొందాలి. ఈ హక్కును పొందటానికి సమాజం, ప్రభుత్వం చొరవ చూపాలి. అన్ని రకాల నిర్లక్ష్యం క్రూరత్వం, దోపిడీల నుండి బాలలకు రక్షణ లభించాలి. ఏ రకమైన అక్రమ రవాణాకు వారు గురికాకూడదు-అని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

అయినా అనేక దేశాల్లో ఈ ప్రకటనలోని అనేక అంశాలు అమలుకు నోచుకోలేదు. ఇరవయ్యవ శతాబ్దంలో మానవ హక్కుల చట్టబద్ధత ప్రస్తావనలో బాలల హక్కులకు ప్రత్యేక స్థానం కల్పించేందుకు ఐక్యరాజ్యసమితిలో ప్రత్యేక చర్చ జరిగింది. 1989 నవంబర్ 20న ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒడంబడికలో 180 దేశాలు సంతకాలు చేశాయి. ఈ అనేక ప్రయత్నాల మూలంగా ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ 1989 నవంబర్ 20న బాలల హక్కుల ఒప్పందాన్ని ఆమోదించింది. నాటి నుండి నవంబర్ ఇరవయ్యవ తేదీని 'బాలల హక్కుల పరిరక్షణ దినం'గా గుర్తించారు. భారత ప్రభుత్వం 1992 డిసెంబర్ 11న సంతకం చేసి బాలల హక్కుల ప్రకటన జారీ చేసింది. భారత రాజ్యాంగం బాలల హక్కులకు హామీ ఇచ్చింది. కానీ ఆచరణలో అవి అమలుకు నోచుకోలేదు. 1992లో మోహిని జైన్ ఉన్నికృష్ణన్ కేసులో విద్యను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించింది. అప్పుడు కేంద్రం విద్యను ప్రాథమిక హక్కుగా చేస్తూ 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 'విద్యాహక్కు బిల్లు 2005'ను ఆమోదించింది. అయితే 6-14 సంవత్సరాల పిల్లలకు మాత్రమే విద్యాహక్కు పరిమితం చేస్తే సరిపోదు. రాజ్యాంగంలో 4వ భాగంలో 45వ అధికరణ ప్రకారం పూర్వ ప్రాథమిక విద్యను కూడా హక్కుగా చేయాలి. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలోని 'ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య'ను ప్రాథమిక హక్కుగా మార్చింది. అందుకోసం రాజ్యాంగంలోని 21వ అధికరణ అయిన జీవించే హక్కును 21-ఏ ని చేర్చి 'జ్ఞానంతో జీవించాలి' అనే అర్థాన్ని ఇచ్చింది.

ఈ చట్టం 2010 ఏప్రిల్ 1న అమల్లోకి వచ్చింది. ఇందులో పాఠశాల విద్యకు దూరంగా ఉన్న ఏడు కోట్ల మంది పిల్లలను బడి బాట పట్టించాలని, వారికి మంచి ప్రమాణాలతో కూడిన ఉచిత నిర్బంధ విద్యను అందించాలని పేర్కొంది. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రయివేటు విద్యాసంస్థలలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని సూచించింది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిసి 55:45 నిష్పత్తిలో వచ్చే ఐదేళ్లలో ఈ లక్ష్య సాధనకు రూ.1,71,000 కోట్లు వెచ్చించాల్సి వుందని లెక్క చెప్పింది. కానీ, వసతులు లేని పాఠశాలలు, అందుబాటులో లేని పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయులు లేని తరగతి గదులు ఎప్పటిలాగే షరామామూలే. పాఠశాలల్లో కనీస వసతులైన మంచినీరు, మరుగుదొడ్లు కానరావు. క్రీడాస్థలాలు లేనే లేవు. అసలు పాఠాలు చెప్పటానికి తగినంతగా ఉపాధ్యాయులే లేరు. పైగా ఉపాధ్యాయులపై, పాఠశాల నిధులపై అజమాయిషీని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలకు అప్పజెప్పింది.

పేద వర్గాల పిల్లలకు 25 శాతం సీట్ల కేటాయింపును వ్యతిరేకిస్తూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా... ఈ కేటాయింపును సమర్థిస్తూ ధర్మాసనం 2012 ఏప్రిల్‌లో తీర్పు చెప్పింది. ఈ చట్టం అమల్లోకి వచ్చి ఏళ్ళు గడుస్తున్నా పాఠశాల విద్యాహక్కులో పొందుపరచిన వివిధ అంశాలు ఆచరణకు నోచుకోలేదు. పైగా ప్రైవేటు రంగంలోని విద్యాసంస్థలు, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా పెద్ద మొత్తంలో ఫీజులతో పాటు, స్కూల్ వద్దే యూనిఫాంలు, పుస్తకాలు, డైరీ, బెల్ట్ కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి తల్లిదండ్రుల వద్ద నుండి పెద్ద మొత్తంలో డబ్బులను గుంజుతున్నాయి. విద్యార్థులను ఉదయం నుంచి సాయంత్రం వరకు పది గంటలకు పైగా తరగతి గదులలో బంధించి బట్టీ విధానాలతో బలవంతంగా బోధించటం వలన సృజనాత్మకత, జ్ఞానం, చైతన్యం, సమాజం పట్ల బాధ్యత లోపించి పిల్లలు యాంత్రికంగా తయారవుతున్నారు.

ఈ ఒత్తిడి నుండి, ఈ హక్కుల ఉల్లంఘన నుంచి బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. సృజనాత్మకత, నైపుణ్యం, విజ్ఞానం, పరిజ్ఞానం, పరిశోధన ప్రజా అవసరాలకు అనుగుణంగా విద్య విధానం ఉండాలి. భారమైన విద్యాబోధన కాకుండా...విద్యార్థి స్వేచ్ఛగా జ్ఞానం సముపార్జించుకునేలా శాస్త్రీయ విద్యావిధానం ప్రవేశపెట్టాలి. అది కూడా వారి మాతృభాషలలో జరగాలి. ప్రజలందరికి పేద, ధనిక తేడా లేకుండా ఒకే రకమైన విద్యా వ్యవస్థను, సూచించిన డా॥ డి.ఎస్.కొఠారి (కొఠారి కమిషన్ 1964-66 సిఫార్సులు) కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. అప్పుడే నిజమైన దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మించబడుతుంది.

/ వ్యాసకర్త సెల్ : 9705650705/

ఈ ఒత్తిడి నుండి, ఈ హక్కుల ఉల్లంఘన నుంచి బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. సృజనాత్మకత, నైపుణ్యం, విజ్ఞానం, పరిజ్ఞానం, పరిశోధన, ప్రజా అవసరాలకు అనుగుణంగా విద్యా విధానం ఉండాలి. భారమైన విద్యాబోధన కాకుండా...విద్యార్థి స్వేచ్ఛగా జ్ఞానం సముపార్జించు కునేలా శాస్త్రీయ విద్యావిధానం ప్రవేశపెట్టాలి. అది కూడా వారి మాతృభాషలలో జరగాలి. ప్రజలందరికి పేద, ధనిక తేడా లేకుండా ఒకే రకమైన విద్యా వ్యవస్థను, సూచించిన డా॥ డి.ఎస్.కొఠారి (కొఠారి కమిషన్ 1964-66 సిఫార్సులు) కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి.

జనవాక్యం

మణిపూర్ మంటలు

నేడు మణిపూర్‌లో జాతుల మధ్య వైరం దావాలనంలా తయారైంది. ఈ సంవత్సరం మొదట్లో ఒక మహిళను నగ్నంగా ఊరేగించి, ఆపై హత్య చేసిన వీడియో బయటకు వచ్చినప్పుడు సుప్రీం కోర్టు కూడా తీవ్రంగా తీసుకుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగు ఆదేశాలిచ్చింది. అక్కడి సమస్యకు రాజకీయ, సామాజిక పరిష్కారాల్ని చర్చల ద్వారా, పాలనపై నమ్మకం కలగజేయడం ద్వారా కాకుండా ప్రభుత్వం శాంతి భద్రతల కోణంలోనే ఆలోచించింది. ఫలితంగా అదే ముఖ్యమంత్రి, అదే బలగాల్ని పెంచుతూ పోయే ప్రక్రియలు. అవి వికటించగా నేడు మళ్ళీ 5 వేల మంది బలగాల మోహరింపు, సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం మళ్ళీ ప్రవేశ పెట్టడం లాంటివి అవసరం పడ్డాయి. రోజులు గడుస్తున్న కొద్దీ సమస్య జఠిలం అవుతుంది. ఇప్పటికే ఏడాదిన్నర గడిచింది. రాను రానూ పరిస్థితి దిగజారుతుందంటే, కేంద్రం చేస్తున్న చికిత్స పని చేయడం లేదని అర్థం. మంత్రులకే రక్షణ లేని స్థితికి వచ్చింది. రాష్ట్రంలో మిత్ర పక్షాలు, నేషనల్ పీపుల్స్ పార్టీతో సహా, మద్దతు ఉపసంహరించుకున్నాయి. ఇప్పుడు కేంద్రం ఆ రాష్ట్రాన్ని పూర్తిగా తన అదుపులోకి తెచ్చుకుని మంటల్ని ఆర్పాల్సిన అవసరం ఉంది. తన క్రియాశీలక చర్యలతో అక్కడి ప్రజల నమ్మకాన్ని పొందడం అందులో మొదటి ధ్యేయం కావాలి.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

పిఎం కిసాన్‌తో కలిపే అన్నదాత సుఖీభవ

- రూ.20 వేలు త్వరలో అందిస్తాం
- మండలిలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అమల్జేస్తున్న 'పిఎం కిసాన్'తో కలిపే రాష్ట్రంలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమల్జేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనమండలిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 'పిఎం కిసాన్' ద్వారా అందించే రూ.6 వేలతో కలిపి 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు రూ.20 వేలు అందిస్తామని ఆయన చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో వైసిపి సభ్యులు మర్రి రాజశేఖర్, దువ్వాడ శ్రీనివాస్, పి రామసుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నలకు అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ.. ఈ పథకానికి విధివిధానాలు రూపొందించి వీలైనంత త్వరలో అందిస్తామన్నారు. రాజశేఖర్, రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ కాలం ముగిసి రబీ వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేలు, కేంద్ర ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రూ.6 వేల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 52 లక్షల మంది రైతులకు ఆ పథకం వర్తింపచేయాలంటే రూ.10,500 కోట్లు అవసరమని, బడ్జెట్‌లో మాత్రం రూ.4500 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర పథకాలు రెండూ కలిపి రూ.13500 చొప్పున అందజేశారని, తాము కూడా అలానే చెల్లిస్తున్నామని చెప్పారు. కౌలు రైతుల చట్టంలో మార్పులు చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. దీనిపై రైతు సంఘాలతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. 9.8 లక్షల మందికి కౌలు రైతు కార్డులు ఇచ్చామని చెప్పారు. ఇటీవల సంభవించిన వరదల కారణంగా 156393 హెక్టార్లలో పంట దెబ్బతిందని వైసిపి సభ్యులు తోట త్రిమూర్తులు, కవురు శ్రీనివాస్ అడిగిన మరో ప్రశ్నకు అచ్చెన్నాయుడు సమాధానం చెప్పారు. 2019-24 కాలంలో పంచాయతీ భవనాలకు రంగులు వేసేందుకు రూ.101.81 కోట్లు ఖర్చు చేసినట్లు సభ్యులు రామారావు, చిరంజీవిరావు, తిరుమల నాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పారు.

బడ్జెట్ పద్దులకు శాసనసభ ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో మంగళవారం పలు శాఖలపై ప్రతిపాదించిన బడ్జెట్ పద్దులకు ఆమోదం లభించింది. స్వల్పకాలిక చర్చతో ఈపద్దులకు సభ ఆమోదం తెలిపింది. బిసి సంక్షేమం, చేనేత, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు కేటాయించిన రూ.29,879.94 కోట్లతో రూపొందించిన పద్దులను మంత్రి సవిత ప్రతిపాదించారు. సభ్యుల ఆమోదంతో ఈ ప్రతిపాదనను ఆమోదించినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. దేవాదాయశాఖ రూ.233.77 కోట్లతో చేసిన ప్రతిపాదనలను మంత్రి నారాయణ ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత రూ.8495.11 కోట్లతో రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలను సభలో ప్రవేశపెట్టారు. సభ ఆమోదించింది. మునిసిపల్ మంత్రి పి.నారాయణ తన శాఖకు సంబంధించిన రూ.11,478.83 కోట్లతో చేసిన ప్రతిపాదనలు సభ్యులు ఆమోదించారు. ఆబ్కారీ శాఖకు సంబంధించి రూ.245.978 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను మంత్రి కొల్లు రవీంద్ర ప్రవేశపెట్టారు. ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ రూ.34,973.18 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు. వాణిజ్య పన్నుల శాఖ బడ్జెట్ రూ.రూ.449.23 కోట్లతో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపాదించారు. శాసన సభ వ్యవహారాల శాఖకు కూడా మంత్రి పయ్యావుల రూ.132.25 కోట్లతో ప్రతిపాదనలను సభలో ప్రవేశపెట్టగా ఆమోదించినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. టూరిజం శాఖ నుంచి రూ.137.28 కోట్లతో మంత్రి కందుల దుర్గేష్ ప్రతిపాదనలు చేశారు. పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రూ. 2.06 కోట్లతో ప్రతిపాదనలు ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ అబ్లిగెంట్ (లు) :1) మెస్సర్స్ వంశధార కాటన్ ఇండస్ట్రీస్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ : శ్రీ సొంఠినేని వెంకటేశ్వరరావు, జానపాడు రోడ్డు, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా, ఎపి - 522413. **2) శ్రీ సొంఠినేని వెంకటేశ్వరరావు** (మేనేజింగ్ పార్టనర్ & హామీదారు), తండ్రి : పేరయ్య, డి.నెం. 7-213/ఎ, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా, ఎపి. **3) శ్రీ చింతలపూడి పూర్ణచంద్రరావు** (పార్టనర్ & హామీదారు), తండ్రి : పేరయ్య, డి.నెం. 7-294, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా, ఎపి. **4) శ్రీ సొంఠినేని నవీన్ చౌదరి** (పార్టనర్ & హామీదారు), తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం. 7-213/ఎ, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా, ఎపి. **5) శ్రీమతి శొంఠినేని లక్ష్మి** (పార్టనర్ & హామీదారు) భర్త : వెంకటేశ్వరరావు, డి.నెం. 7-213/ఎ, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా, ఎపి. **6) శ్రీమతి గుడె రాజేశ్వరి** (పార్టనర్ & హామీదారు), భర్త : సాంబశివరావు, డి.నెం. 7-294, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా, ఎపి- **7) శ్రీ యార్లగడ్డ అనిల్ కుమార్** (పార్టనర్ & హామీదారు), తండ్రి : దశరధరామయ్య, డి.నెం. 7-294, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా, ఎపి. **8) శ్రీమతి చింతలపూడి మంగమ్మ** (పార్టనర్ & హామీదారు) భర్త : పూర్ణచంద్రరావు, డి.నెం. 7-294, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా, ఎపి.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ వంశధార కాటన్ ఇండస్ట్రీస్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 02-03-2020** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 10-06-2020** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎఆర్‌బి బ్రాంచ్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 02-03-2020** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. (చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది)

షెడ్యూల్ ఆస్తి

తనఖాపెట్టబడిన ఆస్తి వివరాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి :
ఆస్తి నెం. 1 : శ్రీ శొంఠినేని వెంకటేశ్వరరావు, తండ్రి : పేరయ్య మరియు శ్రీ చింతలపూడి పూర్ణచంద్రరావు, తండ్రి : పేరయ్య గార్ల పేరిట పిడుగురాళ్ళ, అశ్విని థియేటర్ దగ్గర, పిడుగురాళ్ళ రెవిన్యూ గ్రామం, సర్వే నెం. 520/బి1 వద్ద 1544.28 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. (సేల్ డీడ్ నెం. 542/2008) **మొత్తం ఆస్తికి హద్దులు : ఐటమ్ నెం. 1 : 1344.72 చ॥గ॥ల స్థలమునకు హద్దులు : తూర్పు :** క్రోసూరు వెంకట సుబ్బారావు గారి ఇంటి ఆస్తి- 117.6 అ॥, **దక్షిణం :** 103 అ॥ బజారు, **పడమర :** 2వ మరియు 3వ ఐటమ్ కి చెందిన ఆస్తులు, **ఉత్తరం :** 103 అ॥ బెల్లంకొండ డొంక. **ఐటమ్ నెం. 2 : 190.22 చ॥గ॥ల స్థలమునకు హద్దులు : తూర్పు :** ఐటమ్ నెం. 1కి చెందిన 107 అ॥ ఆస్తి, **దక్షిణం :** 16 అ॥ బజారు, **పడమర :** 107 అ॥ బజారు, **ఉత్తరం :** ఐటమ్ నెం. 3కి చెందిన 16 అ॥ ఆస్తి. **ఐటమ్ నెం. 3 : 9.33 చ॥గ॥ల ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు :** ఐటమ్ నెం. 1కి చెందిన 10.6 అ॥ ఆస్తి, **దక్షిణం :** ఐటమ్ నెం. 2కి చెందిన 16 అ॥ ఆస్తి, **పడమర :** హద్దులు లేవు. **ఉత్తరం :** 18 అ॥ బెల్లంకొండ డొంక
ఆస్తి నెం. 2 : శ్రీ శొంఠినేని వెంకటేశ్వరరావు, తండ్రి : పేరయ్య మరియు శ్రీ చింతలపూడి పూర్ణచంద్రరావు, తండ్రి : పేరయ్య గార్ల పేరిట పిడుగురాళ్ళ, గంగ మహల్ ఏరియా, పిడుగురాళ్ళ రెవిన్యూ గ్రామం, సర్వే నెం. 416/ఎ వద్ద 253.50 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. (సేల్ డీడ్ నెం. 3083/2012) **మొత్తం ఆస్తికి హద్దులు : తూర్పు :** మున్సిపల్ బజారు, **దక్షిణం :** బెల్లంకొండ రమణమ్మ గారి ఇంటి ఆస్తి, **పడమర :** గంగ మహల్ ఆస్తి, **ఉత్తరం :** గవర్నమెంట్ బజారు.

తేది : 16-11-2024
ప్రదేశం : విజయవాడ
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రుషికొండ, శారదా పీఠంపై వాదోపవాదనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో రుషికొండ భవనాల నిర్మాణం, భీమిలిలోని శారదా పీఠానికి భూముల కేటాయింపు అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదనలు జరిగాయి. శారదా పీఠానికి ఎకరాకు రూ.1.5 కోట్ల మార్కెట్ విలువ వసూలు చేయాలని కలెక్టర్ ప్రతిపాదిస్తే అక్రమంగా కేవలం రూ.లక్ష చొప్పున కేటాయించారని టిడిపి సభ్యులు దువ్వారపు రామారావు, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అడిగిన ప్రశ్నకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని తెలిపారు.

పేదలకు, ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ భూములను గత ముఖ్యమంత్రి పీఠాధిపతి స్వరూపానందకు గురుదక్షిణ కింద బహుమతి ఇచ్చారని విమర్శించారు. సభ్యులు రామారావు, రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అడ్డగోలుగా శారదా పీఠానికి 17 ఎకరాలు కేటాయించిందని చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి శారదా పీఠం నిర్మించారని, ఈ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఇషా సంస్థ, చినజీయర్ స్వామిజీలకు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చారని గుర్తుచేశారు. 'గురుదక్షిణ' అనడం సరికాదని, నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇషా సంస్థకు ఇచ్చిన భూముల వెనక్కి తీసుకున్నామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. రుషికొండ భవనాలను పర్యాటకం పేరుతో అనుమతులు తీసుకొని సిఎం క్యాంపు కార్యాలయంగా మార్చారని పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ టిడిపి సభ్యులు రామారావు, పంచుమర్తి అనురాధ, వేపాడ చిరంజీవి రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ భవనాలకు రూ.451.67 కోట్లు మంజూరు చేసి రూ.320.03 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చదరపు అడుగు రూ.26 వేలతో ఈ భవనాలు నిర్మించారని, ప్రపంచంలో ఎవరూ కూడా ఇంత ఖర్చుతో భవనాలు నిర్మించరని అన్నారు. బొత్స మాట్లాడుతూ ప్రభుత్వ భవనంగా నిర్మించారని అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఉప్పాడలో ఎగసి పడుతున్న అలలు

ఉప్పాడ తీరంలో అలల జోరు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలోని బీచ్ రోడ్డుపై అలలు ఎగసిపడుతున్నాయి. ఈ నెల 23వ తేదీ నుంచి బంగాళాఖాతంలో తుపాన్ ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మంగళవారం ఉప్పాడ తీరం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగిసి పడటంతో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అల లెగిసిపడుతుండటంతో బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన రాళ్లు రోడ్డుపైకి చేరుతున్నాయి. సముద్రపు అలల కారణంగా రంగంపేట కాలనీలోకి సముద్రపు నీరు చేరుతుంది.

నీటి పారుదల వ్యవస్థ పటిష్ట నిర్వహణకు కృషి

- మంత్రి నిమ్మల

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్రంలో నీటి పారుదల వ్యవస్థ పటిష్ట నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు బత్తుల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. కాలువలు, డ్రైనులలో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు రెండు విడతలుగా రూ. 79.22 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. 2324 అత్యవసర పనులకు రూ. 284.04 కోట్లు పరిపాలన ఆమోదం లభించిందని వివరించారు. రాష్ట్రంలోని కాలువలు, డ్రైనులు నిర్వహణకు ఏటా రూ.983 కోట్లు కేటాయించాల్సివుందన్నారు. వివిధ ప్రాజెక్టుల్లో 7,224 మంది లస్కర్లు అవసరం ఉండగా..అయితే ప్రస్తుతం 1517 మంది మాత్రమే ఉన్నారని, త్వరలో వీరి నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం లిఫ్ట్ స్కీములు 1040లో గత ప్రభుత్వ హయాంలో 454 మూతపడ్డాయన్నారు. వీటిని పునరుద్ధరణకు కృషి చేస్తున్నామన్నారు.

హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ. 2,950 కోట్లు

హంద్రీనీవా ప్రాజెక్టు మెయిన్ కెనాల్ విస్తరణ, అడవిపల్లి రిజర్వాయర్ పనుల కోసం రూ.2,950 కోట్లు కేటాయించినట్లు మంత్రి నిమ్మల తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అడిన ప్రశ్నకు నిమ్మల సమాధానం చెప్పారు. త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. 1800 క్యూసెక్కుల సామర్థ్యంతో ఉన్న 554 కిలో మీటర్ల హంద్రీనీవా మెయిన్ కెనాల్‌ను వెడల్పు చేయడానికి రూ. 2600 కోట్లు కేటాయించామన్నారు. కాలువలో నీటి ప్రవాహాన్ని 3,855 క్యూసెక్కులకు పెంచడం ద్వారా అడవిపల్లి రిజర్వాయరుకు నీరు చేరుతుందన్నారు. ఈ క్రమంలోనే అడవిపల్లి రిజర్వాయర్ పూర్తికి మరో రూ. 350 కోట్లు కేటాయించామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చిత్తూరు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు

ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK
(ఒక షెడ్యూల్డు కమర్షియల్ బ్యాంక్) (సిఐఎన్: L36911RJ1996PLC011381)
రిజిస్టర్డు ఆఫీసు: 19-ఎ, ధులేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్. జైపూర్, రాజస్తాన్, ఇండియా-302001.

అనుబంధం-4 (రూల్ 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు **ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఇందు తదుపరి "బ్యాంక్"గా పేర్కొనబడును) ఏదైతే, ఆర్‌బిఐల్ ఆమోదం అనుసరించి ఏప్రిల్ 01, 2024 నుండి వర్తిస్తూ **ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** తో విలీనమైనది) గతంలో ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌తో సహా మరియు మాధ్యంలో వ్యక్తపరుచు) యొక్క అధీకృత అధికారిగా, ది "సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002" (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలు, తాకట్టుదారులు, సహ-రుణగ్రహీతలు& హామీదారులును సదరు డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజులు (అరవై రోజులు) లోగా సదరు డిమాండ్ నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. దిగువ రుణగ్రహీతలు ఏదైతే **ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** తో విలీనమైన ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ నుండి ఆస్తిపై రుణం పొందియున్నారు. కావున, బ్యాంకు ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ పేరున చేసిన డిమాండ్ నోటీసు అనుసరించి చేసిన రుణసదుపాయాలు మరియు అన్ని లేదా ఏవేని చెల్లించవలసిందిగా డిమాండ్ చేస్తుంది.
రుణగ్రహీతలు, తాకట్టుదారులు, సహ-బాధ్యులు మరియు ఇందు దిగువ పేర్కొన్న సంబంధితులు సదరు డిమాండ్ నోటీసులోని మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులుకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తి/ఆస్తులను **లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.** రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్దవహించవలసిందిగా కోరబడినది. ప్రత్యేకించి రుణగ్రహీతలు, తాకట్టుదారులు, సహ-బాధ్యులు, సంబంధితులును మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తి/ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** కు రియలైజేషన్ తేదీ వరకు బకాయి మొత్తాలు మరియు దానిపై తదుపరి వడ్డీ& ఇతర చార్జీలతోసహా చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు పేరు/ రుణ ఖాతా నం. & డిమాండ్ నోటీసు తేది	స్వాధీనంచేసుకొన్న తేది	పూర్తి బకాయి మొత్తాలు
1	1. లోన్ ఖాతా నం.23660000765459. 1) బొక్క శ్యామ్ బాబు, 2) శ్రీ/శ్రీమతి బొక్క నాగ మల్లేశ్వరి. డిమాండ్ నోటీసు తేది: 17.08.2024.	15.11.2024 లాంఛనప్రాయ స్వాధీనం	17.08.2024 నాటికి రూ.5,52,911/- దానిపై వడ్డీ& ఇతరు చార్జీలు.
	తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ: పలనాడు జిల్లా, నర్సారావుపేట్ రిజిస్ట్రేషన్ జిల్లా, నరసారావుఏపేట్ సబ్-డిస్ట్రిక్ట్, నకరికల్లు మండలం పరిధిలో చీమలమర్రి గ్రామపంచాయతి పరిధుల్లో చీమలమర్రి గ్రామంలో సర్వే నం.176-ఎఫ్, సైటు విస్తీర్ణం 72-6చ.గ.ల సైటు, దానిలో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్డ్ దాబా ఇంటి ప్లింత్ ఏరియా 200చ.అ.లు, సరైన మొత్తం హక్కులు (గిఫ్ట్ షెడ్యూలు ఆస్తి పత్రం తేది ద్వారా)తో అసెస్మెంట్ నం.235తో డోర్ నం.2-3/1తో దానిపై అనుబంధం మొత్తం. **సరిహద్దులు:** తూర్పు: పంచాయతి రోడ్డు, పడమర: చిటిరాల నవీన్ ఆస్తి, ఉత్తరం: కాకి సుకుమార్ ఆస్తి, దక్షిణం: బొక్క అశోక్ ఆస్తి.		
2	2. లోన్ ఖాతా నం. 23660000649278 1) పండిత్ సామ్యేలు, 2) శ్రీ/శ్రీమతి పండిత్ వెంకట పద్మ. డిమాండ్ నోటీసు తేది: 15.05.2024.	15.11.2024 లాంఛనప్రాయ స్వాధీనం	15.05.2024 నాటికి రూ.8,69,140/- దానిపై వడ్డీ& ఇతరు చార్జీలు.
	తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ: పలనాడు జిల్లా, నర్సారావుపేట్ రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల సబ్-డిస్ట్రిక్ట్, రావుపాలెం మండలంలో, దేవరంపాడు గ్రామ పంచాయతి పరిధుల్లో నెమలిపురి గ్రామం, డోర్ నం.202, ఖాళీ సైటు విస్తీర్ణం 193-6చ.గ.లు (ప్రస్తుతం దానిలో ఆస్తి పన్ను రసీదు ప్రకారం ఇల్లు)తో షెడ్యూలు ఆస్తి అమ్మకం యొక్క అన్ని సరైన హక్కులతో డోర్ నం.2-26, అసెస్మెంట్ నం.226తో దానికి అన్ని అనుబంధాలతోసహా. **సరిహద్దులు:** తూర్పు: ఎగ్జిక్యూటంట్ యొక్క మిగతా సైటు (శ్రీమతి పండిట్ వెంకాయమ్మ), పడమర: పండిట్ భిక్షం, ఉత్తరం: తోట పార్వతమ్మ ల్యాండ్, దక్షిణం: బజారు.		
3	3. లోన్ ఖాతా నం.21630000007141. 1) అంగజాల సర్వేశ్వరరావు, 2) శ్రీ/శ్రీమతి అంగజాల ధనలక్ష్మి. డిమాండ్ నోటీసు తేది: 16.08.2024.	15.11.2024 లాంఛనప్రాయ స్వాధీనం	16.8.2024 నాటికి రూ.6,80,063/- దానిపై వడ్డీ& ఇతర చార్జీలు.
	తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ: గుంటూరు జిల్లా, నరసారావుపేట్ రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు పరిధుల్లో, పిడుగురాళ్ల మండలం, పెద అగ్రహారం గ్రామపంచాయతి ఏరియా, పెద అగ్రహారం గ్రామం యొక్క డోర్ నం.3-2బిలో (డోర్‌నం.3/2లో సబ్-డివిజన్‌కు ముందు)లోగల ఆర్‌సిసి రూఫ్ నివాసిత ఇంటి విస్తీర్ణం 244.61చ.గ.లు లేదా 204.49చ.మీ.ల సైటు. **సరిహద్దులు:** తూర్పు వైపు: 37అ.ల గ్రామ పంచాయతి సిసి రోడ్డు, పడమర వైపు: వినుకొండ కోటయ్య విడిచిపెట్టిన 37అ.ల బజారు 16అ.ల వెడల్పు, ఉత్తరం వైపు: 59అ.లు. ఈ వైపు చిర్చి, దక్షిణం వైపు: వాకిటి రాంబాబు 60అ.ల సైటు.		

తేది: 18.11.2024,
ప్రదేశం: పలనాడు/గుంటూరు జిల్లా
సం/- అధీకృత అధికారి, ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

మహిళా జర్నలిస్ట్‌పై వేధింపులు

- వ్యతిరేక వార్తలు రాస్తోందన్న అక్కసుతో డిజిటల్ దాడులు
- అసభ్యకర పోస్టుల కారణంగా నిద్ర లేని రాత్రులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

న్యూఢిల్లీ : ఈ నెల 16న దేశంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపుకున్న విషయం తెలిసిందే. అయితే పత్రికా స్వేచ్ఛ గురించి డంబాలు పలికే పాలకులు ఆచరణలో మాత్రం పాత్రికేయుల గళానికి, కలానికి అడ్డం పడుతున్నారు. రాణా అయ్యూబ్ అనే మహిళా జర్నలిస్టును లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడిని వాషింగ్టన్ పోస్ట్ ప్రెస్ ఫ్రీడమ్ పార్టనర్‌షిప్ బయటపెట్టింది. 'నవంబర్ 16వ తేదీని జాతీయ పత్రికా దినోత్సవంగా పాటించారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛాయుత, స్వతంత్ర మీడియా నిర్వహించే కీలక పాత్రను చాటిచెప్పేందుకు దీనిని ఉద్దేశించారు. అయితే వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు చెందిన ఒపీనియన్ కంట్రిబ్యూటర్ రాణా అయ్యూబ్‌ను లక్ష్యంగా చేసుకొని సాగించిన దాడులను చూస్తుంటే భారత్‌లో పత్రికా స్వేచ్ఛ నేతి బీరకాయలో నెయ్యి చందంగా ఉన్నదన్న విషయం అవగతమవుతుంది. అయ్యూబ్‌కు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు పత్రాలు, ఆమె ఫోన్ నెంబర్ లీక్ అయ్యాయి. ఆమెపై నిఘా పెరిగింది. కృత్రిమ మేథ సాయంతో అసభ్యకరమైన లైంగిక పోస్టులు వెలిశాయి. భారత్‌లో పత్రికా స్వేచ్ఛ ఏ విధంగా దిగజారిపోతోందో ఈ పరిణామాలు చాటిచెబుతున్నాయి' అని ఆ పార్టనర్‌షిప్ తెలిపింది.

అసభ్యకర కాల్స్‌తో వేధింపులు

విధి నిర్వహణలో వేధింపులు ఎదుర్కోవడం అయ్యూబ్‌కు కొత్తేమీ కాదు. ఆమె 'గుజరాత్ ఫైల్స్' అనే పుస్తకాన్ని రచించి ప్రాచుర్యం పొందారు. 2002లో జరిగిన మత ఘర్షణలను ఆధారంగా చేసుకొని ఆమె ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. అప్పటి నుండీ ఆమెను లక్ష్యంగా చేసుకొని తరచుగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఆమె గొంతుకను అణచివేసేందుకు ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వచ్చిన ఓ పోస్ట్ ఈ దాడులకు పరాకాష్టగా నిలిచింది. అందులో ఆమె ఫోన్ నెంబరును ప్రచురించారు. అనుమతి తీసుకోకుండా ఆన్‌లైన్‌లో వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని పెట్టడం నేరం. ఎక్స్‌లో ఫోన్ నెంబర్‌ను ఉంచినప్పటి నుండీ అయ్యూబ్ నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది. అంతకుముందు ఆమెను ఈడీ అధికారులు అర్థం పర్థం లేని ప్రశ్నలతో వేధించారు. స్విగ్గీకి చెల్లించిన వంద రూపాయల బిల్లుపై కూడా ఆరా తీశారు. అదలా ఉంచితే ఎక్స్‌లో తన ఫోన్ నెంబర్ పెట్టిన తర్వాత ఒకే రోజు రాత్రి ఆమెకు 200 కాల్స్ వచ్చాయి. అవన్నీ అసభ్యకరమైనవే.

ఒక్క రాత్రే వందల కాల్స్

'ఐదారు రోజుల క్రితం నేను పలు కోర్టు విచారణలకు హాజరు కావాల్సి వచ్చింది. ఆ రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు మా బంధువుల అబ్బాయి నిద్ర లేపి ఫోన్ వస్తోందని చెప్పాడు. తీరా చూస్తే అప్పటికే అనేక మిస్డ్ కాల్స్ ఉన్నాయి. వీడియో కాల్స్ కూడా ఉన్నాయి. ఓటీపీలతో మెసేజ్‌లూ వచ్చాయి. ఇవన్నీ 200-300 వరకూ ఉంటాయి. లెక్కపెట్టలేకపోయాను. ఓ కాల్ వస్తే మాట్లాడాను. లైంగికపరమైన, అసభ్యకరమైన భాషతో ఇబ్బంది పెట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఆ తర్వాత కూడా వేధింపులు ఆగలేదు' అని అయ్యూబ్ వివరించారు.

దుండగుల చేతిలో పాస్‌వర్డ్

సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు మరింత రెచ్చిపోయారు. 'మీరు మమ్మల్ని ఏమీ చేయలేరు. మాకు వ్యతిరేకంగా మీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మేము చేసిన దానికి సంబంధించిన లింక్ కూడా మీ వద్ద లేదు' అంటూ అయ్యూబ్‌ను బెదిరించడం ప్రారంభించారు. ఆమె పాస్‌పోర్ట్‌ను, బిల్లులను, జీ మెయిల్ అకౌంట్ పాస్‌వర్డ్‌ను స్కాన్ చేసి పోస్ట్ చేశారు. ఆ పాస్‌వర్డ్‌నే అయ్యూబ్ గత ఎనిమిది సంవత్సరాలుగా ఉపయోగిస్తున్నారు. వారికి తన పాస్‌వర్డ్ ఎలా అందిందో తెలియడం లేదని ఆమె వాపోయారు. దీనికి విచారణ సంస్థలే సమాధానం ఇవ్వాలని అన్నారు. అధికార పక్షానికి వ్యతిరేకంగా గళం విప్పుతున్న అయ్యూబ్‌పై చాలా కాలం నుండీ వేధింపులు కొనసాగుతున్నాయి. కెరీర్ ప్రారంభంలో కూడా ఆమె ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తన కుటుంబాన్ని కూడా లక్ష్యంగా చేసుకొని వేధించారని ఆమె తెలిపారు.

ఫిర్యాదు చేసినా...

'గతంలో నా మేనల్లుడి ఫొటోను ఒసామా బిన్ లాడెన్‌గా మార్ఫింగ్ చేసి పోస్ట్ చేశారు. అతను పాఠశాలలో చదువుకుంటున్నాడు. దీనిపై నేను ఫిర్యాదు చేసినా ఏమీ జరగలేదు' అని అయ్యూబ్ చెప్పారు. '13 సంవత్సరాల వయసున్న మా బంధువుల అమ్మాయి ఫొటోను నా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుండి డౌన్‌లోడ్ చేశారు. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఏమీ జరగలేదు. ఢిల్లీ పోలీస్ మెజిస్ట్రేట్ ఎదుట స్టేట్‌మెంట్ ఇచ్చాను. రెండు సంవత్సరాల తర్వాత కేసును మూసేశారు' అని తెలిపారు. గత వారంలో కథనాలు రాయడం కంటే పోలీస్ స్టేషన్లలోనే ఎక్కువ సమయం గడిపానని అన్నారు. ఆన్‌లైన్ వేదిక ఎక్స్ కూడా తనకు ఎలాంటి సాయం చేయలేదని వాపోయారు. తనపై జరుగుతున్న వేధింపులకు సంబంధించి ఇప్పటి వరకూ ఎవరినీ అరెస్ట్ చేయలేదని, సామాజిక మాధ్యమాలలో పెట్టిన అసభ్యకరమైన పోస్టింగులను సైతం తొలగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి రీత్యా మణిపూర్ వెళ్లినప్పుడు అక్కడ కూడా తనకు వేధింపులు తప్పలేదని అయ్యూబ్ చెప్పారు. ఆందోళనతో మనసు వికలమవుతున్న పరిస్థితులలో ప్రశాంతత కోసం మాత్రలు వేసుకోవాల్సి వస్తోందని ఆమె ఆవేదనతో చెప్పారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ అబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ భీమవరపు విజయ లక్ష్మి పౌల్ట్రీ ఫామ్, ప్రొ॥ భీమవరపు విజయలక్ష్మి, భర్త : లేటు సుబ్బారెడ్డి, డి.నెం. 9-26బి, రామచంద్రపాలెం రోడ్డు, నున్న, విజయవాడ రూరల్ మండలం, కృష్ణా జిల్లా, ఎపి - 521212. **2) శ్రీమతి భీమవరపు విజయలక్ష్మి,** భర్త : లేటు సుబ్బారెడ్డి, డి.నెం. 9-26బి, రామచంద్రపాలెం రోడ్డు, నున్న, విజయవాడ రూరల్ మండలం, కృష్ణా జిల్లా, ఎపి - 521212. **3) మిస్ భీమవరపు దీప్తి రెడ్డి,** తండ్రి : లేటు సుబ్బారెడ్డి, డి.నెం. 9-26బి, రామచంద్రపాలెం రోడ్డు, నున్న, విజయవాడ రూరల్ మండలం, కృష్ణా జిల్లా, ఎపి - 521212.

షెడ్యూల్-బి : పైన తెలిపిన ఎ-షెడ్యూల్ ఆస్తి 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 45.43 చ॥గ॥ల ఆస్తితో పాటు అందలి నిర్మించిన 'శ్రీనివాసం హిల్స్' (ఎ-షెడ్యూల్) నందు ఫస్ట్ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 201 (బ్లాక్ 2) కి చెందిన ప్లింత్ ఏరియా 1010 చ॥అ॥లు కామన్ ఏరియాతో కలిపి, దానికి చెందిన ఈజ్‌మెంట్ హక్కులు మరియు స్టిల్ట్ ఫ్లోర్ (ఎ-షెడ్యూల్) నందు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా తో సహా. **హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము, మెట్లు & కామన్ కారిడార్

ఆస్తి 11 : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా, తెనాలి ఎస్ఆర్ఓ, తెనాలి మున్సిపాలిటీ పరిధి, డి.నెం. 501/1, తెనాలి రెవిన్యూ గ్రామం వద్ద 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి నిర్మించిన "శ్రీనివాసం హిల్స్" అపార్ట్‌మెంట్ నందు స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, రెండవ, మూడవ మరియు నాల్గవ అంతస్తులు మొత్తం. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం.లు 9 & 7 కి చెందిన స్థలము - 183.6 అ॥, **దక్షిణం :** వేమూరి శేషగిరిరావు గారి స్థలము - 230 అ॥, **పడమర :** ప్లాట్ నెం. 13కి చెందిన స్థలము - 183.6 అ॥, **ఉత్తరం :** 40 అ॥ వెడల్పు గల రోడ్డు - 230 అ॥.

షెడ్యూల్-బి : పైన తెలిపిన ఎ-షెడ్యూల్ ఆస్తి 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 45.43 చ॥గ॥ల ఆస్తితో పాటు అందలి నిర్మించిన 'శ్రీనివాసం హిల్స్' (ఎ-షెడ్యూల్) నందు ఫస్ట్ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 202 (బ్లాక్ 2) కి చెందిన ప్లింత్ ఏరియా 1012 చ॥అ॥లు కామన్ ఏరియాతో కలిపి, దానికి చెందిన ఈజ్‌మెంట్ హక్కులు మరియు స్టిల్ట్ ఫ్లోర్ (ఎ-షెడ్యూల్) నందు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా తో సహా శ్రీ రావి భాగత్‌దత్ గారికి చెందినది. **హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము & మెట్లు

ఆస్తి 12 : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా, తెనాలి ఎస్ఆర్ఓ, తెనాలి మున్సిపాలిటీ పరిధి, డి.నెం. 501/1, తెనాలి రెవిన్యూ గ్రామం వద్ద 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి నిర్మించిన "శ్రీనివాసం హిల్స్" అపార్ట్‌మెంట్ నందు స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, రెండవ, మూడవ మరియు నాల్గవ అంతస్తులు మొత్తం. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం.లు 9 & 7 కి చెందిన స్థలము - 183.6 అ॥, **దక్షిణం :** వేమూరి శేషగిరిరావు గారి స్థలము - 230 అ॥, **పడమర :** ప్లాట్ నెం. 13కి చెందిన స్థలము - 183.6 అ॥, **ఉత్తరం :** 40 అ॥ వెడల్పు గల రోడ్డు - 230 అ॥.

షెడ్యూల్-బి : పైన తెలిపిన ఎ-షెడ్యూల్ ఆస్తి 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 45.43 చ॥గ॥ల ఆస్తితో పాటు అందలి నిర్మించిన 'శ్రీనివాసం హిల్స్' (ఎ-షెడ్యూల్) నందు రెండవ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 301 (బ్లాక్ 2) కి చెందిన ప్లింత్ ఏరియా 1010 చ॥అ॥లు కామన్ ఏరియాతో కలిపి, దానికి చెందిన ఈజ్‌మెంట్ హక్కులు మరియు స్టిల్ట్ ఫ్లోర్ (ఎ-షెడ్యూల్) నందు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా తో సహా శ్రీ రావి భాగత్‌దత్ గారికి చెందినది. **హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము & మెట్లు & కామన్ కారిడార్

ఆస్తి 13 : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా, తెనాలి ఎస్ఆర్ఓ, తెనాలి మున్సిపాలిటీ పరిధి, డి.నెం. 501/1, తెనాలి రెవిన్యూ గ్రామం వద్ద 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి నిర్మించిన "శ్రీనివాసం హిల్స్" అపార్ట్‌మెంట్ నందు స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, రెండవ, మూడవ మరియు నాల్గవ అంతస్తులు మొత్తం. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం.లు 9 & 7 కి చెందిన స్థలము - 183.6 అ॥, **దక్షిణం :** వేమూరి శేషగిరిరావు గారి స్థలము - 230 అ॥, **పడమర :** ప్లాట్ నెం. 13కి చెందిన స్థలము - 183.6 అ॥, **ఉత్తరం :** 40 అ॥ వెడల్పు గల రోడ్డు - 230 అ॥.

షెడ్యూల్-బి : పైన తెలిపిన ఎ-షెడ్యూల్ ఆస్తి 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 45.43 చ॥గ॥ల ఆస్తితో పాటు అందలి నిర్మించిన 'శ్రీనివాసం హిల్స్' (ఎ-షెడ్యూల్) నందు మూడవ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 402 (బ్లాక్ 2) కి చెందిన ప్లింత్ ఏరియా 1012 చ॥అ॥లు కామన్ ఏరియాతో కలిపి, దానికి చెందిన ఈజ్‌మెంట్ హక్కులు మరియు స్టిల్ట్ ఫ్లోర్ (ఎ-షెడ్యూల్) నందు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా తో సహా శ్రీ రావి భాగత్‌దత్తు గారికి చెందినది. **హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము & మెట్లు & కామన్ కారిడార్

ఆస్తి 14 : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా, తెనాలి ఎస్ఆర్ఓ, తెనాలి మున్సిపాలిటీ పరిధి, డి.నెం. 501/1, తెనాలి రెవిన్యూ గ్రామం వద్ద 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి నిర్మించిన "శ్రీనివాసం హిల్స్" అపార్ట్‌మెంట్ నందు స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, రెండవ, మూడవ మరియు నాల్గవ అంతస్తులు మొత్తం. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం.లు 9 & 7 కి చెందిన స్థలము - 183.6 అ॥, **దక్షిణం :** వేమూరి శేషగిరిరావు గారి స్థలము - 230 అ॥, **పడమర :** ప్లాట్ నెం. 13కి చెందిన స్థలము - 183.6 అ॥, **ఉత్తరం :** 40 అ॥ వెడల్పు గల రోడ్డు - 230 అ॥. **షెడ్యూల్-బి :** పైన తెలిపిన ఎ-షెడ్యూల్ ఆస్తి 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 45.43 చ॥గ॥ల ఆస్తితో పాటు అందలి నిర్మించిన 'శ్రీనివాసం హిల్స్' (ఎ-షెడ్యూల్) నందు నాల్గవ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 508 (బ్లాక్ 2) కి చెందిన ప్లింత్ ఏరియా 1425 చ॥అ॥లు కామన్ ఏరియాతో కలిపి, దానికి చెందిన ఈజ్‌మెంట్ హక్కులు మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా తో సహా శ్రీ రావి భాగత్‌దత్ గారికి చెందినది. **హద్దులు : తూర్పు :** కామన్ కారిడార్, **దక్షిణం :** కామన్ కారిడార్, **పడమర :** కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము

ఆస్తి 15 : షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా, తెనాలి ఎస్ఆర్ఓ, తెనాలి మున్సిపాలిటీ పరిధి, డి.నెం. 501/1, తెనాలి రెవిన్యూ గ్రామం వద్ద 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి నిర్మించిన "శ్రీనివాసం హిల్స్" అపార్ట్‌మెంట్ నందు స్టిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, రెండవ, మూడవ మరియు నాల్గవ అంతస్తులు మొత్తం. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 9 & 7 కి చెందిన స్థలము - 183.6 అ॥, **దక్షిణం :** వేమూరి శేషగిరిరావు గారి స్థలము - 230 అ॥, **పడమర :** ప్లాట్ నెం. 13కి చెందిన స్థలము - 183.6 అ॥, **ఉత్తరం :** 40 అ॥ వెడల్పు గల రోడ్డు - 230 అ॥.

షెడ్యూల్-బి : పైన తెలిపిన ఎ-షెడ్యూల్ ఆస్తి 4689.44 చ॥గ॥ల విస్తీర్ణంలో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 45.43 చ॥గ॥ల ఆస్తితో పాటు అందలి నిర్మించిన 'శ్రీనివాసం హిల్స్' (ఎ-షెడ్యూల్) నందు నాల్గవ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 512 (బ్లాక్ 2) కి చెందిన ప్లింత్ ఏరియా 1054 చ॥అ॥లు కామన్ ఏరియాతో కలిపి, దానికి చెందిన ఈజ్‌మెంట్ హక్కులు మరియు స్టిల్ట్ ఫ్లోర్ (ఎ-షెడ్యూల్) నందు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా తో సహా శ్రీ రావి భాగత్‌దత్ గారికి చెందినది. **హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** శూన్యాకాశము, మెట్లు మరియు కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము

ఆస్తి 16 : శ్రీ శౌంఠినేని వెంకటేశ్వరరావు & చింతలపూడి పూర్ణచంద్రరావు గారి పేరిట ఎపి, గుంటూరు జిల్లా, పిడుగురాళ్ళ, శ్రీ గంగా మహల్ థియేటర్, డోర్ నెం. 7-301, డి.నెం. 416/ఎ వద్ద 2072.83 చ॥గ॥ల విస్తీర్ణంలోని సెమీ అర్బన్ కమర్షియల్ భూమి మరియు బిల్డింగ్. **హద్దులు : తూర్పు :** బెల్లంకొండ రమణమ్మ మరియు ఇతరులు - 160 అ॥, **దక్షిణం :** 25 లింకుల వెడల్పు రోడ్డు - 118.8 అ॥, **పడమర :** ఇర్రి కృష్ణమూర్తి మరియు ఇతరులకు చెందిన ఇల్లులు - 158 అ॥, **ఉత్తరం :** మున్సిపల్ బజారు - 116 అ॥. కో-ఆర్డినేట్స్ : 16.480281, 79.892440. డాక్యుమెంట్ నెం. 3084/2012, తేది : 25-04-2012

ఆస్తి 18 : పిడుగురాళ్ళ - 522413, జయలక్ష్మి థియేటర్ వెనుక, రెవిన్యూ వార్డు నెం. 7, పాత అసిస్‌మెంట్ నెం. 3318, ప్రజెంట్ అసిస్‌మెంట్ నెం. 1132001847, డి.నెం. 7-213/ఎ, డి.నెం. 416/ఎ వద్ద 275.30 చ॥గ॥ల విస్తీర్ణంలోని సెమీ అర్బన్ రెసిడెన్షియల్ భూమి మరియు బిల్డింగ్. **హద్దులు : తూర్పు :** ఉడుతా ఉమామహేశ్వరరావు గారి ఆస్తి, **దక్షిణం :** ఎ. గురువుల & సిహెచ్ మల్లేశ్వరి గార్ల ఆస్తి, **పడమర :** వి వెంకట సుబ్బారావు గారి ఆస్తి, **ఉత్తరం :** బజారు, కో-ఆర్డినేట్స్ : 16.480751, 79.891842. డాక్యుమెంట్ నెం. 4536/1998, తేది : 07-11-1998, పిడుగురాళ్ళ ఎస్.ఆర్.ఓ.

ఆస్తి 19 : సిహెచ్. పూర్ణచంద్రరావు, సిహెచ్ మంగమ్మ, వై. శ్రీదేవి, జి. రాజేశ్వరి గార్ల పేరిట గుంటూరు - 522413, పిడుగురాళ్ళ, గ్యాస్ ఆఫీస్ రోడ్డు, డి.నెం. 7-294 వద్ద 428.74 చ॥గ॥లు (వాల్యూషన్ కొరకు 375.41 చ॥గ॥లు మాత్రమే పరిగణలోకి తీసుకోబడును) విస్తీర్ణంలోని స్థలము అందలి నివాస ఇల్లు అందలి గ్రౌండ్ ఫ్లోర్ & ఫస్ట్ ఫ్లోర్స్. **హద్దులు : తూర్పు :** 7 లింకుల వెడల్పు బజారు, **దక్షిణం :** రోడ్డు, **పడమర :** రావిపాటి వెంకటేశ్వర్లు గారి ఆస్తి, **ఉత్తరం :** పోట్ల పద్మావతి గారి ఆస్తి. కో-ఆర్డినేట్స్ : 16.480523, 79.893472, డాక్యుమెంట్ నెం. 1317/2007, తేది : 03-04-2007, పిడుగురాళ్ళ ఎస్.ఆర్.ఓ.

తేది : 16-11-2024 **ప్రదేశం : విజయవాడ**

చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నేడు మహారాష్ట్ర, జార్ఖండ్‌లో పోలింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్రలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు, జార్ఖండ్‌లో 38 అసెంబ్లీ స్థానాలకు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. 23న తుది ఫలితాలు వెలువడనున్నాయి. మహారాష్ట్రలో ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి, బిజెపిల మహాయుతి కూటమి అధికారంలో ఉన్నది.

కాంగ్రెస్, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి), ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలోని శివసేన (యుబిటి)ల ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమికీ మహా యుతి కూటమికీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మహాయుతి కూటమి నుంచి.. బిజెపి 149 స్థానాల్లో, శివసేన 81 సీట్లలో, అజిత్ పవార్ ఎన్‌సిపి 59 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నాయి. ఎంవిఎ కూటమి నుంచి కాంగ్రెస్ 101 స్థానాల్లో, శివసేన (యుబిటి) 95 స్థానాల్లో, ఎన్‌సిపి (ఎస్‌పి) 86 స్థానాల్లో బరిలో ఉన్నాయి. జార్ఖండ్‌లో జెఎంఎం, బిజెపి నేతృత్వంలోని కూటముల మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

సోమాలిల్యాండ్ అధ్యక్షుడుగా ప్రతిపక్ష నేత విజయం

మొగదిషు : సోమాలియా నుండి చీలిపోయిన ప్రాంతం సోమాలిల్యాండ్‌లో గత వారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్ష నేత అబ్దిరహమాన్ మహ్మద్ అబ్దుల్లా విజయం సాధించారని ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. ప్రధాన ప్రతిపక్షమైన వాదాని పార్టీకి చెందిన అబ్దుల్లాకు 50శాతానికి పైగా ఓట్లు లభించాయి. పాలక కుల్మియి పార్టీకి చెందిన అధ్యక్షుడు మూసే బిహి అబ్దికి 30శాతానికి పైగా ఓట్లు లభించాయి. 2022లోనే ఎన్నికలు జరగాల్సి వున్నా నిధుల కొరత ఇతరత్రా కారణాలతో ఈ ఎన్నిక వాయిదా పడుతూ వచ్చింది. 1991లో సోమాలియాలో చెలరేగిన అసంతృప్తులు, ఘర్షణలు, నిరసనలు చివరికి సోమాలిల్యాండ్ ఏర్పాటుకు దారి తీశాయి. అయితే అంతర్జాతీయ గుర్తింపు మాత్రం లేదు.

బ్రెజిల్ అధ్యక్షుడి హత్యకు కుట్ర !

ఐదుగురు అధికారుల అరెస్టు

శావో పోలో : 2022 ఎన్నికల తర్వాత ప్రభుత్వాన్ని కూలదోసి, అధ్యక్షుడు లూలా డసిల్వాను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు అధికారులను బ్రెజిల్ పోలీసులు అరెస్టు చేశారు. ఉపాధ్యక్షుడు గెరాల్డో అల్కుమిన్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డి మొరేస్‌లను కూడా హతమార్చాలని వారు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అరెస్టయిన ఐదుగురిలో నలుగురు మిలటరీ అధికారులు కాగా, ఒకరు పోలీసు అధికారి. ఇందుకోసం ఐదు అరెస్టు వారంట్లను జారీ చేశామని, మూడు సెర్చ్ వారంట్లను కూడా జారీ చేశామని పోలీసులు తెలిపారు. అనుమానితుల పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకోవడం, వారు ఇతరులతో మాట్లాడకుండా కట్టుదిట్టం చేయడం వంటి చర్యలు కూడా తీసుకున్నారని బ్రెజిల్ మీడియా తెలిపింది. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పనిచేయనివ్వకుండా అడ్డగించడం, ప్రజాస్వామ్య ప్రక్రియకు విఘాతం కలిగించడం, బ్రెజిల్ న్యాయ వ్యవస్థ అథారిటీని దెబ్బతీయడం ఈ కుట్ర లక్ష్యమని అధికారులు చెప్పారు. 2022 ఎన్నికల తర్వాత తాను అధికారంలో వుండేలా మాజీ అధ్యక్షుడు జేర్ బోల్సనారో తమకు ఒక ప్రణాళిక అందచేశారని ఇద్దరు బ్రెజిల్ మిలటరీ నేతలు పోలీసులకు తెలిపారు.

మణిపూర్‌లో హింసపై
జోక్యం చేసుకోండి

మోహరించిన ప్రత్యేక బలగాలు

- రాష్ట్రపతికి ఖర్గే లేఖ
- సాక్ష్యాధారాలు సేకరిస్తున్న విచారణ కమిషన్

ఇంఫాల్ : రోజు రోజుకు దిగజారుతున్న మణిపూర్ విషయంలో జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కోరారు. హింసాకాండను నిరోధించడంలో విఫలమైన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై అక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోయారని ఖర్గే పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రపతికి ఖర్గే లేఖ రాసారు. మణిపూర్ పర్యటనకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎందుకు తిరస్కరిస్తున్నారో దేశంలో ఎవరికీ అర్థం కావడం లేదని విమర్శించారు. రాష్ట్రపతి ప్రమేయం ద్వారా మణిపూర్‌లో శాంతిభద్రతలు పునరుద్ధరించబడతాయనే విశ్వాసాన్ని ఖర్గే తన లేఖలో వ్యక్తం చేశారు.

సాక్ష్యాధారాలు సేకరిస్తున్న విచారణ కమిషన్

మణిపూర్‌లో ఏడాదికి పైగా కొనసాగుతున్న హింసాకాండపై దర్యాప్తు కోసం నియమించిన ముగ్గురు సభ్యుల విచారణ కమిషన్ (సిఓఐ) రంగంలోకి దిగింది. సాక్ష్యాధారాలను సేకరించే పనిని ప్రారంభించిందని ఇందుకు సంబంధించిన ఒక అధికారి తెలిపారు. ఈ కమిషన్‌ను గత ఏడాది జూన్ 3న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. హింసాకాండను సమగ్రంగా పరిశోధించడానికి బహిరంగ విచారణలను కూడా ఈ కమిషన్ నిర్వహించే అవకాశం ఉంది. ఈ అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. 'విచారణకు హాజరయ్యే వ్యక్తుల భద్రత, రక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది' అని సదరు అధికారి తెలిపారు. కేంద్ర హోం శాఖ సెప్టెంబరు 13న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ కమిషన్ తన నివేదికను వీలైనంత త్వరగా కేంద్రానికి సమర్పించాలి. గౌహతి హైకోర్టు మాజీ సిజె అజయ్ లాంబా నేతృత్వంలోని ఈ కమిషన్‌కు ఇప్పటి వరకూ పెన్‌డ్రైవ్‌లు, ఫోటోలు, ఇతర డాక్యుమెంట్లతో దాదాపు 11,000 కుపైగా అఫిడవిట్లు అందాయని అధికారి తెలిపారు. ఈ కమిషన్ రాష్ట్రంలో అన్ని జిల్లాల కమిషనర్లు, ఎస్‌పిలు, ఆర్మీ ఇన్‌ఛార్జీలకు, ఇతర ఆఫీసులకు కొన్ని ప్రశ్నలతో నోటీసులు పంపింది.

11 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు

మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ సోమవారం రాత్రి అధికార ఎన్‌డిఎ ఎమ్మెల్యేలతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశానికి హాజరు కాని 11 మంది ఎమ్మెల్యేలకు సిఎం సెక్రటేరియట్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ సమావేశానికి రాని ఎన్‌పిపికి చెందిన ఎమ్మెల్యే షేక్ నూరుల్ హసన్ (క్షేత్రీగావ్ నియోజకవర్గం)కు కూడా నోటీసులు జారీ చేశారు. బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి ఎన్‌పిపి ఆదివారం మద్దతు ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. మద్దతు ఉపసంహరించుకున్నా ఈ సమావేశానికి హాజరైనందుకు తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు ఎన్‌పిపి నోటీసులు జారీ చేసింది. ఎన్‌పిపికి మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.

బీరేన్ సింగ్ రాజీనామా చేయాలి : ఇరోమ్ షర్మిల

మణిపూర్‌లో హింసాకాండకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ రాజీనామా చేయాలని హక్కుల కార్యకర్త, ఉక్కు మహిళ ఇరోమ్ షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రధాని మోడీ ప్రత్యక్ష జోక్యం చేసుకోవాలని కోరారు. మంగళవారం ఆమె జాతీయ మీడియాకు ఫోన్‌లో ఇంటర్వ్యూ ఇచ్చారు. అమానుషమైన భద్రతాదళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) చట్టం అమలుతో రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రధాని మోడీ మణిపూర్ తప్ప దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ పర్యటిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో హింసాకాండ ప్రారంభమై 18 నెలలైనా ప్రధాని ఇప్పటివరకు సందర్శించలేదని అన్నారు.

24న అఖిలపక్ష సమావేశం

- 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందు ప్రభుత్వం ఈ నెల 24న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మంగళవారం ఎక్స్‌లో ఈ విషయాన్ని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 25న ప్రారంభమై డిసెంబర్ 20న ముగుస్తాయి. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సంవిధాన్ సదన్ (రాజ్యాంగ దినోత్సవం) సెంట్రల్ హాల్‌లో లేదా పాత పార్లమెంట్ భవనంలో ఓ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రభుత్వం తన ఎజెండాను ప్రతిపక్షాలకు తెలియజేయడానికి, ఆయా పార్టీలు చర్చించాలనుకుంటున్న అంశాలపై మాట్లాడటానికి పార్లమెంట్ సమావేశాలకు ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఆనవాయితీగా ఏర్పాటు చేస్తోంది.

పార్లమెంటు ముందుకు రానున్న వక్ఫ్ సవరణ బిల్లు

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పలు కీలక అంశాలపై లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు చర్చించనున్నారు. వక్ఫ్ సవరణ బిల్లుపై జెపిసి నివేదిక పార్లమెంట్ ముందుకు రానుంది. అనంతరం బిల్లును సభలో ప్రవేశపెడతారు. జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లు కూడా తీసుకురావడానికి ప్రభుత్వం యోచిస్తోంది.

రష్యాపై దాడి చేస్తే అణు దాడి తప్పదు!

- అమెరికా, నాటో మిత్రపక్షాలకు హెచ్చరిక
- అణు దాడి నిబంధనలను సరళతరం చేసిన పుతిన్
- కీలక పత్రాలపై సంతకాలు

మాస్కో : అణ్వాయుధాల వినియోగానికి సంబంధించిన నిబంధనలను సరళతరం చేసే పత్రాలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంతకాలు చేశారు. అణ్వాయుధ దేశం మద్దతుతో ఏ దేశమైన రష్యాపై దాడి చేసినట్లైతే ఆ దాడిని సంయుక్త దాడిగానే పరిగణిస్తామని పుతిన్ హెచ్చరించారు. రష్యాపై పెద్దఎత్తున వైమానిక దాడికి దిగినట్లైతే వెంటనే తాము అణ్వాయుధాలను వినియోగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కొత్త అణు విధానాన్ని ప్రకటించారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి వెయ్యి రోజులు పూర్తయిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. పైగా అమెరికా సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులతో రష్యాలోని లక్ష్యాలపై దాడి చేసేందుకు ఉక్రెయిన్‌ను అనుమతిస్తూ బైడెన్ నిర్ణయం తీసుకున్న వెంటనే పుతిన్ ఈ చర్యలు చేపట్టారు. రష్యాపై దాడికి దిగే సాహసం చేయకుండా పశ్చిమ దేశాలను వెనక్కి మళ్లించేందుకు అవసరమైతే అణ్వాయుధాలను ఉపయోగించేందుకు సంసిద్ధంగా వున్నట్లు పుతిన్ ప్రకటించారు. బైడెన్ నిర్ణయానికి, రష్యా చర్యకు మధ్య సంబంధం గురించి మీడియా ప్రశ్నించగా, సవరించిన అణు విధానాన్ని సకాలంలో ప్రకటించామని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆ పత్రాన్ని సవరించాలని ఈ ఏడాది ప్రారంభంలోనే పుతిన్, అధికార యంత్రాంగాన్ని ఆదేశించారని చెప్పారు. ప్రతిపాదిత అణు సిద్ధాంతంలో మార్పుల గురించి పుతిన్ తొలుత సెప్టెంబరులో ప్రకటించారు. పశ్చిమ దేశాలు సరఫరా చేసిన ఆయుధాలతో ఉక్రెయిన్ యుద్ధానికి దిగితే రష్యాపై నాటో యుద్ధం చేసినట్లే పరిగణిస్తామని పుతిన్ ఇంతకుముందే అమెరికా, నాటో మిత్రపక్షాలను హెచ్చరించారు. అణు దాడి లేదా సాంప్రదాయ ఆయుధాలతో దాడి వీటిల్లో ఏ దాడికి దిగినా రష్యా అణ్వాయుధాలను ఉపయోగించగలదని సవరించిన ఆ పత్రం పేర్కొంటోంది. బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, విమానాలు, డ్రోన్‌లు, ఇతర ఎగిరే ఏ వాహనాలతోనైనా పెద్ద ఎత్తున దాడి చేసినా ఈ నిబంధనలు వినియోగంలోకి వస్తాయని స్పష్టం చేసింది.

45రోజులుగా దిగ్బంధంలో ఉత్తర గాజా

- నలిగిపోతున్న ప్రజలు
- గత 24గంటల్లో బీరుట్‌లో ఏడుగురు, గాజాలో 50మంది మృతి

గాజా, బీరుట్ : వరుసగా 45వ రోజున కూడా ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ మిలటరీ నరమేధం కొనసాగుతోంది. జాబాలియా, బెయిట్ లాహియా, గాజా నగరంపై భారీగా దాడులు జరుగుతున్నాయి. ఒకవైపు దాడులు, మరోవైపు ఆహారం, నీరు, ఇంధన కొరతలతో ప్రజలు నలిగిపోతున్నారు. గత 24గంటల్లో ఈ దాడుల్లో 50మంది పాలస్తీనియన్లు మరణించారు. నుస్రత్ శరణార్థ శిబిరం సమీపంలో ఒక ఇంటిపై జరిగిన దాడిలో అభం శుభం తెలియని చిన్నారి మరణించాడు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే లెబనాన్‌లో దాడుల్లో 200మంది చిన్నారులు మరణించారని, 1100మంది గాయపడ్డారని యునిసెఫ్ వెల్లడించింది. మొత్తంగా గాజాలో 17,500మంది పసిబిడ్డలు చనిపోయారని తెలిపింది. గాజాలో మానవతా సాయం అందించేందుకు వస్తున్న వాహనాలపై దాడి జరిగిందని, ఆహార ధాన్యాలు లూటీ అయ్యాయని ఐక్యరాజ్య సమితి సంస్థ తెలిపింది. గాజాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల కేసులు పెరిగాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆస్పత్రిలో డాక్టర్లు, మందులు లేకపోవడంతో గాయపడిన వారు కూడా పెద్ద సంఖ్యలో మరణిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

మరోవైపు బీరుట్‌లో మంగళవారం తెల్లవారు జామున జరిగిన కాల్పుల్లో ఇద్దరు మరణించారు. గత రాత్రి జరిగిన దాడిలో ఐదుగురు చనిపోయారు. కాల్పుల విరమణపై చర్చలు జరుగుతున్నాయని మధ్య ప్రాచ్యంలో అమెరికా రాయబారి ఆమోస్ హెచెస్టిన్ తెలిపారు. ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో లెబనాన్ సాంస్కృతిక ప్రదేశాలకు ముప్పు పొంచి వుందని యునెస్కో ఆందోళన వ్యక్తం చేసింది. టెల్ అవీవ్ సమీపంలో ఇజ్రాయిల్ వైమానిక స్థావరం లక్ష్యంగా క్షిపణులతో దాడి చేసినట్లు హిజ్బుల్లా ప్రకటించింది. లెబనాన్ ఆరోగ్య వ్యవస్థపై ఇజ్రాయిల్ దాడులను ముమ్మరం చేసింది. ఈ దాడులతో ఇప్పటివరకు 8 ఆస్పత్రులు, 58 ఆరోగ్య సంరక్షణా కేంద్రాలు మూత పడ్డాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

వాతావరణ నిధి, ఉక్రెయిన్‌పై రాని ఏకాభిప్రాయం

- గాజా, లెబనాన్‌ల్లో సమగ్ర కాల్పుల విరమణ
- జి 20 పిలుపు

రియో డీజెనీరో : రియో సదస్సులో వాతావరణ మార్పులపై జరిగిన చర్చల్లో జి 20 నేతలు ఏకాభిప్రాయానికి రావడంలో విఫలమయ్యారు. ఉక్రెయిన్‌పై యుద్ధం విషయంలోకూడా ఈ విభేదాలు తీవ్రంగా ప్రస్ఫుటమయ్యాయి. అజర్‌బైజాన్ రాజధాని బాకూలో జరుగుతున్న కాప్ 29 చర్చల్లో ప్రతిష్టంభన నెలకొందని, దాన్ని పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాల్సిందిగా ఐక్యరాజ్య సమితి సంపన్న దేశాల నేతలకు విజ్ఞప్తి చేసింది. జి 20 సదస్సుకు ముందుగానే యుఎన్ క్లైమేట్ చీఫ్ ఈ మేరకు ఒక ప్రకటన చేసినా ఫలితం లేకపోయింది. ఎవరు చెల్లించాలనే విషయమై జి 20 సభ్యులు చీలిపోయారు. ఎలాంటి హామీలివ్వడానికి తిరస్కరించారు. అన్ని మార్గాలు, వనరుల నుండి లక్షలాది డాలర్లు రావాల్సిన అవసరం వుందని మాత్రమే చెప్పారు.

కాల్పుల విరమణకు పిలుపు

గాజా, లెబనాన్‌ల్లో సమగ్ర కాల్పుల విరమణలు జరగాలని జి 20 పిలుపునిచ్చింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. అధిక సంపన్నులు, శతకోటీశ్వరులపై సమర్ధవంతమైన రీతిలో పన్నులు విధించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చేందుకు పరస్పరం సహకరించుకోవాలని నేతలు ప్రతిన చేశారు. పన్ను అధికారుల నుండి తప్పించుకోకుండా నివారించేలా యంత్రాంగాలను కూడా రూపొందించాలని పేర్కొన్నారు.

యుద్ధాలతో పేద దేశాల ఇబ్బందులు : మోడీ

అంతర్జాతీయంగా సాగుతున్న ఘర్షణలు, యుద్ధాల కారణంగా ఆహారం, ఇంధనం, ఎరువుల సంక్షోభాలతో ప్రపంచంలోని పేద దేశాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. జి20 సదస్సులో భాగంగా తొలి రోజున 'ఆకలి, దారిద్ర్యంపై పోరాటం'పై జరిగిన సమావేశంలో మోడీ ప్రసంగిస్తూ పేద దేశాల ఆందోళనలు, ప్రాధాన్యతల పరిష్కారానికి జి 20 కచ్చితంగా పెద్ద పీట వేయాలని కోరారు. అప్పుడు మాత్రమే మన చర్చలు విజయవంతమవుతాయని అన్నారు. ఈ దిశగా చేపట్టే చొరవలకు భారత్ పూర్తి తోడ్పాటునందిస్తుందని చెప్పారు. ఆఫ్రికా, ఇతర ప్రాంతాల్లో ఆహార భద్రత కోసం భారత్ తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా మోడీ వివరించారు. ఆహార భద్రతే కాకుండా పోషకాహారంపై కూడా దృష్టి పెట్టామన్నారు. వివిధ దేశాలకు ఆహార ధాన్యాలు పంపుతున్నామన్నారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. ప్రజానుకూల నిర్ణయాలతో ముందుకు వెళుతున్న బ్రెజిల్ అధ్యక్షుడిని అభినందించారు. అంతకుముందు సదస్సును ప్రారంభిస్తూ బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా ప్రసంగించారు.

పలు దేశాల నేతలతో మోడీ ద్వైపాక్షిక భేటీలు

- పలు అంశాలపై చైనా, భారత విదేశాంగ మంత్రుల చర్చ

రియో డీజెనీరో : ఇక్కడ జరుగుతున్న జి 20 సదస్సు నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ ఇటలీ, ఇండోనేషియా, నార్వే, పోర్చుగల్, ఈజిప్ట్, దక్షిణ కొరియా సహా పలు దేశాల నేతలతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు చేపట్టాల్సిన చర్యలు, మార్గాలపై చర్చించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్, యురోపియన్ యూనియన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌లతో కూడా మోడీ భేటీ అయ్యారు. నైజీరియాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం ఇక్కడకు వచ్చిన మోడీ సోమవారం ఇటలీ ప్రధాని మెలోనితో సమావేశమై రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో ఇరు దేశాల మధ్య బంధాన్ని పటిష్టపరుచుకునేందుకు గల మార్గాలపై చర్చించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాల కోసం కూడా ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరువురు నేతలు ఆకాంక్షించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబౌ సుబియాంటో, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌లతో కూడా మోడీ సమావేశమయ్యారు. రోదసీ, ఇంధన రంగాల్లో కలిసి పని చేయడంపై మాక్రాన్‌తో చర్చించారు. భారత్-ఇండోనేషియా దౌత్య సంబంధాలకు 75ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ సంబంధాలను మరింత పటిష్టపరుచుకునేందుకు కృషి చేయాలని ఇరువురు నేతలు అభిలషించారు.

చైనా, భారత విదేశాంగ మంత్రుల భేటీ

జి 20 సదస్సులో భాగంగా చైనా, భారత విదేశాంగ మంత్రులు భేటీ అయ్యారు. కేంద్రమంత్రి జైశంకర్, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యితో సమావేశమయ్యారు. అనంతరం జైశంకర్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. జి 20 సదస్సులో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో సమావేశమై పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. భారత్, చైనా సరిహద్దు ప్రాంతాల్లో బలగాల ఉపసంహరణ విషయంలో పురోగతి చోటు చేసుకుందని పేర్కొన్నారు. ఇతర ప్రపంచ దేశాల పరిస్థితులపై కూడా చర్చలు జరిపామని జైశంకర్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు.

సమావేశమైన భారత, చైనా విదేశాంగ మంత్రులు జైశంకర్, వాంగ్ యి తదితరులు

'వాతావరణ న్యాయం' సూత్ర పరిధిలోనే పరిష్కారం

- కాప్ 29 చర్చల్లో భారత్ డిమాండ్
- సంపన్న దేశాలు ముందుకొచ్చి పేద దేశాల ఇబ్బందులను తగ్గించాలని సూచన

బాకూ : పేద, వర్ధమాన దేశాల్లో వాతావరణ మార్పులపై చేపట్టే కార్యాచరణకు మద్దతునిచ్చే కొత్త వాతావరణ నిధి ఏర్పాటనేది 'వాతావరణ న్యాయం' అనే సూత్రం పరిధిలోనే ఉండాలని భారత్ పేర్కొంది. పేద దేశాల ఇబ్బందులను తగ్గించే విషయంలో సంపన్న దేశాలు నాయకత్వ పాత్రను చేపట్టాలని డిమాండ్ చేసింది. వర్ధమాన దేశాలకూ తగిన కార్బన్ వాటాను ఇవ్వాలని కోరింది. ఈ మేరకు బాకూలో జరుగుతున్న కాప్ 29 చర్చల్లో భారత్ వైఖరిని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్పష్టం చేశారు. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు ఏకపక్షంగా తీసుకునే నియంత్రిత వాణిజ్య చర్యలు వర్ధమాన దేశాల్లో వాతావరణ కార్యాచరణకు అవరోధం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆర్థిక నిధి (ఎన్‌సిక్యూజి)ని వాతావరణ న్యాయం సిద్ధాంతం ప్రాతిపదికనే ఉండాలని ఆయన అన్నారు. పేద దేశాల్లో వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు హరిత సాంకేతికతలు, నిధులు ఉచితంగా అందించాలని మంత్రి పేర్కొన్నారు. కొన్ని సంపన్న దేశాలు ఏకపక్షంగా చర్యలు తీసుకుంటూ వాతావరణ కార్యాచరణను మరింత క్లిష్టతరం చేస్తున్నాయని విమర్శించారు. పేద, వర్ధమాన దేశాలకు సాంకేతికతలు, నిధులు అందించే విషయంలో ఎలాంటి అడ్డంకులు, అవరోధాలు వుండరాదని స్పష్టం చేశారు. గ్లోబల్ వార్మింగ్ 1.5 డిగ్రీల సెల్సియస్ కన్నా పెంచరాదని గగ్గోలు పెట్టినా ప్రస్తుతం ప్రపంచం దాన్ని అధిగమిస్తోందని అన్నారు.

అనిల్ దేశ్‌ముఖ్‌పై రాళ్లదాడి

- నిందితులపై హత్యాయత్నం కేసు

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ మంత్రి, నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి-ఎస్‌పి) నేత అనిల్ దేశ్‌ముఖ్ కారుపై నాగ్‌పూర్ జిల్లాలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. దీంతో, ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసులో నిందితులపై హత్యాయత్నం కేసు నమోదుచేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. నార్ఖేడ్ గ్రామంలో సభ ముగించుకుని తిరిగి కటోల్‌కు వస్తుండగా ఈ ఘటన జరిగింది. కారు ముందుసీటులో కూర్చున్న అనిల్ తలకు తీవ్రగాయమై, రక్తం కారుతున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరలయ్యాయి. ప్రస్తుతం ఆయన నాగపూర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి నేపథ్యంలో కటోల్‌లో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

వీలైన చోట వర్చువల్ విచారణ చేపట్టండి

- చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా

న్యూఢిల్లీ: వీలైన చోట వర్చువల్ పద్ధతిలో వాదనలు చేపట్టాలని న్యాయమూర్తులకు ఆదేశాలు ఇచ్చినట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తెలిపారు. కోర్టులన్నీ వర్చువల్ విధానంలో నడిచేటట్టుగా సూచనలు చేయాలని కొందరు సీనియర్ న్యాయవాదులు సిజెఐను కోరారు. ఆ అభ్యర్థనలను సుప్రీం చీఫ్ జస్టిస్ తిరస్కరించారు. కోర్టులన్నీ హైబ్రిడ్ మోడల్‌లోనే పనిచేస్తాయని, అయితే వాళ్లు కావాలనుకుంటే వర్చువల్ విచారణను ఎంపిక చేసుకోవచ్చు అని సంజీవ్ ఖన్నా తెలిపారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ ఆ అభ్యర్థన చేశారు.

484కు చేరిన ఎక్యుఐ

మంగళవారం ఉదయం 8.00 గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యతా ప్రమాణం (ఎక్యూఐ) రికార్డుస్థాయిలో 484కి చేరింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక రికార్డు. రాజధాని పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ 500 మార్కును దాటింది.

జీశాట్-20 ప్రయోగం సక్సెస్

వాషింగ్టన్ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో రూపొందించిన అత్యంత అధునాతన సమాచార ఉపగ్రహం జీశాట్-20 ప్రయోగం సక్సెస్ అయ్యింది. స్పేస్‌ఎక్స్ కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ఈ జీశాట్-20ను నింగిలోకి విజయవంతంగా మోసుకెళ్లింది. అమెరికాలోని ఫ్లోరిడా కేప్ కెనావెరల్ వేదికగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో వాణిజ్య విభాగం న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ చైర్మన్, ఎమ్‌డి రాధాకృష్ణన్ దురయ్‌రాజ్ తెలిపారు.

ముంచుకొస్తున్న ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

జిఒ 98 ప్రకారం ఎపిఐఐసి మినహాయింపు పొందింది. నక్కపల్లి మండలం రాజయ్యపేట సమీపంలో హెటిరో డ్రగ్స్, పాయకరావుపేట మండలం కేశవరం వద్ద డెక్కన్ కెమికల్స్ పరిశ్రమలు సముద్రంలో విడిచిపెడుతున్న వ్యర్థ రసాయనాలతో జీవనోపాధి పోయిందని మత్స్యకారులు ఆందోళన చెందుతుండగా, ఇప్పుడు నక్కపల్లి ప్రాంతంలో 2001 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్కు వస్తుందని తెలియడంతో వారి నెత్తిన పిడుగుపడినట్లయ్యింది. వ్యర్థ కాలుష్యంతో మత్స్యకారుల బతుకులు దెబ్బతిన్నాయి. వాయు కాలుష్యంతో ఆ పరిశ్రమల పరిసర ప్రజలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటైతే ఆ ప్రాంత ప్రజల జీవన పరిస్థితులు మరింత దిగజారనున్నాయి. అనారోగ్యం పాలుకానున్నారు. పర్యావరణ సమస్యలు తలెత్తనున్నాయి. తన నియోజకవర్గ పరిధిలోని నక్కపల్లిలో ఏర్పాటవుతున్న బల్క్ డ్రగ్ పార్కును హోమ్ మంత్రి వంగలపూడి అనిత అడ్డుకుంటారో, మౌనం దాల్చుతారో వేచిచూడాలి.

బల్క్‌డ్రగ్ పార్కు పరిధిలోని గ్రామాలు - విస్తీర్ణం(ఎకరాల్లో)

వేంపాడు	228.47
బుచ్చిరాజుపేట	117.67
రాజయ్యపేట	650.96
చందనాడ	367.11
డిఎల్ పురం	637.64

ట్రూ అప్ ఉపసంహరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

కర్నాటక, తమిళనాడు, తెలంగాణా, ఒరిస్సా, మహారాష్ట్ర, చత్తీస్‌ఘర్ అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపితో పొత్తు పెట్టుకున్న వారు సర్వనాశనం అయ్యారని, ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం కూడా మోడీ బాటలోనే నడుస్తోందని అన్నారు. గతంలో షిర్డిసాయి కంపెనీకి జగన్ బినామీ అన్న టిడిపి నాయకులు ఇప్పుడు అదే కంపెనీకి స్మార్ట్ మీటర్లు బిగించే కాంట్రాక్టు ఎలా ఇస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అలాగే ప్రశాంతంగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో మత కల్లోలాలు సృష్టించేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయని, వాటికంటే ఎక్కువగా పవన్ కల్యాణ్ ఈ వ్యవహారాన్ని నెత్తిన ఎత్తుకున్నారని చెప్పారు. మోడీ మానవతావాది అని పవన్ కల్యాణ్ అనడాన్ని తప్పుబట్టారు. ఎపిని మరో మణిపూర్ చేయాలని కుట్ర చేస్తున్నారన్న ఆందోళనను వ్యక్తం చేశారు. బిజెపి విధానాలను వదిలి ప్రజల కోసం జరిగే పోరాటాల్లో అంతా కలిసి రావాలని శ్రీనివాసరావు సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు ప్రధాని మోడీకి లొంగిపోయి ఆదానీతో లాలూచీపడి ప్రజలపై భారం వేస్తున్నారని అన్నారు. ఇప్పటికే రూ.6,072 కోట్లు వసూలు చేసేందుకు ఛార్జీలు పెంచారని, మరో రూ.11,820 కోట్ల భారం మోపేందుకు ప్రతిపాదన పెట్టారని తెలిపారు. దీనిపై వామపక్షాలు, వాణిజ్య, వ్యాపార సంఘాలు అభ్యంతరం తెలిపాయని అన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ భారాలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే కొనసాగిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ విధానాలు శాపంగా మారాయని ప్రస్తుత ప్రభుత్వం చెబుతూనే అదే విధానాలను కొనసాగిస్తోందని ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని తెలిపారు. దీనివల్ల ప్రజలు నష్టపోతున్నారని మండిపడ్డారు . సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు పి.ప్రసాదు మాట్లాడుతూ కేంద్రం నుండి రావాల్సిన నిధులు అడగకుండా ప్రత్యేక హోదా లాంటి విషయాలు ప్రస్తావించకుండా ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమని అన్నారు. ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం మాట్లాడుతూ గతంలో విద్యుత్ ఛార్జీలు పెంచితేనే బషీర్‌బాగ్ ఉద్యమం జరిగిందని, ఈ విషయాన్ని చంద్రబాబు గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఎస్‌యుసిఐసి రాష్ట్ర కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ గతంలో విద్యుత్ సంస్థను చంద్రబాబు ముక్కలు చేశారని, ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై పెనుభారాలు వేస్తున్నారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు మాట్లాడారు. ఈ ధర్నాకు సిపిఎం జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, డి.రమాదేవి, సిపిఐ రాష్ట్ర నాయకులు ఓబులేసు, వెంకటసుబ్బయ్య, నగర నాయకులు లంకా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మీకోసం

రెండు స్పూన్ల నిమ్మ ఉప్పు, అదే కొలతతో సాధారణ ఉప్పు, కొంచెం వేడినీళ్లు, కాస్తంత డిటర్జెంట్ వాటర్‌తో ద్రావణం తయారుచేసుకుని ఇత్తడి, రాగి పాత్రలు తోమితే తళతళ మెరిసిపోతాయి.

జీవన సౌరభం

మార్చలేని గతాన్ని గురించి ఆలోచించకుండా, చేతిలో ఉన్న భవిష్యత్తుకై శ్రమించు.

JEEVANA జీవన the family

కష్టం విలువ

కొమరబండ అనే ఊరిలో కొమరయ్య అనే రైతు ఉన్నాడు. ఒకసారి పిల్లలు ముంజకాయలు కావాలని మారాం చేయడంతో పక్కనే ఉన్న అంగడికి బయలుదేరాడు. అంగడికి వెళ్లిన కొమరయ్య.. ముంజలు అమ్మే వ్యక్తి వద్దకు వెళ్లి, 'ముంజలు ఎంతకు ఇస్తావు?' అని అడిగాడు. 'ముప్పై రూపాయలకు అర డజను ఇస్తాను' అని సమాధానం ఇచ్చాడు ఆ వ్యక్తి. 'వామ్మో.. అంత రేటా! ముప్పై రూపాయలకు డజను ఇవ్వచ్చు కదా?' అని అడిగాడు కొమరయ్య. 'మీకు డజను కావాలంటే ఇంకా ముందుకు వెళ్ళండి దొరుకుతాయి' అని చెప్పాడు ముంజలు అమ్మే వ్యక్తి.

కొమరయ్య ఇంకొంచెం ముందుకు నడుచుకుంటూ వెళ్లాడు. అక్కడ ముంజలు కనిపించాయి. అక్కడికి వెళ్లి ముంజలు కావాలని అడిగాడు. 'ముప్పై రూపాయలకు తొమ్మిది ముంజలు ఇస్తాను' అన్నాడు ముంజలమ్మే వ్యక్తి. 'ఇంకో మూడు ముంజలు కలుపుకొని డజను ఇవ్వచ్చు కదా?' అని అతనితో బేరం ఆడాడు కొమరయ్య. 'నాకు బేరం గిట్టదు. మీకసలు డబ్బులు ఖర్చే అవ్వకుండా ఉండాలంటే అదిగో ఆ తాటిచెట్ల తోపు దగ్గరకి వెళ్లి కావాల్సినన్ని తాటికాయలు కోసుకోండి' అని తన దగ్గర ఉన్న తాటి గెలలు నరికే కత్తి ఇచ్చాడు రైతు.

'ఇదేదో బాగుందే!' అని మనసులోనే అనుకున్న కొమరయ్య ముందువెనుకా చూడకుండా అతి కష్టం మీద తాటిచెట్టు ఎక్కేశాడు. తాటి గెల కోసి కింద వేశాడు. ఇక ఇప్పుడు కిందకి దిగాలి. అయితే ఎలా దిగాలో అర్థం కాలేదు. ఎంత ప్రయత్నించినా చెట్టు నుంచి దిగడం సాధ్యం కాలేదు. చేతులు పట్టు తప్పుతున్నాయి. ఒళ్ళంతా చెమటలతో తడిసిపోయింది. కింద పడిపోతా నేమో భయం వేసి, 'నన్ను కాపాడండి... రక్షించండి' అని గట్టిగా కేకలు వేయడం మొదలుపెట్టాడు. సంతకు వెళ్లేవారు ఆ కేకలు విని ఎలాగోలాగా కాపాడి చెట్టు పైనుండి కిందకి దించారు. కష్టం విలువ తెలుసుకున్న కొమరయ్య ఆ రోజు నుండి రైతులతో ఎప్పుడూ బేరసారాలు ఆడలేదు.

– బుద్ధారపు ప్రవళిక,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్, కోదాడ,
సూర్యాపేట, తెలంగాణ.

రంగుల పేర్లేమిటి?

పిల్లలూ, కింద గళ్లలో ఇచ్చిన ఆంగ్ల అక్షరాల ఆధారంగా ఇక్కడ కనిపిస్తున్న రంగుల పేర్లు రాయండి.



నేను గీసిన బొమ్మ

గోళ్ళమూడి కృష్ణ సహస్ర
6వ తరగతి,
ఎట్కిన్‌సన్ సీనియర్ సెకండరీ స్కూల్,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

... ఆ కాల్స్‌తో జాగ్రత్త!

చేతిలో సెల్‌ఫోన్ ఎంత సదుపాయమో అంత ప్రమాదకరం కూడా! కొన్ని సైట్లు, వాట్సాపులో వచ్చే కొన్ని లింకులను ఓపెన్ చేస్తే కోరి కష్టాలు తెచ్చుకున్నట్లే. కొందరు సైబర్ క్రిమినల్స్ పంపే సైట్లలోని లింకులతో బహుపరాక్. ఇటీవల కాలంలో ఫోన్ ద్వారా ట్యాపింగ్‌కు గురై మోసపోతున్న వారే ఎక్కువ. తెలియని లింకులను ఓపెన్‌చేస్తే బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము ఖాళీ అవుతుంది. ఒక్కోసారి ఆకస్మికంగా వచ్చే న్యూడ్ వీడియో ఫోన్స్‌కాల్స్‌తో పెను ప్రమాదం పొంచివుంది. వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలి.

సైబర్ నేరముఠాలు కొన్ని ఒక పథకం ప్రకారం కొందరిని టార్గెట్‌గా చేసుకొని, మోసానికి తెగిస్తున్నాయి. దీనిలో భాగంగా రాత్రివేళల్లో గుర్తుతెలియని అమ్మాయిల నుంచి వీడియో కాల్స్ వస్తుంటాయి. అదేంటో చూద్దామని కాల్‌లిఫ్ట్ చేస్తే ఈ పన్నాగంలో ఇరుక్కున్నట్టే! కాల్‌చేసిన అమ్మాయి తీయగా మాట్లాడుతూ, మీ నుంచి స్నేహాన్ని ఆశిస్తున్నట్టు చెబుతుంది. నెమ్మదిగా మాటల్లో దించి, చనువుగా ప్రవర్తిస్తుంది. ఇటు నుంచి ఆ విధంగా ప్రవర్తించేలా చూసి. ఆ మొత్తం వీడియో కాల్‌ని రికార్డు చేస్తారు. ఆమెతో న్యూడ్ వీడియో చేసినట్టు వీడియో క్రియేట్ చేస్తారు. దాన్ని మాట్లాడిన వ్యక్తికి వెంటనే పంపించేస్తారు. ఇంతలోనే ఆ వీడియో పంపిన మహిళ నుంచి మెసేజ్ కూడా వస్తుంది. వెంటనే డబ్బులు కావాలనే డిమాండ్లు వరుసగా వస్తుంటాయి. లేదంటే ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లో ఆ వీడియో షేర్ చేస్తామంటూ బెదిరిస్తారు. ఫ్రెండ్స్‌కు కూడా పంపుతామంటారు. అలా పంపకుండా ఉండాలి అంటే డబ్బు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేస్తారు. కొందరు వెంటనే వాళ్లకు డబ్బు పంపించి ఆ సమస్య నుంచి బయటపడాలని ప్రయత్నం చేస్తారు. ఇంకొందరు ఏమి చేయాలో అర్థంకాక కుమిలిపోతుంటే మరో నంబరు నుంచి కాల్ వస్తుంది. తాము సిబిఐ అధికారులమనీ, మీ వీడియో యూట్యూబ్‌లో వచ్చిందని, వెంటనే డబ్బులు ఇచ్చి డిలీట్ చేయించుకోవాలని బెదిరిస్తారు. ఇదంతా ఒక విష వలయంలా సాగుతూ ఉంటుంది. దీని గురించి ఎవరికీ చెప్పుకోలేక, సమస్య నుంచి బయటపడలేక సతమతం అవుతారు. వారి వేధింపులు తట్టుకోలేక కొందరు డబ్బులు ముట్టజెబుతుంటారు. మరీ తీవ్రత ఎక్కువైతే అప్పుడు సైబర్ పోలీసులను ఆశ్రయిస్తుంటారు.

మహిళలే టార్గెట్‌గా...

కొందరు నేరగాళ్లు అమ్మాయిలను టార్గెట్‌గా రెచ్చిపోతున్నారు. ఫొటోలు మార్ఫ్‌చేసి..బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌సైట్లలో అప్‌లోడ్ చేస్తామంటూ వేలు, రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. సైబర్ నేరస్తులు కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తూ మహిళలను బెదిరిస్తున్నారు. ఈ తరహా కేసులు ఇటీవల కాలంలో బాగా పెరిగాయి.



ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో కొందరు అమ్మాయిలను, మహిళలను పరిచయం చేసుకొని, కొన్నాళ్లు వారితో చాటింగ్ చేస్తారు. పర్సనల్ డేటా పూర్తిగా తెలుసుకుంటారు. ఆ తర్వాత బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెడతారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా అకౌంట్ల నుంచి అమ్మాయిల ఫొటోలు తీసుకొని వాటిని మార్ఫ్ చేసి మాయ చేస్తున్నారు. వారితో నమ్మకంగా ఉంటూనే పర్సనల్ ఫొటోలను సేకరిస్తుంటారు. ఆ తర్వాత వేరే నంబర్ల నుంచి ఫోన్లు చేసి సిబిఐ, కస్టమ్స్, ఐటి, జీఎస్టీ అధికారుల పేర్లతో బెదిరిస్తుంటారు. మరికొందరు సోషల్‌మీడియాలో అమ్మాయిల ప్రొఫైల్ సెర్చ్‌చేసి వాళ్ల ఫోన్‌నంబర్లు సేకరించి బ్లాక్ మెయిల్‌కు దిగుతారు. మార్ఫింగ్ ఫొటోలు వాట్సాప్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తుంటారు.

డేటింగ్ సైట్లతో జాగ్రత్త

సామాన్య ప్రజలు మొదలుకొని, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల వరకూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న ఉదంతాలు ఉన్నాయి. డేటింగ్ సైట్లలో అందమైన ప్రొఫైల్ ఫొటోలకు ఆకర్షితులై లైక్‌లు, వీడియోలు చేస్తే జీవితాలు దుర్భరంగా మారిపోతాయి. కేటుగాళ్ల ఊబిలోకి కూరుకుపోవటం ఖాయం. మరికొందరు పేరు, ఫోన్ నంబర్లు సేకరించి ఉదయం, రాత్రిళ్లు హాయ్, బై అంటూ మెసేజ్‌లు పెట్టి ముగ్గులోకి దించుతారు. అశ్లీల వీడియోలు పెడుతుంటారు. ఎవరైనా వారికి అనుకూలంగా మెసేజ్ పెట్టినా, ఎస్‌ఎంఎస్‌లు కంటిన్యూ చేసినా రికార్డు చేసుకుని ఆ తర్వాత బెదిరిస్తుంటారు. కొన్నిసార్లు మహిళలు మహిళలతో స్నేహం చేస్తూ, ఫొటోలు సేకరిస్తారు. అర్ధనగ్న వీడియోలు చేసి పంపించేలా ప్రేరేపిస్తారు. తీరా అలాచేస్తే అప్పటి నుంచి అసలు వ్యక్తులు బయటకు వచ్చి బెదిరింపులకు దిగుతుంటారు. డబ్బులివ్వకపోతే వీడియోలు వైరల్ చేస్తామంటారు. ఇలాంటి కేసులు కూడా అనేకం సైబర్ పోలీసులకు వస్తున్నాయి. అపరిచిత వ్యక్తులతో మాట్లాడకుండా ఉండటమే ఉత్తమ మార్గం. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఉండాలి. పదే పదే అవాంఛిత వీడియోలు, కాల్స్ మీ మొబైల్‌కి వస్తున్నాయి అంటే– మీ నెంబరు వారి టార్గెట్లో ఉన్నట్టు లెక్క. రెస్పాండు కాకుండా ఆ సైట్‌ని లేదా వారి మొబైల్ నెంబరును బ్లాక్ చేయండి.

ధైర్యంగా ఫిర్యాదు చేయండి

ఎవరైనా మహిళలు తమ ఫొటోలు మార్ఫింగ్‌నకు గురైతే భయపడాల్సిన పనిలేదు. అలాంటి ఫొటోలు సోషల్‌మీడియాలో పెట్టినా, పెడతామని బెదిరించినా సైబర్ క్రైం పోలీసులకు 1930 ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. లేదా www.stopncii.org ద్వారా న్యూడ్ చేసినా పిక్చర్, ఒరిజినల్‌ది అప్‌డేట్ చేయాలి. ఈ సైట్ పూర్తిగా భద్రతాపరమైంది. ఈ సంస్థ అవాంఛిత ఫొటోలలను సైట్ నుంచి పూర్తిగా తొలగిస్తుంది. ఎలాంటి వివరాలను బయటకు వెల్లడించదు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తం

ప్రస్తుతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ ద్వారా సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త ఎత్తుగడలతో నేరాలకు పాల్పడుతున్నారు. డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఆశలు చూపుతున్నారు. ఐవిఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) కాల్స్ ద్వారా ఎరవేస్తారు జాగ్రత్త. బ్యాంకుల నుంచి వచ్చే రికార్డు వాయిస్‌లకు స్పందించకూడదు. పార్శిళ్లు వచ్చాయనీ, అందులో డ్రగ్స్, ఆయుధాలు ఉన్నాయంటూ వచ్చే ఫోన్లకు స్పందించొద్దు. లోన్ ఇస్తామని చెప్పే లోన్ యాప్‌లను నమ్మొద్దు. పార్ట్‌టైమ్, వర్క్‌ఫ్రం హోమ్ అంటూ ప్రొడక్ట్స్, హోటళ్లకు లేటింగ్, లైక్స్ ఇవ్వటం ద్వారా డబ్బులు వస్తాయని చెప్పే యాప్స్, వెబ్‌సైట్లు మోసపూరితం. వాటిని నమ్మి మోసపోవద్దు. తరచుగా వాడుతున్న పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండాలి.

- సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలి.

policestation/ https:// cyber crime.gov.in **లో రిపోర్టు చేయాలి.**

–ఆవుల శ్రీనివాసరావు,
డిఎస్‌పి,
రేపల్లె, బాపట్ల జిల్లా.
సెల్ : 8333813225

అతడే నిజమైన స్నేహితుడు

లింగ సమానత్వంపై ప్రచారంలో మహేష్‌బాబు భాగమయ్యారు. బాలీవుడ్ నటుడు, ఫర్హాన్ అక్తర్, మహిళలపై అత్యాచారాలు, వివక్షకు వ్యతిరేకంగా నిలవడం, లింగ సమానత్వం కోసం 'మార్ద్' అనే సామాజిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమ ప్రచారంలో పాల్గొన్న మహేష్‌బాబు ఫర్హాన్ అక్తర్ తండ్రి, రచయిత జావేద్ అక్తర్ హిందీలో రాసిన కవిత తెలుగు వర్షెన్‌ను ఆలపించారు. 'గౌరవం, సానుభూతి మనిషికి ఉండాల్సిన నిజమైన లక్షణాలు. సమానత్వం కోసం నిలబడండి. ప్రతి పనిలోనూ దయను చూసేవాడు అసలైన పురుషుడు. ఈ అంతర్జాతీయ పురుషుల దినోత్సవం నాడు నాతో పాటు మీరూ మార్ద్‌లో చేరండి' అని పేర్కొన్నారు.

మహేష్ ఆలపించిన కవిత ఇదే..

'ఎవరి ప్రవర్తన మంచిగా ఉంటుందో
ఎవరికి ఆడవారంటే గౌరవం ఉంటుందో
ఎవరు మహిళల శరీరానికి, ఆత్మకు విలువనిస్తూ
వారి ఆత్మగౌరవానికి తోడుగా నిలుస్తారో
ఎవరు మగువ కూడా మనిషేనని ఒక్క క్షణం కూడా మర్చిపోరో
స్త్రీకి గుర్తింపు ఉండాలని ఎవరు మనస్ఫూర్తిగా అనుకుంటారో
ఎవరు పక్కన ఉంటే మహిళ ధైర్యంగా ఉంటుందో
అలాంటి వాడు స్త్రీకి నిజమైన స్నేహితుడు. సహచరుడు, ఆత్మీయుడు,
ఒక్క మాటలో చెప్పాలంటే వాడే మగాడు'.

ఈ కార్యక్రమంలో మహేశ్‌తో పాటు క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్, యువరాజ్ సింగ్, ఫర్హాన్ అక్తర్, గాయకుడు షాన్ భాగమయ్యారు. వారంతా ఒక్కో భాషలో ఈ కవితను వినిపించారు. ఈ ప్రచారంలో భాగంగా ఫర్హాన్ అక్తర్ మాట్లాడుతూ 'నేను అద్దంలో చూసుకున్న ప్రతిసారీ.. మా అమ్మ, సోదరి, భార్య, కుమార్తె గర్వంగా 'ఈయన మా మనిషి' అని చెప్పుకొనే ఓ వ్యక్తిగా కనబడాలి' అని అన్నారు.

డిసెంబర్‌లో కీర్తి-ఆంటోనీ డెస్టినేషన్ వెడ్డింగ్

టాలీవుడ్ హీరోయిన్ కీర్తిసురేష్ త్వరలో పెళ్లిపీట లెక్కబోతున్నారు. ఆమె గత కొంతకాలంగా ఆంటోని తట్టిల్‌తో ప్రేమలో ఉన్నారు. ఒకప్పటి హీరోయిన్ మేనక, నిర్మాత సురేష్‌కుమార్‌ల కుమార్తె కీర్తి సురేష్. బాలనటిగా ఆమె కెరీర్‌ను ప్రారంభించారు. 'నేను శైలజ' సినిమాతో హీరోయిన్‌గా మారారు. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో స్టార్ హీరోలతో కలిసి సినిమాలు చేశారు. ప్రస్తుతం రెండు తమిళ, ఓ హిందీ సినిమాల్లో ఆమె నటిస్తున్నారు. కొచ్చికి చెందిన ఆంటోని తట్టిల్‌తో ప్రేమలో ఉన్న ఆమె ఇప్పుడు పెళ్లి చేసుకోవటానికి సిద్ధపడుతున్నారు. డిసెంబర్ 11–12 తేదీల్లో గోవాలో వీరిద్దరూ డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోనున్నారు.

'మెకానిక్ రాకీ' ట్రైలర్ విడుదల



'విశ్వక్ సేన్' తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి ఎస్‌ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి మేకర్స్ ట్రైలర్ 2.0 పేరుతో ట్రైలర్ రిలీజ్ చేశారు. జేక్స్ బిజోయ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

వేణు ఉడుగుల 'రాజు వెడ్స్ రాంబాయి'

దర్శకుడు వేణు ఉడుగుల నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ సినిమాకు శైలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈటీవీ విన్‌తో కలిసి వేణు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో లీడ్ రోల్‌లో నటించే వారి గురించి ప్రకటించకుండానే తాజాగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'నా పేరు యనగంటి రాంబాయి.. మా నాన్న పేరు యనగంటి వెంకన్న అంటూ ఫిమేల్ వాయిస్‌తో టీజర్ మొదలవుతుంది. నేను మా ఊళ్లనే ఒక అబ్బాయిని ప్రేమించిన.. వాడి పేరు రాజు. నిజానికి ఒక అమ్మాయికి ప్రేమించడానికి కావాల్సిన అర్హతలు వాడి దగ్గర ఒక్కటి కూడా లేవు. కానీ వాడు బ్యాండు కొట్టుడు చూసి పడిపోయిన. బోగ్గుతోని మా ఇల్లందు మండలంకి ఎంతపేరు వచ్చిందో మా ప్రేమతో మా ఊరికి అంతా పేరు వచ్చింది. మా ప్రేమ ఒక తీన్మార్, ఒక దోమార్. ఒక నాగిని. ఇట్లాంటి మా కథను శైలు కంపాటి సార్ సినిమా తీస్తుండు' అంటూ టీజర్‌ను కట్ చేశారు మేకర్స్. చూస్తుంటే న్యూ ఏజ్ లవ్ స్టోరీలాగా ఉంది చిత్రం. ఇక తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల సరిహద్దుల మధ్య ఉన్న గ్రామంలోని నిజ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా వస్తోంది. ఈ సినిమాను ఫిబ్రవరి 14, 2025న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

ఫైనల్‌కు భారత్

మహిళల ఆసియాకప్ హాకీ టోర్నీ

రాజ్‌గిరి(బీహార్): మహిళల ఆసియాకప్ హాకీ టోర్నమెంట్ ఫైనల్లోకి భారత్ దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ 2–0గోల్స్ తేడాతో జపాన్‌ను చిత్తుచేసింది. తొలి మూడు క్వార్టర్లు ముగిసేసరికి ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆ తర్వాత నాల్గో క్వార్టర్ ప్రారంభంలోనే ఒక గోల్ కొట్టిన భారత్.. మ్యాచ్ ముగియడానికి నాలుగు నిమిషాల ముందు మరో గోల్ చేసింది. మూడో క్వార్టర్ 48వ ని.లో నవ్‌నీత్ తొలి గోల్‌ను నమోదు చేయగా.. 56వ ని.లో లాల్రేమ్సియామి మరో గోల్‌ను కొట్టింది. లీగ్ దశలో జపాన్‌ను చిత్తుచేసి గ్రూప్ టాపర్‌గా నిలిచిన భారత్.. సెమీస్‌పై జపాన్‌పై గెలుపుకు చెమటోడ్చాల్సి వచ్చింది. మొత్తం 11 పెనాల్టీ కార్నర్‌లు భారత్‌కు లభించినా.. జపాన్ గోల్ కీపర్ అద్భుతంగా నిలువరించింది. తొలి సెమీస్‌లో చైనా జట్టు 3–1గోల్స్ తేడాతో మలేషియాను ఓడించి ఫైనల్‌కు చేరింది. బుధవారం జరిగే టైటిల్‌పోరులో చైనా, భారత్ జట్లు తలపడనున్నాయి. 3వ స్థానం కోసం జపాన్, మలేషియా జట్లు తలపడనున్నాయి. ఇక 5వ స్థానం కోసం జరిగిన మరో పోరులో కొరియా జట్టు 3–0గోల్స్‌తో థాయ్‌లాండ్‌ను చిత్తుచేసింది.

అనుపమ సంచలనం

15వ సీడ్ బివెన్ జంగ్‌పై గెలుపు

షాంఘై: చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ మహిళా షట్లర్ అనుపమ ఉపాధ్యాయ పెను సంచలనాన్ని నమోదు చేసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 15వ స్థానంలో చైనాకు చెందిన బివెన్ జంగ్‌ను చిత్తుచేసింది. మూడుసెట్ల హోరాహోరీ పోరులో అనుపమ 21–17, 8–21, 22–20తో బెవెన్ జంగ్‌ను ఓడించింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో బి. సుమిత్‌రెడ్డి–సిక్కిరెడ్డి జంట 23–21, 17–21, 21–17తో అమెరికాకు చెందిన ప్రెస్లే స్మిత్–జెన్నీ గియాను ఓడించి రెండోరౌండ్‌కు చేరారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీల్లో ప్రియాన్షు రాజ్‌వత్ 24–22, 13–21, 18–21తో ఛికో డి వార్డోయా(ఇండోనేషియా) చేతిలో, ఆకర్షి కశ్యప్ 10–21, 18–21తో టొమోకి(జపాన్) చేతిలో పరాజయాన్ని చవిచూశారు.

అంధుల టి20 ప్రపంచకప్ నుంచి వైదొలిగిన భారత్

ముంబయి: పాకిస్తాన్ వేదికగా ఈనెల 23నుంచి జరగనున్న అంధుల టి20 ప్రపంచకప్ నుంచి టీమిండియా వైదొలిగింది. ప్రభుత్వ అనుమతి లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ విషయాన్ని భారత అంధుల క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి శైలేంద్ర యాదవ్ ధృవీకరించారు.

అంధుల టీ20 ప్రపంచ కప్ కోసం పాకిస్తాన్‌కు వెళ్లడానికి భారత ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. తొలుత ఈ టోర్నీలో పాల్గొనేందుకు క్రీడా మంత్రిత్వ శాఖ నో–అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ చేసింది. అయితే చివరి నిమిషంలో పాక్ పర్యటనకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రద్దు చేసింది.

ఈ టోర్నీలో భారత్‌తో పాటు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు కూడా పాల్గొనడం లేదు. భారత్ పాల్గొనకపోయినా ఎలాంటి నష్టం లేదని పాకిస్తాన్ అంధుల క్రికెట్ కౌన్సిల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ టోర్నీ జరిగిన మూడు ఎడిషన్లలో (2012, 2017, 2022) టీమిండియానే విజేతగా నిలిచింది. టోర్నీనుంచి భారత్ వైదొలగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కొద్ది రోజుల కిందట భారత ప్రభుత్వం పురుషుల కబడ్డీ జట్టును కూడా పాకిస్తాన్‌కు పంపని విషయం తెలిసిందే.

ఆస్ట్రేలియాకు కఠిన ప్రత్యర్థి భారత జట్టే

మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్



పెర్త్: టెస్ట్ క్రికెట్‌లో ఆస్ట్రేలియా జట్టుకు కఠిన ప్రత్యర్థి భారతజట్టేనని మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి) ఫైనల్ బెర్తును నిర్ణయించే బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ కోసం భారత్, ఆస్ట్రేలియాలకు ఈ సిరీస్ కీలకం కానుందని, ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య జరిగే ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ హోరాహోరీగా సాగడం ఖాయమని తెలిపాడు. గత పర్యటనల్లో ఆసీస్‌కు షాకిచ్చిన టీమిండియా హ్యాట్రిక్ విజయంపై కన్నేసిందని, రాబోయే బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాకు భారత జట్టు గట్టి సవాల్ విసురుతుందని పాంటింగ్ అన్నాడు. అంతేకాదు కంగారూ జట్టుకు కఠిన ప్రత్యర్థిగా టీమిండియా అవతరించిందన్నాడు. 'ఈమధ్య కాలంలో ఆస్ట్రేలియాకు తగ్గ పోటీదారుగా భారత జట్టు ఎదిగింది. ఇక ఇంగ్లండ్ గురించి ఆందోళన అవసరం లేదు. టీమిండియాపై దృష్టి పెట్టాలి. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత జట్టుతో ఆసీస్ తలపడింది. అనంతరం వన్డే వరల్డ్ కప్ ఫైనల్లోనూ ఇరుజట్లు ఢీకొన్నాయి. ఇప్పటి భారత జట్టు అన్ని విభాగాల్లో పటిష్టంగా కనిపిస్తోంది' అని పాంటింగ్ వెల్లడించాడు. ఈనెల 22నుంచి పెర్త్ వేదికగా భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి టెస్ట్ ప్రారంభం కానుంది.

రెండే రెండుసార్లు...

సుదీర్ఘ ఫార్మాట్‌లో వరుసపెట్టి శతకాలు బాదిన కింగ్ కోహ్లికి ఆస్ట్రేలియా టూర్ కీలకంగా మారింది. ఈసారి ఆస్ట్రేలియా గడ్డపై విరాట్ అలరిస్తాడా? లేదా? అనే సందేహం అందరిలో నెలకొంది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో విరాట్ ఒక్క సెంచరీ కొట్టలేకపోయాడు. నాలుగేళ్లలో టెస్టుల్లో కొట్టింది కేవలం రెండే రెండు సెంచరీలు. కోహ్లి టెస్ట్ కెరీర్‌లో ఇప్పటివరకు 29వ సెంచరీలు మాత్రమే చేశాడు. దీంతో ఫ్యాన్స్ వరల్డ్ క్లాస్ బ్యాటర్ అయిన విరాట్ బ్యాట్ నుంచి ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల శతకం జాలువారాలని ఎదురుచూస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68